
: fb.com/vaartha Digital
Published from Tadepalligudem, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Srikakulam
15-9-2025 సోమవారం సంపుటి: 31
సంచిక: 225 పేజీలు: 10+4 వెల: 6.50
తాడేపల్లిగూడెం
తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM

## పాక్‌కు మరో చావుదెబ్బ



సూర్యకుమార్ యాదవ్

# ఆసియాకప్‌లో భారత్ జయభేరి

**7 వికెట్ల తేడాతో ఘన విజయం**

**127 పరుగుల లక్ష్యాన్ని అలవోకగా ఛేదించిన భారత్**

**భారత్ బౌలర్ల దెబ్బకు పాక్ బ్యాటర్లు చిత్తు**

**కెప్టెన్సీ ఇన్నింగ్స్ ఆడిన సూర్యకుమార్ యాదవ్**

**ప్లేయర్ ఆఫ్ దిమ్యాచ్‌గా కుల్దీప్ యాదవ్**

### స్కోర్లు పాక్: 127/9, భారత్-131/3

**దుబాయి, సెప్టెంబరు 14:** యావత్‌క్రికెట్‌ప్రపంచం మొత్తం ఉత్కంఠభరితంగా ఎదురుచూసిన మ్యాచ్‌లో అందరూఊహించినట్లుగానే భారత్ ఘనవిజయం సాధించింది. ఆదివారం దుబాయి అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో పాకిస్తాన్‌తో తలపడిన భారత్‌జట్టు అత్యంత సులువుగా గెలుపు సాధించింది. ఏడు వికెట్ల తేడాతో పాకిస్తాన్ జట్టుపై ఘనవిజయం నమోదుచేసింది. ప్రపంచకప్‌లోనే కాదు ఆసియాకప్‌లో కూడా మాకు తిరుగులేదని భారత్‌జట్టు రుజువుచేసింది. చిరకాల ప్రత్యర్థిని మట్టికరిపించింది. మెగాటోర్నీలో రెండో విజయం సాధించింది. కుల్దీప్‌యాదవ్ విజృంభణతో 127 పరుగులకే ముందు పాకిస్తాన్ పరిమితం అయింది. ఛేదనలో అభిషేక్‌శర్మ 31పరుగులుచేసి మెరుపు ఆరంభం ఇచ్చాడు. ఆతర్వాత సూర్యకుమార్ యాదవ్ 47 పరుగులుచేసి నాటౌట్‌గా నిలిచి కెప్టెన్ ఇన్నింగ్స్‌తో పాక్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. మూడో వికెట్‌కు తిలక్‌వర్మ 31 పరుగులుచేయగా ఆతడికి జోడీగా 56 పరుగులు జోడించిన సూర్యజట్టు విజయానికి బాటలువేసాడు. చివరిలో శివందూబై తనదైన స్టైల్‌లో ఆడగా సిక్సర్‌తో భారత్‌కు ఏడు వికెట్ల విజయం వరించింది. అభిషేక్‌శర్మ కేవలం 13 బంతుల్లో నాలుగు ఫోర్లు రెండు సిక్సలతో 31పరుగులుచేస్తే శుభ్‌మన్‌గిల్ తక్కువ పరుగులకే ఔట్ అయ్యాడు. ఆ తర్వాత వచ్చిన సూర్యకుమార్ తిలక్‌వర్మలే మ్యాచ్‌ను నిలబెట్టారు. తిలక్‌వర్మ 31 శివమ్‌దూబే 10తో కలిసి సూర్యకుమార్ 47 పరుగులుచేసి జట్టు విజయానికి బాటలువేసారు. పాకిస్తాన్ బౌలర్లలో స్పిన్నర్ సెయిమ్ ఆయూబ్ మూడు వికెట్లు తీసాడు. మ్యాచ్‌లో గిల్ ఔట్ అయ్యాక క్రీజులోకి వచ్చిన కెప్టెన్ ఎస్కెవై రన్‌ఛేజ్‌కు తగ్గట్లుగా స్కోరు బోర్డును ముందుకు తీసుకెళ్లాడు. గతంలో పాక్‌పై పెద్దగా రాణించ చలేక పోయిన ఈ ప్లేయర్ ఈసారి మాత్రం పట్టుదలతో ఆడాడు. చివరి వరకూ క్రీజులో ఉండి కెప్టెన్ ఇన్నింగ్స్‌తో మ్యాచ్‌ను గెలిపించాడు. తిలక్‌వర్మ 31 బంతుల్లో 31 పరుగులుచేసే >>2



లండన్‌లోని వెస్ట్ మినిస్టర్ హాల్‌లో అవార్డ్ అందుకుంటున్న దేవాన్ష్

2లో

# 'దేవాన్ష్' ప్రపంచ రికార్డు

**'ఫాస్టెస్ట్ చెక్‌మేట్ సాల్వర్'గా వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్లోకి ఎక్కిన సిఎం చంద్రబాబు మనుమడు**

# వృద్ధిరేటు లక్ష్యం 15%

**పౌరసేవలు జవాబుదారీగా ఉండాలి**

**ఐదేళ్లలో 125 కేబినెట్ భేటీలు, 25 కలెక్టర్ కాన్ఫరెన్స్‌లు లక్ష్యం**

**నేడు, రేపు జిల్లా కలెక్టర్ల సదస్సు**

**మంత్రులు, కార్యదర్శులకు సిఎం చంద్రబాబు దిశా నిర్దేశం**



**విజయవాడ,సెప్టెంబరు 14,ప్రభాతవార్తప్రతినిధి:**ప్రభుత్వం అందిస్తున్న పౌరసేవలతో పాటు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజల్లో సంతృప్తే ముఖ్యమని సీఎం చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. దానికి అనుగుణంగానే మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పనిచేయాలని సీఎం ఆదేశించారు. ఈ నెల 15, 16 తేదీల్లో నిర్వహించనున్న కలెక్టర్ల కాన్ఫరెన్సుపై తన క్యాంపు కార్యాలయంలో మంత్రులు, వివిధ శాఖల ఉన్నతాధికారులతో ఆయన గత రాత్రి పొద్దు పోయేంతవరకు సమావేశమయ్యారు. పౌరసేవలు, సంక్షేమ పథకాలపై పబ్లిక్ పర్సెప్షన్‌ను విశ్లేషిస్తున్నామని సీఎం తెలిపారు. ఈ ఏడాది మొదటి త్రైమాసికంలో 10.5 శాతం వృద్ధి రేటుకు చేరుకున్నామని అన్నారు. 2029 నాటికి జీఎస్డీపీ రూ.29 లక్షల కోట్లకు చేరే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. 2034కు తలసరి ఆదాయం రూ.10.55 లక్షలకు చేరేలా కార్యాచరణ చేపట్టాల్సి ఉందన్నారు. ప్రస్తుతం జీఎస్డీపీలో వ్యవసాయం అనుబంధ రంగాలే కీలకంగా ఉన్నాయని అన్నారు. ఈ లక్ష్యాలకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో జిల్లా కలెక్టర్లు, రాష్ట్రస్థాయిలో విభాగాధిపతులు పనిచేయాల్సి ఉందని సీఎం స్పష్టం చేశారు. గత ఏడాది నుంచి ఇప్పటి వరకూ 25 కేబినెట్ సమావేశాలు నిర్వహించామని.. ఐదేళ్లలో 125 కేబినెట్ సమావేశాలతో పాటు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో భాగంగా అదే సంఖ్యలో రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశాలు నిర్వహణ లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు. అలాగే ఏడాదిలో ప్రతీ త్రైమాసికానికి ఒకసారి చొప్పున ఐదేళ్లలో 25 జిల్లా కలెక్టర్ సమావేశాలూ నిర్వహిస్తామన్నారు. గత ప్రభుత్వ హయాంలో 3 శాతం వృద్ధి తగ్గిన కారణంగా రాష్ట్రం సుమారుగా రూ.6 లక్షల కోట్ల సంపద కోల్పోయిందని అన్నారు.

**కలెక్టర్ల కాన్ఫరెన్సులో 8 అంశాల వారీగా చర్చ:** ఈసారి జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్సును విభిన్నంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. పౌరసేవలు, పథకాల అమలుపై జిల్లాల వారీగా జవాబు దారీతనం ఉండేలా ఈ కాన్ఫరెన్సు నిర్వహించ >>2



# గరళ కంఠునిలా విషమైనా మింగేస్తా

**ఈశాన్య ప్రజలు ఆరాధించే వ్యక్తిని అవమానించడమా?**

**హజారికాపై కాంగ్రెస్ ఘోరతప్పిదం**

**అసోం బహిరంగసభలో ప్రధాని మోడీ**

**గువాహతి,సెప్టెంబరు 14:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కాంగ్రెస్ పార్టీపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రముఖ గాయకుడు, భారతరత్న భూపేన్ హాజారికాను కాంగ్రెస్ పార్టీ ఘోరంగా అవమానించిందని, ఈశాన్య రాష్ట్రాల ప్రజల మనోభావాలను దెబ్బ తీయడం ఆ పార్టీకి అలవాటుగా మారిందని ఆయన ఆరోపించారు. ఆదివారం అసోంలోని దర్రాంగ్ జిల్లాలో పలు అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసిన అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన ప్రసంగించారు.మొత్తంగా రూ.18,500 కోట్ల విలువైనప్రాజెక్టులకు ఆయన భూమిపూజనిర్వహించారు. వీటిలో బయో ఇథనాల్; పోలిప్రొపైలెన్ ప్లాంట్లు కూడా ఉన్నాయి. తర్వాతజరిగిన సభలో మోదీ మాట్లాడుతూ, "భూపేన్ హాజారికాకు భారతరత్న ప్రకటించిన రోజు, పాటలు పాడేవారికి, డ్యాన్సులు చేసేవారికా మోదీ భారతరత్న ఇచ్చేది అని నాటి కాంగ్రెస్ అధ్యక్షుడు వ్యాఖ్యానించారు. ఆ మాటలు నన్ను తీవ్రంగా బాధించాయి" అని తెలిపారు. తనను ఎవరైనా దూషించినా తాను శివుడిలా విషాన్నిదిగమింగుతానని, కానీ ఈశాన్య ప్రజలు ఆరాధించే వ్యక్తిని అవమానిస్తే మాత్రం సహించలేనని ఆయన భావోద్వేగంగాఅన్నారు. అంతకుముందు, మంగళ్‌దోయ్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రధాని మోదీ పలు కీలక ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. కొత్త మెడికల్ కాలేజీ, ఆసుపత్రి, జీఎన్ఎం స్కూల్, బీఎస్సీ నర్సింగ్ కాలేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.

# మహిళా శక్తిలో భారత్ అగ్రగామి

**మహిళా సాధికారత ఒక్కరోజులో సాధ్యంకాదు..**

**ఆధ్యాత్మిక, సామాజిక ఉద్యమాల్లోనూ మహిళ కీలకపాత్ర**

**తిరుపతి జాతీయ సదస్సులో లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా**



ఆదివారం తిరుపతిలో మహిళా సాధికారత సదస్సును ప్రారంభిస్తున్న లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా. చిత్రంలో స్పీకర్, డిప్యూటీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, రఘురామకృష్ణరాజు

**తిరుపతి,సెప్టెంబరు 14ప్రభాతవార్తప్రతినిధి:** మహిళా శక్తికారణంగానే ఇవాళ ప్రపంచంలోనే భారత్‌ముఖ్యదేశంగా అవతరించిందని లోక్ సభస్పీకర్ ఓంబిర్లా అన్నారు. స్వాతంత్ర్యపోరాటంలోనూ మహిళలు కీలకపాత్ర పోషించారని తెలిపారు. ఆదివాసీ నేపథ్యం నుండి వచ్చిన మహిళ ప్రస్తుతం భారతరాష్ట్రపతిగా ఉన్నా రని ఆయన గుర్తుచేశారు. మహిళా సాధికారత ఒక్కరోజులో సాధ్యం కాదని, అనేక కార్యక్రమాలు చేపడుతూ ఉంటే సాధ్యమవుతుందని తెలిపారు. దేశంలో ఆధ్యాత్మిక సామాజిక ఉద్యమాల్లోనూ స్త్రీలు కీలకపాత్ర పోషించారని చెప్పారు. తిరుపతిలో ఆదివారం మొదలైన రెండురోజుల జాతీయ మహిళా సాధికారత సదస్సులో దేశంలోని అనేక రాష్ట్రాల నుండి పార్లమెంట్,శాసనసభ మహిళా ప్రజాప్రతినిధులతో కలసి తొలిరోజు జ్యోతివెలిగించి సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా లోక్‌సభస్పీకర్ బిర్లా మాట్లాడుతూ సమాజంలో మహిళలకు గౌరవం ఇవ్వడం అనాదికాలంనుండి వస్తున్న భారత సంప్రదాయమన్నారు. మహిళల భాగస్వామ్యంలేకుండా ఏ దేశం అభివృద్ధిచెందలేదని తెలిపారు. వారికోసం రాజ్యాంగం అనేక నిబంధనలు రూపొందించిందని, మహిళా శక్తితోనే భారత్ అగ్రగామిగా నిలుస్తోందన్నారు. భరతభూమిలో మహిళా నాయకత్వం శతాబ్దాలకు ముందే ప్రారంభమైందని ఆయన గుర్తుచేశారు. నేడు అనేక రంగాల్లో మహిళా నాయకత్వం బలోపేతమైందన్నారు. రాజకీయాలు, శాస్త్రసాంకేతిక రంగంతోబాటు చివరకు ఎంతో కీల కమైన సైన్యంలోనూ మహిళలు కీలకపాత్ర పోషిస్తుండటం చూసున్నామన్నారు. చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్ >>2



# 'డబుల్ ఇంజిన్'తో రాష్ట్రం సమగ్రాభివృద్ధి

**జిఎస్టీ సంస్కరణలతో దేశం మరింతముందుకు: జెపినడ్డా**

**విశాఖపట్నం, సెప్టెంబరు 14 ప్రభాతవార్త:** బిజెపి పార్టీ అనేది దేశాన్ని అభివృద్ధి పదంలో తీసుకెళ్లేందుకే అని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు జెపి నడ్డా అన్నారు . ఆదివారం రైల్వే గ్రౌండ్స్ లో నిర్వహించిన సారథ్యం సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందుగా కనకమహాలక్ష్మి అమ్మవారి ఆశీస్సులు తోపాటు మహావిష్ణువు సింహాచల కొండపై వరాహ లక్ష్మీనృసింహ స్వామి ఆశీస్సులు అందరికీ ఉండాలని కోరుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సారథ్యం సభలో విజయవంతంగా నిర్వహించారని 26వ జిల్లాగా విశాఖపట్నంలో ముగింపు సభ నిర్వహిస్తున్నామని ఈ సభకు హాజరు కావడం ఎంతో ఆనందంగా ఉందని ఆయన తెలిపారు. తెలుగు ప్రజలు ఆయనకు ఘనస్వాగతం పలికారని ఆయన అందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. ఎన్నికల ముందు తాను ఒకసారి తిరుపతి వెళ్లానని అక్కడ తాను వైసిపి పూర్తిగా అవినీతి లో ఊరికిపోయిందని వాటిని నిర్మూలించవలసిన అవసరం ఉందని ప్రజలకు చెప్పానని తెలిపారు. అయితే ఎన్నికలు జరిగింతర్వాత డబల్ ఇంజన్ సర్కార్కు ప్రజలు పట్టం కట్టారని ఆయన అన్నారు. 11 సంవత్సరాల తర్వాత వచ్చిన మార్పులు ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాకముందు ఏ విధంగా దేశం ముందుకు సాగిందో ఆలోచించేయాలని ప్రతి ఒక్కరిగా అయినా సూచించారు. నరేంద్ర మోడీ పేదవాడి అభివృద్ధి కోసం ఎటువంటి కార్యచరణ చేపడుతున్నారో >>2

## నాలుగు రోజులు వర్ష సూచన

**విజయవాడ,సెప్టెంబరు 14,ప్రభాతవార్తప్రతినిధి:** అల్పపీడనం,ద్రోణి ప్రభావంతో రాబోయే నాలుగు రోజులు రాష్ట్రంలో పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, ఒకటి, రెండు చోట్ల భారీ వర్షాలు.. కురిసేందుకు అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ ఆదివారం తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఉరుములతో కూడిన వర్షాలు పడేటప్పుడు చెట్ల కింద నిలబడరాదని సూచించారు. ఇక సోమవారం అల్లూరి సీతారామరాజు, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు >>2



ఆదివారం గంగమ్మకు జలహారతి ఇస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

# పెన్నకు నీరు విడుదల

**●సోమశిల జలాశయం నుంచి నదిలోకి నీటిని వదిలిన మంత్రి ఆనం ●3 జిల్లాలకు నీరు అందించేలా ప్రణాళికలు ● నెల్లూరుకు 150 టిఎంసిల నీటినిల్వ సామర్థ్యం ●టెంపుల్ టూరిజం అభివృద్ధికి చర్యలు**

**అనంతసాగరం (నెల్లూరు), సెప్టెంబరు 14, ప్రభాతవార్త :** చుట్టుప్రక్కల ఉన్న ఐదు జిల్లాల కంటే సోమశిల జలాశయానికి 150 టిఎంసిల నీటిని నిల్వ చేసుకున్న సామర్థ్యం నెల్లూరు జిల్లాకే ఉందని రాష్ట్ర దేవాదాయ-ధర్మాదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం సోమశిల జలాశయం నుండి 5,6గేట్ల ద్వారా పెన్నానదికి నీటిని విడుదల చేసి గంగమ్మకు జలహారతినిచ్చారు. అనంతరం విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జలాశయం సామర్థ్యాన్ని >>2

## తిరుపతిలో అత్యాధునిక బస్‌స్టేషన్

**రోజుకు లక్షమంది రాకపోకలు సాగించేలా నిర్మాణం: సిఎం**

**విజయవాడ,సెప్టెంబరు 14, ప్రభాతవార్తప్రతినిధి:** రోజురోజుకు పెరుగుతున్న యాత్రికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని తిరుపతిలో అత్యాధునిక బస్ స్టేషన్ నిర్మించాలని, అన్ని సౌకర్యాలతో ఆకట్టుకునేలా ఉండాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో నేషనల్ హైవేస్ లాజిస్టిక్స్ మేనేజ్మెంట్ లిమిటెడ్, ఏపీఎస్ఆర్టీసీ అధికారులతో సమీక్షను ముఖ్యమంత్రి నిర్వహించారు. నూతనంగా నిర్మించే బస్ స్టేషన్‌లో సుమారు 150 బస్సులు ఒకేసారి నిలిపి ఉంచేలా బస్ బే ఉండాలన్నారు. హెలిపాడ్ సౌకర్యంతో పాటు, రోప్‌వే,కమర్షియల్ కాంప్లెక్స్‌లు, >>2

# వృద్ధిరేటు లక్ష్యం15%

>> నున్నట్టు తెలిపారు. సరైన వ్యక్తి, సరైనచోట ఉండాలన్న లక్ష్యంతోనే కలెక్టర్లు, ఎస్పీలను బదిలీ చేశామని అన్నారు. తాను 4వ సారి ముఖ్య మంత్రి అయినా ప్రజాప్రయోజనాల కోసం నిరంతరం ఏదో ఒక కొత్త అంశాన్ని నేర్చుకుంటూనే ఉంటానని సీఎం అన్నారు. మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు కూడా మెరుగైన పాలన అందించే అంశంపై అధ్యయనం చేస్తూ ఉండాలని సూచించారు. రెండు రోజుల పాటు జరిగే కలెక్టర్ల సదస్సులో మొదటి రోజున జీఎస్డీపీ అంశంపై ప్రజెంటేషన్ లో భాగంగా సేవలు, పరిశ్రమలు, వ్యవసాయం, పర్యాటకం తదితర రంగాల పురోగతిపై సమీక్షిస్తామని తెలిపారు. జిల్లాలు ఈ రంగాల్లో ఎక్కడ ఉన్నాయన్న దానిపై కలెక్టర్ల నుంచి వివరాలు తెలుసుకుంటామన్నారు. ఇక రెండో అంశంగా సంక్షేమం, సూపర్ సిక్స్, అన్నా క్యాంటీన్లు, పీ4 తదితర అంశా లను సమీక్షించనున్నట్టు తెలిపారు. మూడో అంశంగా లాజిస్టిక్స్, మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల గురించిన ప్రజెంటేషన్ ఉంటుందని తెలిపారు. నాలుగో అంశంగా స్వచ్ఛాంధ్ర, సర్క్యులర్ ఎకానమీ, పంచాయితీరాజ్, మున్సిపల్ తదితర అంశాలపై జిల్లాల వారీగా పురోగతి తెలుసుకుంటామని సీఎం స్పష్టం చేశారు. ఇక రెండో రోజున ఐదో అంశంగా మానవ వనరుల అభివృద్ధి, వైద్యారోగ్యం, విద్య, స్కిల్ డెవలప్మెంట్, ఆరో అంశంగా ఐటీ, క్వాంటం వ్యాలీ, ఆర్టీజిఎస్, వాట్సప్‌లో పౌరసేవలు, డేటా లేక్, ఏఐ తదితర అంశాలను చర్చిస్తామని వివరించారు. ఏడో కేటగిరీలో రెవెన్యూ విభాగంలో భూములు, ఎక్సైజ్, వాణిజ్య పన్నులు, మైనింగ్, ట్రాన్స్‌పోర్ట్ లాంటి అంశాలపై జిల్లాల వారీగా వివరాలు తెలుసుకుంటామని స్పష్టం చేశారు. ఇక రెండో రోజు 8వ అంశంగా రాష్ట్రంలో శాంతిభద్రతలపై ఎస్పీలు, జిల్లా కలెక్టర్లతో సమీక్షిస్తామని తెలిపారు. ప్రభుత్వ విభాగాలు అందించే పౌరసేవలపై ప్రజల్లో సంతృప్త స్థాయిపైనా చర్చిస్తామని తెలిపారు. రాష్ట్రస్థాయి నుంచి క్షేత్రస్థాయి వరకూ విజన్ ను పటిష్టంగా అమలు చేయాలని సీఎం పేర్కొన్నారు.

**నెక్స్ జెన్ సంస్కరణలపై కమిటీ:** ఆర్టీజీఎస్ ద్వారా నేపాల్‌లో చిక్కుకు పోయిన తెలుగు వారిని వెనక్కు తీసుకువచ్చే ఆపరేషన్ విజయవంతమైందని సీఎం వ్యాఖ్యానించారు. మంత్రి నారా లోకేష్ సహా అధికారులు కృషి చేశారని, దీనిపై ప్రజల్లో ప్రభుత్వం పట్ల మంచి సానుకూల స్పందన వచ్చిందన్నారు. వివిధ సంక్షోభ సమయాల్లో సరిగ్గా స్పందిస్తేనే ప్రజల్లో విశ్వాసం, నమ్మకం పెరుగుతాయని సీఎం అన్నారు. అమరావతిలోని సీఆర్డీఏ భవనంలో మానవ వనరుల నైపుణ్యాభివృద్ధి సంస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. కేంద్రం ఇటీవల జీఎస్టీని రెండు స్లాబులకు కుదిస్తూ తెచ్చిన సంస్కరణ విజయవంతమైందని.. ఏపీలోనూ నాలా పన్ను రద్దు చేసి నెక్స్ జెన్ సంస్కరణను అమలు చేశామని సీఎం అన్నారు. దీనిపై మరింత అధ్యయనం చేసేందుకు మంత్రులు, అధికారులతో కమిటీ వేయాలని సీఎం సూచించారు. మరోవైపు చిన్న చిన్న కోర్టు వివాదాల కారణంగా ప్రభుత్వ సమయంతో పాటు ధనమూ వృధా అవుతోందని, ఆర్బిట్రేషన్ ద్వారా కొన్ని అంశాలను పరిష్కరించుకునే అంశంపై దృష్టి పెట్టాలని సీఎం సూచించారు. ఈ సమావేశానికి మంత్రులు, సీనియర్ అధికారులు హాజరయ్యారు.

**తెలుగు సంస్కృతి, చరిత్ర, సాహిత్యం, కళలు ఉట్టిపడేలా ఎన్టీఆర్ స్మృతివనం:** తెలుగువారి ఆత్మగౌరవం ఆత్మవిశ్వాసం కలగలిపి తెలుగు వైభవంగా అమరావతిలో నిర్మించే ఎన్టీఆర్ స్మృతివనం ప్రాజెక్టును చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దిశా నిర్దేశం చేశారు. తెలుగు సంస్కృతీ సంప్రదాయాలు, భాష, సాహిత్యం, కళలు, ప్రాచీన చరిత్ర తదితర అంశాలకు పెద్దపీట వేస్తూ దీనిని చేపట్టాలని సూచించారు. ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుపై సీఎం సమీక్షించారు. అమరావతిలోని నీరుకొండ వద్ద చేపట్టనున్న ఈ ప్రాజెక్టులోని అంశాలను అధికారులు సీఎంకు వివరించారు. ఈ ప్రాజెక్టులో భాగంగా ప్రాచీన తెలుగు చరిత్రతో పాటు ప్రజల మనస్సుల్లో నిలిచిపోయిన అల్లూరి, పొట్టిశ్రీరాములు లాంటి విశిష్ట వ్యక్తుల విగ్రహాలు, సంస్కృతీ సంప్రదాయాలు, భాష, లిపికి చెందిన వివరాలను కూడా తెలియచెప్పేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. తెలుగు ప్రజల ప్రతీకగా ప్రజా రాజధాని అమరావతిని కూడా ప్రతిబింబించేలా ప్రాజెక్టు చేపట్టాలన్నారు. 182 మీటర్ల ఎత్తైన ఎన్టీఆర్ విగ్రహ స్మృతి వనం ప్రాజెక్టుకు అనుబంధంగా నీరుకొండ రిజర్వాయర్ ను తీర్చిదిద్దాలన్నారు. ప్రత్యేకించి పర్యాటకులు పెద్ద ఎత్తున సందర్శించేందుకు అనువుగా ఆకర్షణల్ని ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. గుజరాత్ లో నిర్మించిన స్టాచ్యూ ఆఫ్ యూనిటీ ప్రాజెక్టును కూడా పరిశీలించాలని సీఎం పేర్కొన్నారు. అమరావతిని అనుసంధానిస్తూ కృష్ణా నదిపై చేపట్టనున్న ఐకానిక్ వంతెన డిజైన్లను కూడా సీఎం పరిశీలించారు. అంతర్జాతీయస్థాయి ప్రమాణాలతో కన్వెన్షన్ సెంటర్ నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందించాలన్నారు. అంతకముందు ఎన్టీఆర్ విగ్రహ నమూనాలను పరిశీలించారు.

# మహిళా శక్తిలో భారత్ అగ్రగామి

>> కల్పించేందుకు చట్టం తీసుకువచ్చామన్నారు. అభివృద్ధి చెందిన దేశాలలో మహిళలకు ప్రాధాన్యత కల్పిస్తున్నారన్నారు. మహిళలకు గౌరవం ఇవ్వడం భారతదేశంలో సంప్రదాయమని బిర్లా ఉద్ఘాటించారు.

**మహిళా సాధికారతకు ఎన్టీఆర్ ఎంతో కృషి: :రాజ్యసభడిప్యూటీ ఛైర్మన్ హరివంశ్‌సింగ్:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, దివంగత మాజీ సిఎం ఎన్టీరామారావు మహిళా సాధికారతకు ఎంతో కృషి చేశారని రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్‌సింగ్ తెలిపారు. తిరు పతిలో జాతీయ మహిళా సాధికారత సదస్సు ప్రారంభంలో ఆయన ఎన్టీఆర్‌ను గుర్తుచేసుకుని ప్రణామాలు తెలిపారు. మహిళల సాధి కారత కోసం ప్రధాని నరేంద్రమోదీ అనేక కార్యక్రమాలు చేపట్టారని వెల్లడించారు. బీహార్‌లో స్థానిక సంస్థల ఎన్నికల్లో 50శాతం మహి ళలకు రిజర్వేషన్లు, జన్‌ధన్ యోజనలో సగానికిపైగా ఖాతాలు మహిళలవేనని చెప్పారు. ప్రధాని మోదీ, ఆంధ్రప్రదేశ్ సిఎం చంద్రబాబు చేపడుతున్న మహిళల అభివృద్ధి, సంక్షేమంకు ప్రశంసలు కురిపించారు. తిరుపతి జిల్లా సత్యవేడు శ్రీసిటీలో చంద్రబాబు నాయుడు చొరవతోనే సగానికిపైగా మహిళలు ఉద్యోగాలు చేస్తుండటం అభినందనీయమన్నారు. దేశంలోనే తొలిసారిగా నైపుణ్యగణనను ఏపిలో చేపట్టారని సింగ్ తెలిపారు.

**మహిళా భాగస్వామ్యంతోనే 'వికసిత్‌భారత్':ఎంపి పురందేశ్వరి** మహిళల భాగస్వామ్యంతోనే వికసిత్ భారత్ సాకారమవుతుందని బిజెపి ఎంపి దగ్గబాటి పురందేశ్వరి తెలిపారు. మహిళా సాధికారత కోసం కేంద్రం ఎన్నో పథకాలు అమలుచేస్తోందన్నారు. 'భేటీ బచావో బేటీ పడావో, మహిళా సమ్మాన్‌నిధి వంటి అనేక పథకాలు మహిళల అభివృద్ధికి దోహదపడుతున్నాయని అన్నారు. మహిళలు అన్ని రంగాల్లోనూ ఆర్థిక సమానత్వం కోసం ప్రధాని మోదీ కృషి చేస్తున్నారని ఆమెతెలిపారు. ఇంకా ఈ సదస్సులో ఆంధ్రప్రదేశ్ గవర్నర్ జస్టిస్ అబ్దుల్‌నజీర్, శాసనసభ స్పీకర్ సిహెచ్. అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘు రామకృష్ణమరాజు, ఆంధ్రప్రదేశ్ ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్, దేశంలోని కేంద్రపాలి తప్రాంతాలు, వివిధ రాష్ట్రాలమహిళా మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్యేలు , ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



మహిళా సాధికార సదస్సులో పాల్గొన్న వారికి జ్ఞాపికలను అందజేస్తున్న దృశ్యం



మహిళా సాధికారత సదస్సుకు విచ్చేసిన ఏపి,తెలంగాణ మహిళా ప్రజాప్రతినిధులు

# ఆసియాకప్‌లో భారత్ జయభేరి

>> శివమ్ దూబే ఏడు బబంతుల్లో పది పరుగులుచేసి నాటౌట్‌గా నిలిచాడు. దీనితో 15.5 ఓవర్లలోనే భారత్‌మూడు వికెట్ల నష్టానికి 131 పరుగులుచేసి లక్ష్యాన్ని అధిగమించి విజయం సాధించింది. టాస్‌గెలిచి తొలుత బ్యాటింగ్‌చేసిన పాకిస్థాన్‌ను తొమ్మిది వికెట్ల నష్టానికి 127 పరుగులకే పరిమితంచేసారు. కుల్‌దీప్‌యాదవ్ 18 పరుగులిచ్చి మూడు వికెట్లు తీస్తే అక్షర్‌పటేల్ 18 పరుగులిచ్చి రెండు వికెట్లుతీసాడు. అలాగే జస్‌ప్రీత్‌బుమ్రా 28 పరుగులకు రెండు వికెట్లు తీసి పాక్ బ్యాటర్లను ఆడుకున్నారు. భారత బౌలర్ల దెబ్బకు పాకిస్థాన్ బ్యాటర్లు వణికిపోయారు. తొలి ఓవర్ మొదటి బంతికే సైమ్ ఆయూబ్ వికెట్ ను హార్ధిక్ పాండ్య పడేసాడు. తర్వాత ఓవర్‌లో బుమ్రా మహ్మద్ హ్యారిస్‌ను ఔట్‌చేసాడు. తర్వాత స్పిన్నర్లు కుల్దీప్‌యాదవ్ అక్షర్‌పటేల్‌లు కలిపి ఐదు వికెట్లు తీయడంతో పాక్ కోలుకోలేకపోయింది. ఒకదశలో 64 పరుగులకే ఆరువికెట్లు నష్టపోయిన పాక్ చివరిలో షాహీన్ అఫ్రిదీ 16 బంతుల్లో 33పరుగులుచేసి నాటౌట్‌గా నిలిచాడు.

వేగంగా ఆడటంతో దాయాది జట్టు తొమ్మిది వికెట్ల నష్టానికి కేవలం 127 పరుగులతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. పాక్‌పై గెలిచిన భారత్ జట్టు ఆసియాకప్ సూపర్-4లోకి ప్రవేశించింది. కుల్దీప్‌యాదవ్ కేవలం 18 పరుగులే ఇచ్చి 3 వికెట్లు తీసి ప్లేయర్ ఆఫ్‌ది మ్యాచ్‌గా నిలిచాడు.







# 'దేవాన్ష్' ప్రపంచ రికార్డు

## లండన్‌లో జరిగిన అవార్డు ప్రదానోత్సవంలో పాల్గొన్న మంత్రి లోకేష్

**విజయవాడ,సెప్టెంబరు 14,ప్రభాతవార్తప్రతినిధి:** ఫాస్టెస్ట్ చెక్ మేట్ సాల్వర్ గా వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డ్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మనవడు నారా దేవాన్ష్ అందుకున్నారు. విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ తనయుడు, పదేళ్ల యువ చెస్ ప్రాడిజీ నారా దేవాన్ష్ చదరంగంలో అత్యంత క్లిష్టమైన 175 పజిల్స్ ను వేగంగా పరిష్కరించారు. తద్వారా ఫాస్టెస్ట్ చెక్ మేట్ సాల్వర్ గా ప్రపంచ రికార్డ్ సాధించినందుకు గాను వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డ్స్2025 అందుకున్నాడు. లండన్ లోని వెస్ట్ మినిస్టర్ హాల్ లో జరిగిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో పాల్గొని 'ఫాస్టెస్ట్ చెక్ మేట్ సాల్వర్175 పజిల్స్' అవార్డ్ అందుకున్నాడు. ఈ కార్యక్రమానికి విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ హాజరయ్యారు. ఈ ఘనతను సాధించేందుకు నారా దేవాన్ష్ గతేడాది చెక్ మేట్ మారథాన్‌లో లాస్లో పోల్గార్ ప్రసిద్ధ చెస్ సంకలనం 5334 ప్రాబ్లమ్స్ అండ్ గేమ్స్ పుస్తకం నుంచి తీసుకున్న 175 సంక్లిష్టమైన చెక్ మేట్ పజిల్స్ ను వేగవంతంగా పరిష్కరించాడు. ఈ పజిల్స్ ఒకటి తర్వాత ఒకటి కష్టంగా మారుతూ వేగం, కచ్చితత్వం, ఆలోచనా నైపుణ్యాలను పరీక్షిస్తుంది. దేవాన్ష్ వీటన్నిటినీ అత్యంత తక్కువ సమయంలో పరిష్కరించడం ద్వారా రికార్డు సృష్టించారు. ప్రపంచ చెస్ రంగంలో అత్యుత్తమ యువ ప్రతిభావంతుల్లో ఒకరుగా దేవాన్ష్ కు వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లో స్థానం లభించింది. ఈ విజయానికి దేవాన్ష్ అకుంఠిత శ్రమతో పాటు, తల్లి నారా బ్రాహ్మణి, తండ్రి నారా లోకేష్, కోచ్ కే. రాజశేఖర్ రెడ్డి ప్రోత్సాహం అందించారు. ఈ విజయం గురించి మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ "ఈ రోజు వెస్ట్‌మినిస్టర్ హాల్‌లో దేవాన్ష్ ఈ గౌరవాన్ని అందుకోవడం ప్రత్యేకమైంది. అతని ముందుచూపు, ఆలోచనాశక్తి, ఒత్తిడిలో ప్రదర్శించిన సమయస్ఫూర్తి, చిన్న వయస్సులోనే పూర్తిగా ఆటకు అంకితం కావడం వంటి విభిన్న శైలి వల్ల ఈ విజయం సాధ్యమైంది. తండ్రిగా దేవాన్ష్ అవిశ్రాంత శ్రమని నేను దగ్గరగా చూశాను. ఈ గుర్తింపు అతని కృషికి నిజమైన బహుమతి. మేమంతా అతను సాధించిన ఈ ఘనతకు ఎంతో గర్వపడుతున్నాం అని అన్నారు. దీంతోపాటు దేవాన్ష్ మరో రెండు ప్రపంచ రికార్డులను కూడా గతంలో సొంతం చేసుకున్నాడు. 7డిస్క్ టవర్ ఆఫ్ హనోయ్‌ను కేవలం 1 నిమిషం 43 సెకన్లలో పూర్తి చేయడం, 9 చెస్ బోర్డ్స్ పై 32 పావులను సరైన పద్ధతి ద్వారా 5 నిమిషాల్లో అమర్చడంలో ప్రపంచ రికార్డులు సాధించాడు. ఈ రోజు లండన్‌లో జరిగిన అవార్డ్స్ కార్యక్రమంలో ఆయనకు లభించిన గుర్తింపు ఆయన కుటుంబానికి, అలాగే ప్రపంచ చెస్ రంగంలో భారత్ తరపున పెరుగుతున్న ఖ్యాతికి గర్వకారణంగా నిలిచింది.

**సంతోషంగా ఉంది : సిఎం చంద్రబాబు:** దేవాన్ష్ ప్రపంచ రికార్డు సాధించడంపై సీఎం చంద్రబాబు సంతోషంగా ఉందన్నారు., "మా దేవాన్ష్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డు 2025 అందుకోవడం గర్వంగా ఉంది" అని తెలిపారు. నెలల తరబడి చూపిన పట్టుదల, గురువుల మార్గదర్శకత్వం వల్లే ఈ విజయంసాధ్యమైందని చంద్రబాబు పేర్కొన్నారు. దేవాన్ష్ సాధించిన ఈ రికార్డు ఎంతో స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఈ సందర్భంగా ఆయన దేవాన్ష్‌ను శభాష్ ఛాంప్‌అంటూ ప్రశంసించారు. అంతర్జాతీయ వేదికపై దేవాన్ష్ ప్రతిభకు గుర్తింపు లభించడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.



5,6గేట్ల ద్వారా నీటిని విడుదల చేస్తున్న మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి

# పెన్నకు నీరు విడుదల

>> తొలుత అనుకున్న దానికన్నా 77 టిఎంసిల సామర్థ్యం వరకు పెంచినప్పటికీ కొన్ని పరిస్థితుల దృష్ట్యా 74 టిఎంసిల వరకు నీటిని నిలువ చేయడం జరుగుతుందన్నారు. కృష్ణానది నుండి శ్రీశైలం, నాగార్జునసాగర్, పులిచింతల, ప్రకాశం బ్యారేజీ ఏర్పాటు చేయడం వలన రాయలసీమ, నెల్లూరుకి నీటి నిల్వకు అవకాశం ఏర్పడిందన్నారు. ఇరిగేషన్ శాఖ అధికారులతో ఎప్పటికప్పుడు చర్చించి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. నంధ్యాల జిల్లా లో పర్యటించినప్పుడు కుందునది ప్రవాహం అధికంగా ఉందని అక్కడి నుండి నీరు పెన్నా నదికి చేరుకోవడం జరుగుతుందని గమనించామన్నారు. సోమశిల జలాశయం శంఖుస్థాపన నుండి ఎన్నో సందర్భాల్లోచేయడం జరిగిందని మంత్రి పేర్కొన్నారన్నారు. ఆదివారం నుండి 20 టిఎంసిల నీటిని విడుదల చేశామని అందులో కండలేరు జలాశయానికి, తెలుగు గంగ, కనుపూరు, కలువాయి కాలువలకు నీటిని విడుదల చేయడానికి తీసుకోవడం జరిగిందన్నారు. కండలేరు సామర్థ్యంమేరకు నీరు చేరుతుందన్నారు. ఫ్లడ్‌ఫ్లో 24 వేల క్యూసెక్కులు పెంచడానికి టైం పడుతుందన్నారు. టెంపుల్ టూరిజం పార్కుల ఏర్పాటు చేయడానికి ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రూపొందిస్తున్నామన్నారు. రెవెన్యూ అధికారులు, ఆర్‌డబ్ల్యుఎస్, పంచాయతీరాజ్ సిబ్బంది ఎప్పటికప్పుడు అవసరమైన రక్షణచర్యలు తీసుకోవాలని సూచించారు. లక్ష క్యూసెక్కుల పైన నీరు దాని ప్రభావం ఉంటుందన్నారు. ఆనం సంజీవరెడ్డి తెనాలి ద్వారా కరువు పీడిత మండలాలైన మర్రిపాడు, వింజమూరు, దుత్తలూరుకు నీటిని అందజేసి పనులు ప్రారంభించినట్లు మంత్రి ఆనం తెలిపారు. హైపవర్ కెనాల్ ద్వారా 60 నుంచి 70 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేస్తుందని అందులో భాగంగా దీపం2కింద సంవత్సరానికి మూడు సిలిండర్లు ఇవ్వడం, స్త్రీశక్తి, తల్లికి వందనం, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం వంటివి ఉన్నాయన్నారు. ల్యాండ్ టైటలింగ్ యాక్ట్ రద్దు చేసి రైతులకు మంచి జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈకార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

**మంత్రి ఆనంకు స్వాగతం పలికిన కేశవచౌదరి :** రాష్ట్ర దేవాదాయ-ధర్మాదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదివారం సోమశిలలో పర్యటించారు. తొలుత సోమశిల జలాశయం నుంచి దిగువకు నీటిని విడుదల చేసే సందర్భంగా సోమశిల ప్రాజెక్ట్ చైర్మెన్ వేలూరు కేశవచౌదరి మంత్రి ఆనంకు ఘనస్వాగతం పలికారు. అనంతరం శాలువాలతో సన్మానించి బొకే అందజేశారు.

# 'డబుల్ ఇంజిన్'తో రాష్ట్రం సమగ్రాభివృద్ధి

>> సబ్కా సత్ సబ్కా వికాస్ సైతాంతిక సిద్ధాంతంతో ముందుకు సాగుతున్నారు అన్నారు. కాశ్మీర్ రాష్ట్రానికి న్యాయం చేస్తామని చెప్పినట్లు చేశామని జనజీవన స్రవంతిలో భాగస్వామ్యం చేశామని చెప్పారు. రామజన్మభూమి లో రాముని ఆలయం నిర్మించామని ముస్లిం సమాజానికి ముస్లిం మహిళలకు కాపాడుకునేందుకు ప్రయత్నిస్తున్నామని పార్లమెంట్లో సవరణ తీసుకు వస్తున్నామని ఆయన తెలిపారు. బిజెపి అనేది కార్యకర్తల పార్టీ అని ప్రపంచంలో అత్యధిక రాజకీయ పార్టీగా బిజెపి ఉందని ఆయన చెప్పారు. 2024లో నరేంద్ర మోడీ బాధ్యతలు స్వీకరించిన నాటికి ఆర్థిక పరిస్థితి నత్త నడక నడిచేదని ఆయన తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయాల వల్ల ఇప్పుడు మొదటి స్థానంలో ఉందని ఇది గర్వంగా చెప్పుకుంటున్నామన్నారు. రాబోయే తరానికి జీఎస్టీ 2.0 నీ తీసుకొని సంస్కరణలో తీసుకువచ్చామని దేశంలో సెప్టెంబర్‌లో దసరా దీపావళి ఒకే నెలలో వచ్చినట్టు ఉంటుందని అన్నారు. ఆరోగ్య బీమాకు జీఎస్టీ పూర్తిగా తీసివేస్తున్నామని దేశం ఆరోగ్య దేశంగా ఉండాలని మోడీ ప్రధాన ఉద్దేశం అని చెప్పారు. రక్షణ రంగంలో ఏడు రెట్లు ప్రగతి సాధించామని మందులు తయారీ అభివృద్ధిలో కూడా పరుగులు పెట్టిస్తున్నారన్నారు. ఆంధ్ర రాష్ట్రం ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు నేతృత్వంలో అభివృద్ధి జరుగుతుందన్నారు. అమృత్ భారత్ గా వందే భారత్ పేరుతో రైలు, విమానాశ్రయాలు అభివృద్ధి చేస్తున్నామని, భోగాపురం నిర్మాణం జరుగుతుందని ఆయన తెలిపారు. 17 మెడికల్ కళాశాలలు కట్టిస్తున్నామని అమరావతి రాజధాని కట్టేందుకు సహకరిస్తున్నామని అని చెప్పారు. ముఖ్యంగా దక్షిణ కోస్తా ప్రాంతంలో కొత్త రైల్వే జోన్ ఏర్పాటు చేయడానికి కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి పూర్తిగా సహకరిస్తుందన్నారు. పాలన ఏ విధంగా ఉందో ప్రజల్లోకి తీసుకువెళ్లే బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని చెప్పారు. 15 నెల ముందు ఆంధ్రప్రదేశ్ పూర్తి అంధకారంలోకి వెళ్లిపోయిందని ఇప్పుడు ఆంధ్రాని చంద్రబాబు నాయుడు వెలుగులోకి తీసుకు వస్తున్నారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి భూపతి రాజు శ్రీనివాసరాజు, రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్, ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, మాజీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు, కృష్ణయ్య, సత్యనారాయణ, పరశురామరాజు, శివ ప్రకాష్ రెడ్డి, ఆడారి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళల భద్రతకు కేంద్రం

## పెద్దపీట: మంత్రి అనిత

**తిరుపతిరూరల్,సెప్టెంబర్14 ప్రభాతవార్త:** మహిళల భద్రత కోసం కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని రాష్ట్ర హోమ్‌శాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. తొలి జాతీయ మహిళా సాధికార సదస్సుకు విచ్చేసిన మంత్రి మీడియాతో మాట్లాడారు. తల్లిని చెల్లిని ఏవిధంగా గౌరవిస్తారో అలానే ఇతర మహిళలను కూడా గౌరవించాలన్నారు. మహిళలు ఆత్మస్థైర్యంతో ముందుఅడుగు వేస్తే, అనుకున్న సాధించవచ్చునని తెలిపారు. వ్యక్తిత్వ హననం వల్ల మహిళలు ఆత్మస్థైర్యం కోల్పోతున్నారన్నారు. మహిళల శక్తిని దిగజార్చితే దేశమనుగడే ప్రశ్నార్థకంగామారుతుందన్నారు. రాష్ట్రంలో మహిళల సంరక్షణకు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, మంత్రి లోకేష్‌లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మహిళను మహిళాగానే చూడాలి తప్ప...ఆట వస్తువుగా చూడరాదన్నారు. మహిళలు భయం, అందోళనలు మన స్సులోంచి తీసివేయాలన్నారు.

# వారం - వర్జ్యం

15-09-2025, సోమవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
భాద్రపద మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, కృష్ణపక్షం
నవమి రా. 1.33
మృగశిర ఉ. 7.32
వర్జ్యం : మ. 3.40-5.13
దు.మ. 12.29-1.18,
2) మ. 2.55-3.44
రాహుకాలం - ఉ. 7.30-9.00

# వార్తాఫలం

**మేషం :** దీర్ఘకాలిక సమస్యలు తీరి ఊపిరి పీల్చుకుంటారు. సభలు, సమావేశాలలో పాల్గొంటారు.

**వృషభం:** అప్పులు ఇవ్వడం, అప్పులు తీసుకోవడం రెండు లాభించవు. ప్రయాణాలు.

**మిథునం:** పురోభివృద్ధిలో స్వల్ప మందగమనం ఏర్పడుతుంది. సోదరుల కలయిక.

**కర్కాటకం:** ముఖ్యమైన పత్రాలపై సంతకాలు చేయునప్పుడు బాగా పరిశీలించి సంతకాలు చేయటం మంచిది.

**సింహం:** మీ మౌనము మీ సహనము మీరు మేలు చేస్తాయి. కాంట్రాక్టులు దక్కుతాయి.

**కన్య :** శారీరకంగా, మానసికంగా అలసట, పని భారము అధికమవుతాయి. వస్త్ర లాభం.

**తుల :** స్థిరత్వము, ధైర్యము వలన చాలా ఫలితములు అనుకూల దిశలో పయనిస్తాయి.

**వృశ్చికం:** నూతన ప్రయత్నాలలో ఆటంకాలు ఎదురైనా అధిగమిస్తారు. క్రయ విక్రయాలలో ప్రోత్సాహం.

**ధనుస్సు:** వ్యవహారాలలో సన్నిహితుల సహాయం అందుతుంది. ఉద్యోగయత్నాలు ఫలిస్తాయి.

**మకరం:** విదేశీ పర్యటన అవకాశాలు ఉంటాయి. స్త్రీలతో విభేదాలు రాకుండా జాగ్రత్త వహించండి.

**కుంభం:** గృహ సంబంధమైన ఖర్చులను తగ్గించే యత్నమును, అదాయమునకు అదనపు మార్గములను అన్వేషిస్తారు.

**మీనం :** కొద్దిపాటి స్పర్థలు, చర్చలు వంటివి ఇబ్బందిని కలిగించినా, ముఖ్యమైన కార్యక్రమాలను పూర్తిచేస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# అత్యాధునిక బస్‌స్టేషన్

>> మాల్స్, మల్టీ ప్లెక్స్‌లతో డిజైన్లు రూపొందించాలని అధికారులకు సూచించారు. రెండు బస్ ఎంట్రీలు, ఎగ్జిట్ వేలు 2 ఏర్పాటు చేయాలని, సోలార్ రూఫ్ టాప్‌తో సొంత విద్యుత్ అవసరాలు తీర్చుకునేలా చూడాలన్నారు. మొత్తం 13 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించ తలపెట్టిన ఈ బస్ స్టేషన్ కనీసం లక్ష మంది నిత్యం రాకపోకలు సాగించేందుకు వీలుగా నిర్మాణం చేయాలన్నారు. భవిష్యత్‌లో అన్నీ ఎలక్ట్రికల్ బస్సులే నడపనున్న నేపథ్యంలో ప్రతీ బస్సుకు చార్జింగ్ సౌకర్యం ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చెప్పారు. దీనికి సంబంధించి మొత్తం 5 మోడల్స్‌ను ముఖ్యమంత్రి పరిశీలించారు. వాటిని మరింత అభివృద్ధి చేయాలన్నారు. దీనికోసం స్టేక్ హోల్డర్లతో సమావేశం నిర్వహించాలన్నారు. అలాగే రాష్ట్రంలో అన్ని బస్ స్టేషన్లు ఆధునీకరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం సూచనలు చేశారు. తిరుపతితో పాటు కీలక నగరాల్లో బస్ స్టేషన్ల అభివృద్ధి చేయాలన్నారు, ఆయా నగరాల్లో అవసరత బట్టి ప్రాంతీయంగాను బస్‌బేలు పెరగాలన్నారు. దీని వలన కీలక ప్రాంతాల్లో బస్సులు అందుబాటులో ఉండటమే కాకుండా, ప్రధాన స్టేషన్‌పై వత్తిడి తగ్గుతుందన్నారు. జాతీయరహదారులకు అందుబాటులో బస్‌స్టేషన్లు ఉండాలన్నారు.

# నాలుగు రోజులు వర్ష సూచన

>> కురిసే అవకాశం ఉందని ప్రఖర్ జైన్ తెలిపారు. మిగతా జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఆదివారం సాయంత్రం 5 గంటల నాటికి గుంటూరులో 81మిమీ, పల్నాడు జిల్లా తుర్లపాడులో 54.5మిమీ, పెద్దకూరపాడులో 40.2మిమీ, గుంటూరు జిల్లా వంగిపురంలో 39.5మిమీ, కోనసీమ జిల్లా ముక్కములలో 39మిమీ చొప్పున వర్షపాతం నమోదైందన్నారు. గుంటూరు కురిసిన భారీ వర్షం నగరాన్ని అతాకుతలం చేసింది. కీలక రహదారులన్ని కాల్వలుగా మారాయి. జాతీయరహదారిపై వర్షపు నీరు ప్రవహించింది.

# ఆర్‌డిటి లైసెన్సులు పునరుద్ధరించాలి

## ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి సువర్ణరాజు

**విజయవాడ, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త :** ఆర్‌డిటి లైసెన్సులు పునరుద్దరించాలని ఏపి ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి సువర్ణరాజు డిమాండ్ చేశారు. పలు దశాబ్దాలుగా గ్రామీణ ప్రజల అభివృద్ధికి, బలహీన వర్గాల సుస్థిర జీవితానికి ఆశాజ్యోతి వలే నిలిచిన ఆర్‌డిపై ఇటీవల కుట్రలు జరుగుతున్నాయని, ఎఫ్‌ఆర్‌సిఎ లైసెన్సు రద్దు, నకిలీ ఆరోపణలు, మతమార్పిడి పేరిట వ్యాపిస్తున్న తప్పుడు ప్రచారాలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వాలపై ప్రజలకున్న అసంతృప్తిని సేవా సంస్థలపైకి మళ్లించడం, అంతర్జాతీయ నిధులపై నియంత్రణ పెంచే ప్రయత్నం జరుగుతున్నాయని వాటిని వెంటనే నిలువరించాలని లేకుంటే ప్రజా ఉద్యమంగా ఎదిరిస్తామన్నారు.

# రాజంపేట టు పుంగనూరు ఎర్రచందనం స్మగ్లింగ్

## 20 దుంగలు స్వాధీనం: ఒకరి అరెస్టు



**ప్రభాతవార్త ప్రతినిధి, పుంగనూరు సెప్టెంబర్ 14**
తమిళనాడు రాష్ట్రంలోని క్రిష్ణగిరి సెంట్రల్ జైలులో కలిసిన నలుగురు నేరస్తులు ముఠాగా ఏర్పడి ఎర్రచందనం స్మగ్లింగ్ చేసి చివరకు పుంగనూరులో పట్టుబడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. క్రిష్ణగిరి చెందిన మణివన్, తిరువన్నామలై కి చెందిన రవి, కర్ణాటక హుస్కోట కు చెందిన సయ్యద్ ఆరిఫ్, తమిళనాడు హోసూరు కు చెందిన సర్దార్ అనే నిందితులు కృష్ణగిరి జైలులో శిక్ష అనుభవిస్తున్న సమయంలో స్నేహితులయ్యారు. శిక్ష ముగిసిన తర్వాత విడుదలైన ఈ నలుగురు ఎర్రచందనం స్మగ్లింగ్ కు పథకం రచించారు. అనుకున్నది తడవుగా కడప జిల్లా రాజంపేట అడవుల నుంచి 20 ఎర్రచందనం దుంగలను సేకరించారు. శనివారం వీటిని రవాణా చేసేందుకు ఒక ఇన్నోవా వాహనాన్ని ఏర్పాటు చేసుకుని, దుంగలను అందులో తరలించారు. అర్ధరాత్రి వేళ అక్రమ మార్గాల గుండా వాహనం ప్రయాణిస్తున్న తీరును పోలీసు నిఘా వర్గాలు గమనించాయి. పలమనేరు డి.ఎస్.పి ప్రభాకర్ ఆదేశాల మేరకు పుంగనూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ సుబ్బరాయుడు, ఎస్సై హరి ప్రసాద్ సిబ్బంది కలసి ఈ వాహనాన్ని పుంగనూరు సుగాలి మిట్ట మార్గంలోని నేతిగుట్లపల్లి వద్ద అడ్డగించారు. అప్పటికే వాహనం ముందర రెండు ద్విచక్ర వాహనాల్లో మార్గం చూపుతూ ప్రయాణిస్తున్న ఇద్దరు నిందితులు పరారయ్యారు. కారులో ప్రయాణిస్తున్న మరో నిందితుడు కూడా పరారు కాగా వాహనంతో పాటు సర్దార్ అనే నిందితులు పోలీసులకు పట్టుబడ్డాడు. ఇతనిని విచారించగా తక్కిన ముగ్గురు నిందితుల వివరాలు తెలిసాయి. మొత్తం 20 ఎర్రచందనం దుంగలను, మీరు ప్రయాణిస్తున్న వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎర్రచందనం విలువ 34 లక్షల రూపాయలుగా నిర్ధారించారు. తక్కిన ముగ్గురు నేరస్తులను కూడా అదుపులో తీసుకున్నందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు డిఎస్పి ప్రభాకర్ తెలిపారు. రాజంపేట అడవుల నుంచి పుంగనూరు అడవుల వరకు పల్లె దారులలో ఎర్రచందనం స్మగ్లింగ్ చేస్తూ గతంలో పలు వాహనాలు పట్టుబడ్డాయి. పుంగనూరు అడవులను అడ్డుగా పెట్టుకుని ఎర్రచందనం రాత్రికి రాత్రే చెన్నై హార్బర్ చేర్చేందుకు సినీ ఫక్కిలో నేరస్తులు చేస్తున్న విశ్వ ప్రయత్నాలను పోలీసులు భగ్నం చేస్తున్నారు.



విజయవాడ బస్‌స్టేషన్‌లో మంచినీటి పాయింటును పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

### ప్రయాణికుల ఆరోగ్య భద్రతకు భరోసా కల్పించాలి

**- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ**

**విజయవాడ,సెప్టెంబరు 14,ప్రభాతవార్తప్రతి నిధి:** ప్రయాణికుల భద్రత, బస్టాండు పరిశుభ్రతలో రాజీపడే ప్రసక్తే లేదని.. ఆహార పదార్థాల విక్రయశాలలు కచ్చితంగా ఆహార భద్రతా ప్రమాణాలు పాటించాల్సిందేనని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ స్పష్టం చేసారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆదివారం కలెక్టర్ విజయవాడ పండిట్ నెహ్రూ బస్టేషను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్లాట్‌ఫాంలతో పాటు ఆహార విక్రయ దుకాణాలు,హోటళ్ళు మంచినీటి పాయింట్లు, మరుగుదొడ్ల పరిసరాలను పరిశీలించారు. ఏ సమయంలోనైనా అపరిశుభ్రత అనే మాట వినిపించకూడదని.. ప్రయాణికుల ఆహార భద్రతకు భరోసా కల్పించేలా పరిశుభ్రతా చర్యలు తీసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధుల నేపథ్యంలో పక్కా ప్రణాళికలతో నిరంతర పర్యవేక్షణతో ప్రయాణికులు సంతృప్తి చెందేలా సౌకర్యాలతో సేవలందించాలన్నారు. ప్రాంగణంలోని దుకాణాలు, స్టాళ్లు తప్పనిసరిగా ధరల పట్టికలను ప్రదర్శించాలని ఆదేశించారు. ప్రయాణికులకు చాలా సులభంగా అర్థమయ్యేలా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. పాత డస్ట్ బిన్ల స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేయాలని.. ఈగలు, దోమలు లేకుండా యాంటీ లార్వాల్ చర్యలు, పారిశుధ్య చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు, సిబ్బంది నిరంతర పర్యవేక్షణ తప్పనిసరి అని కలెక్టర్ లక్ష్మీశ స్పష్టం చేశారు.

### ఎపి ట్రాన్స్‌కో ఇన్‌ఛార్జి జెఎండిగా పృథ్వీతేజ్

**విజయవాడ,సెప్టెంబరు 14,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపి ట్రాన్స్‌కో ఇన్‌ఛార్జి జెఎమ్‌డిగా పృథ్వీతేజ్‌ను ప్రభుత్వం నియమించింది. ఇందుకు సంబంధించిన జిఓ 86ను ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ శుక్రవారం విడుదల చేశారు. ట్రాన్స్‌కో జెఎమ్‌డిగా ఉన్న కీర్తిని తూర్పుగోదావరి జిల్లా కలెక్టరుగా నియమించారు. ఎపిఇపిడిసిఎల్ సిఎమ్‌డిగా ఉన్న పృథ్వీతేజ్‌కు ట్రాన్స్‌కో జెఎమ్‌డికి ఎపి పవర్ కో ఆర్డినేషన్ కమిటీ మెంబర్ కన్వీనర్‌గా ప్రభుత్వం బాధ్యతలు అప్పగించింది.

## నాలుగో ఆర్థిక సంఘం అమలు పొడిగింపు

**విజయవాడ, సెప్టెంబరు 14,ప్రభాతవార్తప్రతినిధి:** నాలుగవ ఆర్థిక సంఘం అమలు గడువును రాష్ట్ర ప్రభుత్వం పొడిగించింది. కొద్ది రోజుల క్రితమే ఐదో ఆ ర్థిక సంఘం తన నివేదికను ముఖ్యమంత్రికి సమర్పించారు, ఎప్పుడో కాలపరిమితి దాటిపోయిన నాలుగో ఆర్థిక సంఘం సిఫార్సుల అమలు కాలాన్ని మరికొంత కాలం పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. నాలుగో ఆర్థిక సంఘం కాలంలో చేయాల్సిన అనేక కార్యక్రమాలు ఇంకా పూర్తి కాకపోవడంతో దానిని వచ్చే ఏడాది మార్చి 31వ తేదీ వరకు పొడిగిస్తూ ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీచేసింది. 2018 లోనే నాలుగ ఆర్థిక సంఘాన్ని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. మూడేళ్ల పాటు కొనసాగే ఈ ఆర్థిక సంఘం ఇచ్చే నివేదికలను 2021 నుంచి 2024 మధ్య కాలంలో అమలు చేయాలని కూడా నిర్ణయించారు. ఇదే సమయంలో నాలుగో ఆర్థిక సంఘం కాలపరిమితి ముగిసిపోయిన రెండేళ్ల వరకు కొత్త ఆర్థిక సంఘాన్ని ఏర్పాటు చేయకపోవడంతో కొంతమంది న్యాయస్థానాన్ని ఆశ్రయించగా, 2023 లో ఐదో ఆర్థిక సంఘాన్ని ఏర్పాటుచేశారు. అయితే ఇప్పటికీ నాలుగో ఆర్థిక సంఘం నివేదిక మాత్రం పూర్తిగా అమలు కాకపోవడం గమనార్హం ప్రధానంగా స్థానిక సంస్థల అభివృద్ధికి చేయాల్సిన కార్యక్రమాలు ఆగిపోయాయన్న విమర్శలు కూడా ఉన్నాయి. 2024లోనే ఈ నివేదిక అమలు పూర్తికావాల్సి ఉందని, అయితే అనేక కారణాలతో ప్రగతి కనిపించ లేదని అధికారులు చెబుతున్నారు. అందుకే ఈ అమలు కాలాన్ని మరికొంత కాలం పొడిగించాల్సి వచ్చిందని వారంటున్నారు. కాగా ఐదో ఆర్థిక సంఘం కూడా కొద్ది రోజుల క్రితమే తన నివేదికను ముఖ్యమంత్రికి సమర్పించింది. దీని అమలు కూడా ప్రారంభం కావాల్సి ఉంది. ఇంకా నాలుగో ఆర్థిక సంఘం సిఫార్సులే పూర్తిగా అమలు కాని నేపథ్యంలో ఇక ఐదో ఆర్థిక సంఘం సిఫార్సుల అమలు ఎప్పుడు ప్రారంభమవుతాయె చూడాల్సి ఉంది.

### సిఎం చంద్రబాబు తిరుపతి పర్యటన రద్దు

**విజయవాడ,సెప్టెంబరు 14,ప్రభాత వార్తప్రతినిధి:** ఏపీ సీఎం చంద్రబాబు ఆదివారం తన తిరుపతి పర్యటనను రద్దు చేసుకున్నారు.తిరుపతిలో నేటి నుంచి రెండు రోజుల పాటు జరుగుతున్న జాతీయ మహిళా సాధికారిత సదస్సుకు ముఖ్యఅతిథిగా ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరుకావాల్సి ఉంది. అయితే అధికారుల సూచనలను అనుసరించి సీఎం తన పర్యటనను రద్దు చేసుకున్నారు. వాతావరణం అనుకూలించకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు అధికారికంగా ప్రకటించారు., అమరావతి తిరుపతి మార్గంలో దట్టమైన మేఘాలు కమ్ముకోవడంతో హెలికాప్టర్ ప్రయాణం సురక్షితం కాదని ఏవియేషన్ అధికారులు తెలిపారు. దీంతో సిఎం చంద్రబాబు పర్యటనకు అనుమతి ఇవ్వలేదు. మరోవైపు, తిరుపతిలోని రాహుల్ కన్వెన్షన్ హాల్లో జరిగే మహిళా సాధికారతపై జాతీయ సదస్సులో లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా, ఏపీ స్పీకర్ అయ్యన్న పాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణ రాజు, బీజేపీ ఎంపీ పురందరేశ్వరి సహా పలు రాష్ట్రాలకు చెందిన 100 మంది ప్రముఖులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం నేటి నుంచి రెండు రోజుల పాటు జరుగుతుంది.

## తిరుమలలో బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు

**- వాహనసేవల వీక్షణకు 35 ఎల్ఇడిస్క్రీన్లు**



**తిరుమల,సెప్టెంబర్14ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామికి పదిరోజుల్లో ఆరంభంకానున్న సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలకు విచ్చేయనున్న సామాన్యభక్తులకు అసౌకర్యం కలగకుండా విస్తృత ఏర్పాట్లుచేస్తున్నట్లు టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు తెలిపారు. ఇప్పటికే తిరుమలలో ఆలయ మాఢవీధుల్లో ఏర్పాట్లు దాదాపు పూర్తికావస్తున్నాయన్నారు. ఈ ఏడాది బ్రహ్మోత్సవాల్లో వాహనసేవల వీక్షణకు భక్తులకు తిరుమలఅంతటా 35 ఎల్ఇడి స్క్రీన్లు ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లుపై ఆదివారం సాయంత్రం టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, సివిఎస్ఒ మురళీకృష్ణ, సిఇ సత్యనారాయణ, సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవితో కలసి ఛైర్మన్ బిఆర్‌నాయుడు మాఢవీధుల్లో తనిఖీ చేశారు. పదిరోజుల్లో మొదలుకానున్న స్వామివారి వాహనసేవల వీక్షణకు విచ్చేసే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. మాఢవీధుల్లో ప్రత్యేక గ్యాలరీలు ఏర్పాటు,అందులో ఉండే భక్తులకు నిరంతరాయంగా అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. గరుడసేవరోజు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా భద్రత, సౌకార్యలు ఏర్పాటుచేస్తామన్నారు. వైద్యసేవలు, మరుగుదొడ్లు, తాగునీరు. అన్నప్రసాదాలు, కాఫీ, పాలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఆలయ మాఢవీధుల్లో, ఆలయం ముందు, వాహనమండపం ప్రాంతాల్లో గ్యాలరీలు ఏర్పాటు పనులు పూర్తిదశకు చేరుకున్నాయి. వాహనసేవలు జరిగే సమయంలో భక్తులు గ్యాలరీల్లోకి సులభంగా చేరుకునేలా, తిరిగి వెలుపలకు వెళ్ళేలా భద్రత సిబ్బంది చర్యలు తీసుకుంటారన్నారు.

### విజయవాడలో డయేరియాపై ఆందోళనపడాల్సిన అవసరం లేదు: కలెక్టర్ లక్ష్మీశ

**విజయవాడ,సెప్టెంబరు 14,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడలోని డయేరియాపై ఎవ్వరూ ఆందోళనపడాల్సిన అవసరం లేదు అని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ ... డయేరియాపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పిస్తున్నామన్నారు. విజయవాడ రాజరాజేశ్వరి పేటలో ప్రతి ఇంటికీ హైజీన్ కిట్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. సబ్బులు, హ్యాండ్ వాష్, పినాయిల్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్నామన్నారు. ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందజేస్తున్నట్లు తెలిపారు. డయేరియాపై ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరంలేదని, సహాయం కోసం కంట్రోల్ రూమ్ నంబర్ 91549 70454ను సంప్రదించాలని సూచించారు.

## సెల్ఫ్ ఫైనాన్సింగ్ పద్ధతి తీసుకొచ్చింది మీరు, పిపిపి విధానంపై దుష్ప్రచారం చేస్తారా..

**- మాజీ సిఎం జగన్‌కు మంత్రి సత్యకుమార్ యాదవ్ లేఖ**



**విజయవాడ.సెప్టెంబరు 14,ప్రభాతవార్తప్రతినిధి:** సెల్ఫ్ ఫైనాన్సింగ్ పద్ధతి మీరు తీసుకొచ్చిన మీరు, పీపీపీ విధానంపై దుష్ప్రచారం చేస్తారా !అంటూ ఏపీ ఆరోగ్యశాఖా మంత్రి వైసిపి అధ్యక్షుడు వైఎస్ జగన్‌కు లేఖ రాసారు.రాష్ట్రంలో 17 కొత్త వైద్య కళాశాలలను రూ.8,480 కోట్లతో నిర్మించాలని నాటి మీ ప్రభుత్వం నిర్ణయించింది. అయితే నాలుగేళ్ళలో రూ.1450 కోట్లు మాత్రమే ఖర్చు చేసిందనే విషయం మరిపోయారా ?అని మంత్రి సత్యకుమార్ జగన్‌ను ప్రశ్నించారు.ఈ లెక్కన చూస్తే 17 కళాశాలల నిర్మాణం పూర్తి చేసి 150 ఎంబిబిఎస్ సీట్ల చొప్పున ప్రవేశాలు కల్పించడానికి మీకు 23 ఏళ్ళు పడుతుంది'.అని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. మీ ప్రణాళిక ప్రకారం 17 వైద్య కళాశాలలు 2023-24 సంవత్సరంలో మొదలై 2025-28 నాటికి 2,550 ప్రవేశాలు జరగాలి. మీ నిర్వాకంతో నిర్మాణాలు గుంతల స్థాయిలోనే ఉండిపోయాయి' అని మంత్రి విమర్శించారు. 'ఆర్థిక సమస్యలు లేకుండా ఉండేందుకే మీ ప్రభుత్వం సెల్ఫ్ ఫైనాన్సింగ్ విధానాన్ని ప్రవేశపెట్టిందన్నారు. వైద్య కళాశాలల నిర్మాణం తలకు మించిన భారమని భావించి రూ.12 లక్షలు,రూ.20 లక్షల వార్షిక ఫీజులతో సెల్ఫ్ ఫైనాన్సింగ్ పద్ధతిని ప్రవేశపెట్టారు...ఇప్పుడు పీపీపీ విధానంపై ఎందుకు దుష్ప్రచారం చేస్తున్నారు? భారీ అంచనాలు రూపొందించి నాలుగేళ్ళలో ఏడాదికి రూ.363 కోట్ల చొప్పున మాత్రమే ఖర్చు చేశారు. కూటమి ప్రభుత్వం ఏడాదిన్నరలో రూ.6,379 కోట్లు ఖర్చు చేయాలని అంటున్నారు. ఇదేం ద్వంద్వ వైఖరి? పాడేరు కళాశాలలో 100 సీట్లు కోల్పోడానికి జగనే కారణం.చిత్తశుద్ధి లేకపోవడం వల్లే రెండో దశ లోని 5 కళాశాలలు 700 సీట్లు కోల్పోయాయి.

పులివెందుల కళాశాల నిర్మాణానికి రూ.412 కోట్లు ఖర్చుచేసి మార్కాపురం,మదనపల్లె,ఆదోని వైద్యకళాశాలల నిర్మాణంలో ఎందుకు వివక్ష చూపారు' అని లేఖలో ప్రశ్నించారు.'కార్పొరేట్ సంస్థలు నడుపుతూ రూ.వేల కోట్ల వ్యాపారం చేసే జగన్‌కు పీపీపీకి ప్రయివేటీకరణకు మధ్య తేడా తెలియదా?పీపీపీ పద్ధతిలో ప్రాజెక్టులకు అవసరమైన నిధులు,నైపుణ్యాల కోసం ప్రైవేటు భాగస్వామిని ఎంచుకుంటారు. అలా అమలయ్యే ప్రాజెక్టు నియంత్రణ పూర్తిగా ప్రభుత్వం చేతిలో ఉంటుంది' అని సత్యకుమార్ యాదవ్ వివరించారు. మళ్ళీ అధికారం లోకి వస్తే పీపీపీ కళాశాలలను రద్దు చేస్తామని జగన్ హెచ్చరించడం హాస్యాస్పదమని మంత్రి పేర్కొన్నారు.

### ప్రముఖులకు మొమెంటోలు అందచేసిన డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు



**తిరుమల,సెప్టెంబర్14ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతిలో ప్రారంభమైన జాతీయ మహిళా సాధికారత సదస్సుకు విచ్చేసిన ప్రముఖులకు ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణమరాజు తనదైన శైలిలో మెమెంటోలను అందజేశారు. లోక్‌సభస్పీకర్ ఓంబిర్లా,

అసెంబ్లీ స్పీకర్ అయ్యన్న పాత్రుడు, ఎంపి దగ్గుబాటి పురందేశ్వరికి,రాష్ట్రమంత్రి పయ్యావుల కేశవ్‌కు శ్రీవేంకటేశ్వరస్వామి జ్ఞాపికలను అందజేసి సత్కరించారు.

### ఎనిమిది గంటల పని విధానాన్ని కొనసాగించాలి : సిఐటియు రాష్ట్ర కమిటీ

**విజయవాడ,సెప్టెంబరు 14,ప్రభాతవార్తప్రతినిధి:** పని గంటల పెంపు బిల్లును ఉపసంహరించుకోవాలని సిఐటియు రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎవి నాగేశ్వరరావు, సిహెచ్ నర్సింగరావు ఒక ప్రకటన విడుదల చేశారు. పరిశ్రమలు, ఫ్యాక్టరీల్లో పని గంటలు పెంచుతూ రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో కార్మిక చట్టాల సవరణ బిల్లును ప్రవేశపెడతామని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి ప్రకటించటాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. అసెంబ్లీ సమావేశాల్లో చర్చించడమంటే బిల్లును ప్రవేశపెట్టి తమ మందబలంతో ఆమోదింపజేసుకుంటామని చెప్పటం మినహా మరొకటి కాబోదని పేర్కొన్నారు. అంతకు ముందు మంత్రివర్గం ఆమోదం పొందిన బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టకుండా రద్దు చేయాలని కోరారు. కార్మికులు ఎక్కువ సెలవులు పొందే విధంగా ఈ సవరణలు చేస్తున్నామని చెప్పటం కార్మికులను మోసగించటానికేనని తెలిపారు. కర్ణాటక బిజెపి ప్రభుత్వం మొదటగా 2023లో ఫ్యాక్టరీల చట్టానికి సవరణలు చేసి పని గంటలు రోజుకు 12 గంటలు చేసిందని పేర్కొన్నారు. వారానికి 48 గంటల పని కొనసాగుతుందని, వారంలోపే 48 గంటలు పూర్తయితే మిగతా రోజులు వేతనంతో కూడిన సెలవు దినాలుగా పరిగణించబడతాయని చెప్పిందని తెలిపారు. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం దాన్ని రద్దు చేయకుండా కొనసాగిస్తోందని పేర్కొన్నారు. గుజరాత్ బిజెపి ప్రభుత్వం 2025 జులైలో 12 గంటల పని దినం బిల్లు పాస్ చేసిందని తెలిపారు. అలాగే కార్మిక సంఘాలతో రాష్ట్ర ప్రభుత్వం చర్చించకుండా బిల్లు పెట్టేందుకు సిద్ధమవ్వడాన్ని వ్యతిరేకిస్తున్నామని వెల్లడించారు.

## తిరుమల సమాచారం

### మహిళలను ముందుకు తీసుకెళ్లేలా ప్రధాని మోడీ కార్యక్రమాలు

**- పలువురు మహిళా ప్రతినిధులు**



**తిరుమల,సెప్టెంబర్ 14ప్రభాత వార్తప్రతి నిధి:** దేశంలో మహిళలను ముందుకు తీసుకెళ్ళేలా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అనేక పథకాలు ,కార్యక్రమాలు అమలుచేస్తున్నారని ఎంపి దగ్గుబాటి పురందేశ్వరి,పలువురు మహిళా ప్రజా ప్రతినిధులు తెలిపారు. తిరుపతిలో మొదటిసారిగా జాతీయ మహిళా సాధికారత సదస్సు శ్రీవారిపాదాల చెంత ప్రారంభం కావడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. మహిళా శక్తితో దేశం ఆర్థికంగా, సామాజికంగా పురోభివృద్ధి చెందుతందన్నారు. తిరుపతి సదస్సుకు విచ్చేసిన ఎంపి పురందేశ్వరి, మాజీ గవర్నర్ తమిళిసై, ఇన్ఫోసిస్ అధినేత, ఎంపి సుధానారాయణమూర్తి ,ఏపి మంత్రులు అనిత,సవిత, మహారాష్ట్ర ఎంపి రోహిణి, సంధ్యారాణి, ఎంఎల్ఎ పరిటాల సునీత,తమిళనాడు మంత్రి గాంధీ ఆదివారం ఉదయం తిరుమలేశుని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వీరికి స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించారు. అనంతరం శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

### శ్రీవారి సేవలో న్యాయమూర్తులు



**తిరు మల, సెప్టెంబర్ 14ప్రభాత వార్త ప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామిని ఆదివారం ఉదయం నైవేద్యవిరామసమయంలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నగేశ్ బీమపాక , ఏపి హైకోర్టు జడ్జి జస్టిస్ టిసిడి శేఖర్‌లు కుటుంబ సభ్యులతో కలసి దర్శించుకున్నారు. కుటుం బంతో కలసి వచ్చిన వీరికి ఆలయ అధికారులు స్వాగతం పలికి స్వామివారి దర్శనంచేయించారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు.టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

### యాచకులు, అనధికార వ్యాపారుల తరలింపు

**తిరుమల,సెప్టెంబర్14ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఆరంభం కానున్న నేపథ్యంలో తిరుమల నుండి యాచకులు, అనధికార వ్యాపారులను ఆదివారం టిటిడి విజిలెన్స్, తిరుమల పోలీసులు తరలించారు. భద్రతను దృష్టిలో ఉంచుకుని కఠిన చర్యల దిశగా తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు ఆదివారం ఉదయం తిరుమలలో పర్యటించారు. కళ్యాణకట్ట, ఎస్వీషాపింగ్ కాంప్లెక్స్,ఆస్థానమండపం ప్రాంతాల్లో 82మంది యాచకులు, అనధికార వ్యాపారులను తిరుపతికి తరలించారు. వారి అనుమానితుల వేలిముద్రలను సేకరించారు. హోటళ్ళు, టీ దుకాణాలు ,చిల్లరదుకాణాల యజమానులు తిరుమలలోపనిముగిసిన తరువాత కార్మికులకు తిరుపతిలో వసతి కల్పించాలని పోలీసులు సూచించారు.

### విశాఖపట్నం నుంచి తిరుపతికి ప్రత్యేక రైళ్లు

**హైదరాబాద్,సెప్టెంబరు14, ప్రభాతవార్త** విశాఖపట్నం నుంచి తిరుపతి మధ్య ప్రత్యేక రైళ్లు నడవనున్నట్లు రైల్వే అధికారులు పేర్కొన్నారు. విశాఖపట్నం నుంచి తిరుపతి స్పెషల్ ట్రైన్ ఈ నెల 15 నుంచి నవంబర్ 24 వరకు ప్రతి సోమవారం అందుబాటులో ఉంటుంది. అదే విధంగా, తిరుపతివిశాఖపట్నం రైలును ఈ నెల 16 నుంచి నవంబర్ 25 వరకు ప్రతి మంగళవారం నడపనున్నట్లు వివరించారు. ఈ మార్గంలో మొత్తం 22 సర్వీసులు నడుస్తాయి.ఇక తిరుపతి నుంచి అనకాపలి - తిరుపతి మధ్య అక్టోబర్ 5 నుంచి అక్టోబర్ 27 వరకు మొత్తం 8 ప్రత్యేక రైళ్లను నడపడానికి ఏర్పాట్లు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. అదేవిధంగా సంబల్‌పూర్ ఇరోడ్ మధ్య కూడా రైల్వే శాఖ ప్రత్యేక సర్వీసులను ప్రకటించింది. సంబల్‌పూర్ నుంచి ఇరోడ్ వెళ్లే రైలు సెప్టెంబరు 17 నుంచి నవంబర్ 26 వరకు ప్రతి బుధవారం ప్రయాణిస్తుంది.తిరుగు ప్రయాణంలో ఇరోడ్ సంబల్‌పూర్ రైలు సెప్టెంబరు 19 నుంచి నవంబర్ 28 వరకు ప్రతి శుక్రవారం సర్వీసు అందిస్తుందని రైల్వే అధికారులు తెలిపారు. ఈ మార్గంలో కూడా మొత్తం 22 ప్రత్యేక రైళ్లు నడవనున్నాయి. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రైల్వే శాఖ సూచించింది.

### ప్రధాని జన్మదిన సందర్భంగా 'సేవాపక్షోత్సవాలు'



కోలా ఆనంద్

**శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 14 ప్రభాతవార్త** భారత ప్రధాని నరేంద్రమోదీ జన్మదిన సందర్భంగా ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు 'సేవా పక్షోత్సవాలు' నిర్వహించుటకు బిజెపి నిర్ణయించిందని రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్‌కుమార్ ఆదివారం మీడియాకు తెలిపారు.ఈ మేరకు పార్టీ నాయకులు అమలు చేయటానికి నిర్ణయం తీసుకున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. సేవా కార్యక్రమాల్లో భాగంగా మెడికల్ క్యాంపులు, స్వచ్ఛ భారత్, మొక్కలు నాటడం, దివ్యాంగులకు సత్కారం, క్రీడల పోటీలు, అన్నదానాలు నిర్వహిస్తామని వివరిం చారు. శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలోనరేంద్ర మోదీ జన్మదిన కార్యక్రమాలను భారీ ఎత్తున నిర్వహిస్తామని ప్రకటించారు. ఈ నెల 17న రక్తదానం నిర్వహిస్తామన్నారు. బిజెపి నాయకుల ప్రధాన కార్యక్రమాలను శ్రీకాళహస్తి నియోజకవర్గంలో భారీ ఎత్తున నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా అధికార ప్రతినిధి కొండేటి గోపాల్, పట్టణ మాజీ అధ్యక్షులు గరికపాటి రమేష్‌బాబు, జిల్లా కార్యదర్శి కూనాటి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల కోసం 'చదవటం మాకు ఇష్టం' కార్యక్రమం

**విజయవాడ,సెప్టెంబరు 14,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ పౌరగ్రంథాలయ సంస్థ ఒక వినూత్న కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంచేందుకు ప్రతి ఆదివారం నిర్వహించే చదవటం మాకు ఇష్టం కార్యక్రమం నిర్వహిస్తుంది.ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఒక్కొ అంశంపై అవగాహన కల్పిస్తోంది.నిష్ణాతుల మార్గదర్శనంలో విద్యార్థులకు పుస్తక పఠనంపై మక్కువను పెంచుతుంది.ఈ ఆదివారం విజయవాడలో ఠాగూర్ గ్రంథాలయంలో మాతృభాషపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ప్రతి ఒక్కరికీ మన మాతృభాష అయిన తెలుగు తెలిసి ఉండాలి. విద్యార్థులు మాతృభాష నేర్చుకోవడం ద్వారా సంస్కృతి, సంప్రదాయాలు, సాహిత్యం తెలుసుకుంటారు. పాఠ్యాంశాలు కూడా సులభంగా అర్థం చేసుకోవచ్చు అని తెలుగు ఉపాధ్యాయురాలు వల్లభనేని సుమతి గారు విద్యార్థులకు తెలియజేశారు.

ప్రతి ఆదివారం ఆమె విద్యార్థులకు అక్షరాలు నేర్పించడం, చదవటం రాయటం , బోధన తదితర అంశాలు లో శిక్షణ ఇస్తున్నారు. ఈ విషయం అమెరికాలో ఉన్న వారి సుమతి కుమారుడు వల్లభనేని వంశీ మాతృభాష మీద మక్కువతో విద్యార్థులకు అక్షరాలతో కూడిన పదాలు నేర్చుకునే పుస్తకాలను బహుకరించారు.

**ACHARYA N.G RANGA AGRICULTURAL UNIVERSITY**
Administrative Office, Lam, Guntur-522034: A.P.

**e-Procurement Tender Notice**

Tenders are invited from the eligible contractors, for Tender Notice No. 06-08, dated 11.09.2025 Civil work - 1 No, Electrical work - 2 Nos, through e-procurement. Details can be had from **www.angrau.ac.in** or from O/o the Estate Officer at the above address. Schedules can be downloaded through **http://www.apeprocurement.gov.in.** For the works 06-08, downloading starts from 15.09.2025 @ 3.00 PM onwards & ends on 29.09.2025 upto 3.30 PM. For details contact: TPA to Estate Officer: 9490008945.

Sd/- ESTATE OFFICER
DIPR.No.4422PP/CL/Advt/1/1/2022-23, Date: 12.09.2025

వార్త

నీవు జీవితంలో అభివృద్ధి చెందాలంటే నిత్యం నూతన మార్గాలను అన్వేషించాలి.

-రాబర్ట్ ఆంథోనీ

# పౌష్టికాహార లోపం

ప్రపంచ జనాభాలో పౌష్టికాహారలోపంతో బాధపడుతున్న బాలల్లో దాదాపు ఇరవైశాతంపైగా భారత్‌లోనే ఉన్నారని ఐక్యరాజ్యసమితి నివేదిక ఏనాటి నుంచో వెల్లడిస్తున్నది. ఐదు సంవత్సరాల్లోపు పిల్లల్లో నలభైశాతం మంది పిల్లలు తక్కువ బరువుతో పుడుతున్నారని, వారిలో ఏడు శాతం మంది పిల్లలు పుట్టిన ఐదేళ్లలోపే మరణిస్తున్నారని ఆ నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఈభూమ్మీద పుట్టిన వారికి ఎవరికైనా రాజ్యాంగం కల్పించిన హక్కే జీవించే హక్కు. అలాంటిది కన్నులైనా సరిగ్గా తెరవని పసిగుడ్డులకు సరైన ఆహారం అందక చనిపోతే దానికి బాధ్యత వహించాల్సింది ప్రభుత్వాలే. తల్లీబిడ్డకు పోషకాహారం సకాలంలోఅందివ్వకపోతే ఆ పాపం పాలకులదే అవుతుంది. అందుకు ఎన్నో పథకాలు ప్రవేశపెడుతున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ యునిసెఫ్ నిర్వహించిన అనేక అధ్యయనాలు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. అనారోగ్య పరిసరాలు, వాతావరణంలో కలుషిత నీరు, డయేరియా వంటి రోగాలబారిన పడి ఆస్పత్రులపాలవుతున్నారు. పిల్లల్లో పోషకాహారలేమి ఉన్నప్పుడు వారికి బలవర్థక ఆహారం అందివ్వాలని ప్రభుత్వాలు ఐసిడిఎస్ వంటి పథకాల కోసం కోట్లాది రూపాయలు వెచ్చించినా ఫలితాలు అంతంతమాత్రంగానే ఉంటున్నాయి. ఇలా పోషకాహారలేమితో బాధపడుతున్న కారణంగా భారతదేశం ఆర్థికంగా నష్టపోతున్నది. మరొకపక్క పాఠశాలల్లో పారిశుధ్య సౌకర్యం లేకపోవడం వల్ల అంటువ్యాధులు ప్రబలిపోతున్నాయి. మరుగుదొడ్లు లేకపోవడం పరిశుభ్రత ఇక్కడి సమస్య. జనాభాలో దాదాపు ముప్పైఆరు శాతం మందికి సరైన శానిటేషన్ సౌకర్యాలు లేవు. ఇక సమగ్రశిశువు అభివృద్ధి పథకం కింద మాతాశిశు సంరక్షణ కోసం వారికి పౌష్టికాహారం అందించే అంగన్‌వాడీలు లక్ష్యానికి దూరంగా ఉన్నాయని ఎన్నోసార్లు కాగ్ చురకలు అంటించింది. మాతాశిశు సంక్షేమంపై జరుగుతున్న నిర్లక్ష్యానికి మచ్చుతునకే పౌష్టికాహారలోపం. సరైన పోషకాలు అందకపోతే పసిపిల్లల ఎదుగుదలపై ప్రభావం చూపిస్తుంది. అందుకే అప్పుడే పుట్టిన పిల్లలకు తల్లిపాలు శ్రేష్ఠమని డాక్టర్లు చెబుతుంటారు. మాతృస్తన్యం ద్వారానే పౌష్టికాహారం మేలైన పద్ధతిలో అందించే వీలుంది. ఈ విషయంపై అవగాహన కల్పించడంలోనూ, వైద్యశాఖ అంతగా కృషి చేయలేకపోతున్నదేమోననిపిస్తున్నది. దేశంలోని బాలలందరికి సమగ్రంగా అంగన్‌వాడీ ప్రయోజనాలు అందించాలని దేశ సర్వోన్నత న్యాయస్థానం ఏనాడో మార్గదర్శక సూత్రాలను జారీ చేసినా వాటిని అధ్యయనం చేసి చర్యలు తీసుకున్న సందర్భాలు కూడా లేవనే చెప్పొచ్చు. పిల్లలకే కాదు ముప్పైఏళ్లు దాటిన వారెందరో దేశంలో పౌష్టికాహార లోపంతో బాధపడుతున్నారు. భారత్‌లో గత మూడు దశాబ్దాలుగా ప్రజల ఆర్థికస్థితిగతుల్లో వచ్చిన మార్పులు ఆహారపు అలవాట్లను మార్చేశాయి. మరొకపక్క వ్యవసాయోత్పత్తులు గణనీయంగా పెరిగినా ఇప్పటికీ దేశంలో పదిహేను శాతానికిపైగా జనాభా అర్ధాకలితో అలమటిస్తున్నారు. మొత్తం నూట పదిహేడు దేశాల నుంచి సేకరించిన సమాచారంతో రూపొందించినప్రపంచ ఆకలి సూచి 2019లో భారత్‌ది 102వస్థానం. దేశంలో దాదాపు ఇరవై కోట్ల మంది పౌష్టికాహార సమస్యతో బాధపడుతున్నారు. ఇందులో పదిహేను నుంచి నలభైతొమ్మిదేళ్ల వయస్సున్న మహిళల్లో యాభైఒక్కశాతం అత్యంత బలహీనంగా ఉంటున్నారని ఆహార వ్యవసాయ సంస్థ నివేదిక పేర్కొంది. చాలా మంది రక్తహీనత సమస్యను ఎదుర్కొంటున్నారు. చిన్నారుల స్థితిపై యునిసెఫ్ గతంలో ఇచ్చిన నివేదిక ప్రకారం చనిపోతున్న ఐదేళ్లల్లోపు పిల్లల్లో అరవైతొమ్మిదిశాతం సరైన పౌష్టికాహారం లభించక ప్రాణాలు విడుస్తున్నారనే విషయం అందరిని ఆందోళనకు గురిచేస్తున్నది. దాదాపు నాలుగున్నర కోట్ల మంది పిల్లలు వయసుకు తగ్గ ఎత్తుకు పెరగడం లేదు. రెండున్నర కోట్ల మందికిపైగా చిన్నారులు ఎత్తుకు తగ్గ బరువు ఉండటం లేదు. దేశంలో అత్యధికుల ఆహారంలో పిండిపదార్థాల శాతమే ఎక్కువ ఉంటుందని, మాంసకృతుల వంటి ఇతర పోషకాల శాతం చాలా పరిమితమేనని నివేదికలు వెల్లడిస్తున్నాయి. గ్రామీణుల్లో అరవైశాతం శక్తి కేవలం పిండిపదార్థాల రూపంలో వస్తుంటే, పట్టణ ప్రాంతాల్లో ఉండేవారికి యాభైఒక్క శాతం పిండిపదార్థాల శక్తి వస్తున్నది. దేశంలో పాలు, కూరగాయలు, మాంసం ఉత్పత్తులు గణనీయంగా పెరుగుతున్నా అవి అవసరాన్ని తీర్చలేకపోతున్నాయి. ఒక వ్యక్తి నిత్యం తీసుకునే ఆహారంలో మూడువందల గ్రాముల కూరగాయలు ఉండాలని పోషకాహార నిపుణులు చెబుతున్నారు.భారత్‌లో ప్రస్తుతం దాదాపు ఇరవై కోట్ల టన్నుల కూరగాయలు యేటా ఉత్పత్తవుతున్నాయి. ఇప్పటికీ పట్టణ ప్రాంతాల్లో ఉంటున్న వారిలో పదిహేను శాతం, గ్రామీణుల్లో తొమ్మిది శాతం మాత్రమే నిత్యం అవసరమైన మేరకు కూరగాయలను తింటున్నారు. దేశంలో దాదాపు ఇరవై తొమ్మిది కోట్ల టన్నుల పాలు ఉత్పత్తి అవుతున్నాయి. గ్రామీణ ప్రాంతంలో తొమ్మిదిశాతం, పట్టణ ప్రాంతాల్లో దాదాపుపదిహేను శాతం మాత్రమే తీసుకుంటున్నారని సర్వేలు చెబుతున్నాయి. సమతుల ఆహారాన్ని తీసుకోకపోవడానికి ఆర్థిక సమస్యలు కారణమైనా అవగాహనలోపం కూడా దీనికి తోడవుతున్నది. ఇంకొక పక్క కల్తీ కూడా ప్రజారోగ్యంపై కాటు వేస్తున్నది.ఈ కల్తీని నిరోధించేందుకు పాలకులు తీసుకొంటున్న చర్యలు ఫలితాలివ్వలేక పోతున్నాయి. ఫలితంగా ఎందరో అనారోగ్యం పాలౌతుండగా, పౌష్టికాహారం లోపం దీనికి తోడౌతున్నది.కొత్త చట్టాలు,నూతన పథకాలు తెస్తే తెండి ఉన్న వాటిని త్రికరణ శుద్ధిగా అమలు చేసేందుకు కృషి చేయాలి.

మితిమీరిన ఆశలకు పోయేవారే ఎక్కువగా మోసాలకు గురి అవుతూ ఉంటారు.



అరిస్టాటిల్

అవసరానికి ఆదుకొనే స్నేహితులుండడం అదృష్టం. అసలు స్నేహితుల అవసరం రాకపోవడం ఇంకా అదృష్టం.



ఆస్కార్‌వైల్డ్

# ప్రజావాక్కు



## సమస్యగా మారుతున్న ఇ-వేస్ట్

ఈ డిజిటల్ యుగంలో సాంకేతికత వేగంగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ,ఎలక్ట్రానిక్ వ్యర్థాలు(ఈవేస్ట్) ఒక తీవ్రమైన సమస్యగా మారుతోంది. మొబైల్, కంప్యూటర్, టీవీ, ఫ్రిజ్ వంటి పరికరాల వినియోగం వేగంగా మారుతూఉండటం ఈసంక్షోభాన్ని మరింతపెంచుతోంది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి ప్రకారం, భారతదేశంలో 2023వ సంవత్సరంలో సుమారు 17 లక్షల టన్నుల ఈవేస్ట్ ఉత్పత్తి అయింది. అయితే, దీనిలో కేవలం 30 మాత్రమే అధికారికంగా ప్రాసెస్ చేయబడింది. మిగిలిన వ్యర్థాలు అనధికారిక రంగాల్లో సరైన భద్రతా చర్యలు లేకుండా నిర్మూలించబడుతున్నాయి. దీని వల్ల వాయు, జల, మట్టికాలుష్యం వంటి తీవ్రమైన సమస్యలు ఏర్పడుతున్నాయి. ఈవ్యర్థాలలో సీసం, పాదరసం, క్యాడ్మియం వంటి విషపదార్థాలు ఉంటాయి

- సి.సాయిరుత్విక్, నల్గొండ

## రిటైర్డ్ ఉద్యోగులకు ఆరోగ్య భిక్ష పెట్టండి

తెలంగాణకుసాగు,త్రాగు,పరిశ్రమలకు ఇతరత్రా ఉపయోగపడుతున్న విధంగా సింగరేణి కూడాఅదేవిధంగా బృహత్తర విస్తృత స్థాయిలో నిధులు అందించి దాదాపు ప్రతి ఒక్క రంగానికి నిధులు సమ కురుస్తూ రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడుతున్నది. ప్రతిసంవత్సరం గణనీయమైన లాభాలుగడుస్తున్నది.కానీ బొగ్గును ఉత్పత్తి చేసి లాభాలు గడించుటకు సర్వశక్తులు ధార పోసిన రిటైర్డ్ ఉద్యోగుల పట్ల సింగరేణి తల్లి కనికరం చూపడం లేదు. వైద్యసౌకర్యాలు అందక ఆచేతనస్థితిలో బతుకుతున్నారు.

- దండంరాజు రాంచందర్ రావు, హైదరాబాద్

## పెరుగుతున్న మత్తు పదార్థాల వినియోగం

భారతదేశంలో మత్తు పదార్థాల వినియోగం ప్రమాదకరంగా పెరుగుతోంది. పట్టణాల్లోనే కాకుండా గ్రామాల్లో కూడా డ్రగ్స్ సులభంగాలభించడం,యువత వాటి వలలో చిక్కుకోవడం గమనార్హం. కుటుంబవ్యవస్థల బలహీనత, మానసిక ఒత్తిడులు, మిత్రుల ప్రభావంవంటి కారణాలు యువతను మత్తు పదార్థాలవైపు నడిపిస్తున్నాయి. అలాగే, భారత్ రెండు ప్రధాన మత్తు పదార్థాల ఉత్పత్తి ప్రాంతాల మధ్య ఉండటం వల్ల అక్రమంగా డ్రగ్స్ ప్రవేశించే అవకాశాలు పెరిగాయి.

-సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## పిల్లలను ఆటలాడిద్దాం

క్రీడలు కేవలం ఉల్లాసానికే కాదుమానసిక వికాసం, శారీరక బలానికి ఎంతో అవసరం.తల్లిదండ్రులు తమ పిల్లల బాల్యాన్ని ఆటలకు దూరం చేస్తున్నారు. వసతులు లేమి, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లకొరత, పాఠశాలల్లో పోటీతత్వం ఇందుకు కారణాలుగా నిలుస్తున్నాయి.పాఠశాలస్థాయి నుంచి చదువులపై ఒత్తిడి అధికమవుతుంది. ఉదయం 7 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు క్లాసులే క్లాసులు. అదనపు బోధనతో వారి విరామ సమయాన్ని ఉపాధ్యాయులు లాగేసుకుంటున్నారు. దొరికిన కాస్త విరామ సమయం స్మార్ట్‌ఫోన్లు ఆకర్షిస్తున్నాయి. ఈ ప్రతికూలతలు పిల్లల శారీరక,మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపనున్నాయి.ప్రతిపాఠశాలలోవ్యాయామ ఉపాధ్యాయులు నియామకం చేసి క్రీడాపరికరాలు అందజేయాలి.

- సి. చంద్రశేఖర్ రెడ్డి, నెల్లూరు జిల్లా

## ప్రమాదంలో ప్రాథమిక హక్కులు

హక్కుల గురించి మాట్లాడడడం రాయడం ఒక మృగ్యం అయిపోతున్న పరిస్థితిలో ఉన్నాం. సంచార స్వేచ్ఛ లేదు జైళ్లలో కనీసం విచారణలేకుండా కుక్కబడినపరిస్థితి ఉంది.దళితులలో ఆదివాసులలో ఈతీవ్రత మరింత ఎక్కు వ అయితే రాజ్యాంగం ఆశించింది అందించింది ఇదేనా అనే భావన కలుగుతుంది. ఇవ్వాళ ఆదివాసులు తమకు ఏమి కావాలి అని దానిని వాళ్లే నిర్ణయించుకుంటారు అనిరాజ్యాంగంలో స్పష్టంగా పేర్కొన్నప్పటికీ దాని అమలులో మాత్రం ఆ ఛాయలు కనిపించవు.నిరసన తెలిపేం దుకు అవకాశం లేదు.చివరికి తనకు నచ్చిన ఆహారం తినే స్వేచ్ఛకూడా లేదు.రాజ్యాంగ సభచర్చలలోఎక్కువ కాలం నలిగిన ప్రాథమిక హక్కుల ఉనికే ప్రమాదంలో ఉంది.

- భారత అవినాష్, జనగామ

## తెలగ కులాన్ని బీసీగా గుర్తించాలి

దశాబ్దాలుగా అన్ని రంగాల్లో వెనకబడి కుంగిపోతున్నా తెలగ కులాన్ని బీసీగా గుర్తించాలి. గోదావరి, కృష్ణ, గుంటూరు జిల్లాలో కాపు కులంతో తెలగ కులాన్ని జతచేయడం వల్లనే ఉత్తరాంధ్రలో ఉన్న తెలగ కులాన్ని బీసీగా గుర్తించడం లేదు. ఎందుకంటే కాపులు ఆర్థికంగా బలమైన వారు కాని తెలగ కులస్టులు కేవలం వ్యవసాయాన్ని నమ్మి ఆర్థికంగా ఎదగలేకపోయారు. రిజర్వేషన్లు లేకపోవడం వల్ల ఉద్యోగులు సంపాదించలేకపోయాం.రాజకీయాల్లో రాణించలేకపోయం. అందుకే మా జీవితాల్లో ప్రగతి సూర్యోదయాన్ని చూడలేకపోయాం.

-జి.అశోక్ కుమార్, విశాఖపట్నం

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ఎరువుల సమస్యకు 'సేంద్రియ' పరిష్కారాలు

**ఎరువుల సమస్యకు శాశ్వత పరిష్కారాలు సాధించాలంటే దీర్ఘకాలిక ప్రణాళికలు అవసరం. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి, సేంద్రీయ వ్యవసాయ పద్ధతులను విస్తృతంగా ప్రోత్సహించడం అత్యంత అవసరం. దీనివల్ల నేల సారం పెరగడంతో పాటు, రసాయనాల వల్ల కలిగే హాని తగ్గుతుంది. అంతేకాకుండా, నానో ఎరువుల ఉత్పత్తిని పెంచడం. ఇవి తక్కువ మోతాదులో ఎక్కువ పోషకాలను అందిస్తాయి. వీటిని వాడటం వల్ల రసాయన ఎరువుల వినియోగం తగ్గుతుంది. ఎరువుల ఉత్పత్తిలో కొత్త సాంకేతికతలను అభివృద్ధి చేయడానికి పరిశోధన, అభివృద్ధి రంగంలో పెట్టుబడులను పెంచడం ద్వారా స్వయం సమృద్ధి సాధించవచ్చు. అలాగే, ఎరువుల కోసం దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడానికి, సరఫరా గొలుసును బలోపేతం చేయడానికి అంతర్జాతీయ స్థాయిలో వ్యూహాత్మక ఒప్పందాలను కుదుర్చుకోవడం అవసరం.**

డి. జయరాం

భారతదేశం వ్యవసాయ ప్రధాన దేశం. దేశ ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయ రంగం కీలక పాత్ర పోషిస్తోంది. పంటల దిగుబడిని పెంచడంలో, ఆహార భద్రతను నిర్ధారించడంలో ఎరువులు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. అయితే దేశీయంగా ఎరువుల ఉత్పత్తి, వినియోగంలో అనేక సవాళ్లు ఎదురవుతున్నాయి. మనదేశంలో అత్యధికంగా ఉపయోగించే ఎరువు యూరియా. దీనికి ప్రధాన కారణం, ఇందులో నత్రజని శాతం ఎక్కువగా ఉండడం. మొక్కల ఎదుగుదలకు నత్రజని అత్యంత అవసరమైన పోషక పదార్థం. ఇది ఆకుల పెరుగుదలకు, కిరణజన్య సంయోగ క్రియకు దోహదపడుతుంది. యూరియా తక్కువ ధరలో లభిస్తుంది. దీనిని రైతులు సులభంగా వాడవచ్చు.అందుకే, దేశంలో యూరియా వినియోగం ఎక్కువగా ఉంటుంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో భారతదేశంలో మొత్తం యూరియా వినియోగం దాదాపు 357 లక్షల టన్నులు. అయితే యూరియాను ఎక్కువగా వాడటం వల్ల నేల సారం తగ్గిపోవడం, భూగర్భ జలాలు కలుషితం కావడం వంటి పర్యావరణ సమస్యలు కూడా తలెత్తుతున్నాయి. వ్యవసాయ శాఖ నివేదికల ప్రకారం, దేశంలో అధికంగా వాడుతున్న ఎరువులలో యూరియా తర్వాత డైఅమ్మోనియం ఫాస్ఫేట్, మ్యూరియేట్ ఆఫ్ పొటాష్ ఉన్నాయి. యూరియాకు ప్రత్యామ్నాయంగా నానో యూరియా, డైఅమ్మోనియం ఫాస్ఫేట్ వంటి ఎరువులు అందుబాటులో ఉన్నాయి. ముఖ్యంగా నానో యూరియా విప్లవాత్మక మార్పులకు నాంది పలికింది. 500 మిల్లీలీటర్ల నానో యూరియా బాటిల్ ఒక బస్తా సంప్రదాయ యూరియాకు సమానమని నిపుణులు చెబుతున్నారు. ఇది మొక్కలకు అధిక నత్రజనిని అందించి, పర్యావరణానికి హాని తగ్గించడంలో సహాయపడుతుంది. అలాగే నీటి కాలుష్యం, నేల కాలుష్యాన్ని తగ్గిస్తుంది. యూరియాకు ప్రత్యామ్నాయంగా డీఏపీని విస్తృతంగా ఉపయోగిస్తున్నప్పటికీ దానిలో ఫాస్ఫేట్, నత్రజని పోషకాలు మాత్రమే ఉంటాయి. పొటాష్, ఇతర పోషకాలు ఇందులో ఉండవు. అందువల్ల, అన్ని పోషకాలు లభించే మిశ్రమ ఎరువుల వాడకం ముఖ్యమని వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు. భారతదేశంలో ఎరువుల ఉత్పత్తి కోసం కొన్ని ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు ఉన్నాయి. వీటిలో ఫర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ ట్రావెన్‌కోర్ లిమిటెడ్, రాష్ట్రీయ కెమికల్స్ అండ్ ఫర్టిలైజర్స్ లిమిటెడ్,బ్రహ్మపుత్ర వ్యాలీ ఫర్టిలైజర్ కార్పొరేషన్ లిమిటెడ్ వంటి ప్రభుత్వ రంగ సంస్థలు, అలాగే కోరమాండల్ ఇంటర్నేషనల్ వంటి ప్రైవేట్ సంస్థలు ఉన్నాయి. అయితే మన దేశీయ అవసరాలకు తగ్గట్టుగా ఎరువులను ఉత్పత్తి చేయలేకపోవడం ఒక ప్రధాన సమస్య. పెరుగుతున్న జనాభా, వ్యవసాయ భూమి విస్తీర్ణం, అధిక పంటల దిగుబడి లక్ష్యాల కారణంగా ఎరువుల అవసరం భారీగా పెరిగింది. ప్రభుత్వ గణాంకాల ప్రకారం భారతదేశం తన ఎరువుల అవసరాల్లో దాదాపు 30శాతం దేశీయంగా ఉత్పత్తి చేస్తుండగా,మిగిలిన 70శాతం దిగుమ




తులపై ఆధార పడుతోంది. ఈ లోటును పూడ్చుకోవడానికి మనం భారీగా ఎరువులను దిగుమతి చేసుకోవలసిన అవసరం ఏర్పడింది. మనదేశం ఎరువుల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించలేకపోవడానికి కొన్ని ప్రధాన కారణాలు ఉన్నాయి. వాటిలో ముఖ్యమైనది ముడిసరుకుల కొరత. ఎరువుల ఉత్పత్తికి అవసరమైన సహజ వాయువు వంటి ముడిసరుకులు మన దేశంలో తక్కువగా ఉన్నాయి. ఈ కారణంగా, వాటిని మనం దిగుమతి చేసుకోవాల్సివస్తుంది. అంతేకాకుండా, ఎరువుల పరిశ్రమల్లో ఆధునిక సాంకేతికత, మౌలిక సదుపాయాలు తగినంతగా లేకపోవడం కూడా ఒక కారణం. దీనివల్ల ఉత్పత్తి సామర్థ్యం తక్కువగా ఉంటుంది. ఈ లోటును పూడ్చుకోవడానికి భారతదేశం భారీగా ఎరువులను దిగుమతి చేసుకుంటుంది. తన ఎరువుల అవసరాలను తీర్చడానికి చైనా, కెనడా, జోర్డాన్, రష్యా, మొరాకో వంటి దేశాల నుండి దిగుమతి చేసుకుంటుంది. ఈ దిగుమతులకు భారీగా విదేశీ మారక ద్రవ్యం అవసరమవుతుంది. మన దేశం ఎక్కువగా యూఎస్ డాలర్లలో చెల్లింపులు చేయాల్సివస్తుంది. ఎరువుల ధరలు అంతర్జాతీయ మార్కెట్‌లో హెచ్చుతగ్గులకు లోనైనప్పుడు, దాని ప్రభావం మన దేశ ఆర్థిక వ్యవస్థపై పడుతుంది. ఈ విదేశీ మారక ద్రవ్యాన్ని మనం ఎగుమతులు పెంచడం, విదేశీ పెట్టుబడులను ఆకర్షించడం ద్వారా సమకూర్చుకుంటున్నాం. అయితే దిగుమతులపై అధికంగా ఆధారపడటం వల్ల దేశీయ ఆర్థిక వనరులపై ఒత్తిడి పెరుగుతుంది.ఎరువుల ఉత్పత్తిలోస్వయం సమృద్ధి సాధించాలంటే అనేక సవాళ్లను అధిగమించాలి. ముఖ్యంగా ముడిసరుకుల లభ్యతను పెంచడం ఒక పెద్ద సవాలు. సహజ వాయువు నిల్వలను పెంచడం, కొత్త ఎరువుల ప్లాంట్లను ఏర్పాటు చేయడం ద్వారా ఈ సమస్యను కొంత వరకు పరిష్కరించవచ్చు.మూసివేసిన ఎరువుల ఫ్యాక్టరీలను పునఃప్రారంభించడం కూడా ఒక మంచి పరిష్కారం. రసాయన ఎరువుల ఉత్పత్తి, వినియోగం వల్ల పర్యావరణానికి హాని జరుగుతుంది. దీనికి పరిష్కారంగా, సేంద్రీయ ఎరువుల వాడకాన్ని ప్రోత్సహించడం, నానో యూరియా వంటి ఆధునిక, పర్యావరణహిత ఎరువులను ప్రోత్సహించడం అవసరం. రైతులకు సేంద్రీయ వ్యవసాయంపై అవగాహన కల్పించడం, సేంద్రీయ ఎరువుల ఉత్పత్తిని ప్రోత్సహించడం వల్ల పర్యావరణానికి హాని తగ్గించవచ్చు.ఎరువుల సమస్యకు శాశ్వత పరిష్కారాలు సాధించాలంటే దీర్ఘకాలిక ప్రణాళికలు అవసరం. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి, సేంద్రీయ వ్యవసాయ పద్ధతులను విస్తృతంగా ప్రోత్సహించడం అత్యంత అవసరం. దీనివల్ల నేల సారం పెరగడంతో పాటు, రసాయనాల వల్ల కలిగే హాని తగ్గుతుంది. అంతేకాకుండా, నానో ఎరువుల ఉత్పత్తిని పెంచడం. ఇవి తక్కువ మోతాదులో ఎక్కువ పోషకాలను అందిస్తాయి. వీటిని వాడటం వల్ల రసాయన ఎరువుల వినియోగం తగ్గుతుంది. ఎరువుల ఉత్పత్తిలో కొత్త సాంకేతికతలను అభివృద్ధి చేయడానికి పరిశోధన, అభివృద్ధి రంగంలో పెట్టుబడులను పెంచడం ద్వారా స్వయం సమృద్ధి సాధించవచ్చు. అలాగే, ఎరువుల కోసం దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడానికి, సరఫరా గొలుసును బలోపేతం చేయడానికి అంతర్జాతీయ స్థాయిలో వ్యూహాత్మక ఒప్పందాలను కుదుర్చుకోవడం అవసరం. ఈ చర్యలన్నీ తీసుకున్నట్లయితే భారతదేశంఎరువుల రంగంలో స్వయంసమృద్ధి సాధించి, రైతులకు భరోసా కల్పించడంతోపాటు,ఆహార భద్రతను పటిష్టంచేయగలదు. ●

# ప్రజాస్వామ్యం కోసం వేదిక ఇచ్చారు.. స్పందన ఎక్కడ?

సోరుపాక అనిల్ కుమార్

ప్రభుత్వాన్ని మనం ప్రజల సేవకుడిగా చూడాలని నేర్పారు. దేశ అభివృద్ధికి, సంక్షేమానికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషిని అందించాల్సిందేనని భావిస్తాం.అందుకే ప్రతి కుటుంబం తన ఆదాయంలో కొంత భాగాన్ని పన్నుల రూపంలో చెల్లించి, ప్రభుత్వంపై నమ్మకంతో జీవిస్తోంది. తన సమస్యను చెప్పుకునేందుకు, తన కష్టాలను వినిపించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన వేదికలు ఉన్నాయని నమ్ముతూ ముందడుగు వేస్తుంది. గ్రామాల్లో నీటి సమస్య వచ్చినా, పట్టణాల్లో విద్యుత్ నిలిచిపోయినా, ఆసుపత్రిలో మందులు అందక బాధపడుతున్నా, స్కాలర్‌షిప్ అందక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నా ఇలా ఎన్ని సమస్యలు ఉన్నా ఇవన్నీ ప్రభుత్వానికి తెలియజేసేందుకు ఈమెయిల్ ఐడీలు, టోల్ ఫ్రీ నెంబర్లు ఏర్పాటు చేశారు. కానీ వాటి వలన ఎటువంటి స్పందన ఉండటం లేదు. ఫిర్యాదు చేసిన తర్వాత రోజులు, వారాలు గడిచినా పరిష్కారం లేకపోవడం అనుభవంగా మారుతోంది. సమస్య ఎక్కడికి వెళ్లిందోకూడా తెలియని పరిస్థితులు చాలాచోట్ల కనిపిస్తున్నాయి. ప్రభుత్వం అందిస్తున్న సేవలు పేరు కోసం మాత్రమేనా? సమస్యను వినేందుకు ఉన్న నెంబర్లు కేవలం రూపకల్పనగా మిగిలిపోయాయా? అనే ప్రశ్నలు ప్రతి ఒక్కరి మనసులో కలుగుతున్నాయి.ప్రజల బాధను పట్టించుకోకుండా ప్రభుత్వ కార్యాలయాలు వ్యవహరించడంతో నమ్మకం క్రమంగా తగ్గుతోంది. ప్రతి వ్యక్తి చెల్లించే పన్నుల ద్వారా ప్రభుత్వ సేవలపై ఆధారపడుతూ జీవిస్తాడు. అలాంటి సమయంలో స్పందన లేకపోతే నిరాశ ప్రభుత్వంపై నమ్మకం తగ్గుతోంది. అలాంటప్పుడు సమస్యను పరిష్కరించుకునేందుకు మధ్యవర్తులపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. వ్యవస్థపై అసహనం పెరిగి, సామాజిక సంక్షోభంగా మారుతుంది.





ప్రజాస్వామ్యం కేవలం ఎన్నికలతో మాత్రమే పరిమితం కాదు. రోజువారీ సేవల ద్వారా, సమస్యలపై స్పందించే విధానాల ద్వారా ప్రజల భాగస్వామ్యం పెరుగుతుంది. అధికారుల పని కేవలం ఆదేశాలు ఇవ్వడం కాదు ప్రజల మాట విని, తక్షణంగా స్పందించి, అవసరమైన చర్యలు తీసుకోవడం ముఖ్యమైన బాధ్యత. ఒక ఫోన్‌కాల్‌కు కూడా సమాధానం అందని పరిస్థితిలో ఉన్న కార్యాలయాలు ప్రజల సమస్యలను పరిష్కరించగలవా? అనే ప్రశ్న ఎన్నోచోట్ల మారుమ్రోగుతోంది. స్పందించకపోవడం వల్ల ప్రజలు అసహనంతో నిండిపోతున్నారు. మధ్యవర్తుల వద్దకు వెళ్లాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. సేవలపై విశ్వాసం తగ్గిపోతోంది. ఇది వ్యక్తిగత సమస్యగానే కాదు, సమాజ స్థాయిలో ప్రభావాన్ని చూపే పెద్ద సంక్షోభంగా మారుతోంది.న్యాయంగా సేవలు అందకపోతే సామాజిక అసమానతలు, అసంతృప్తి, నిరుత్సాహం పెరిగే ప్రమాదం ఉంది. ప్రభుత్వానికి ప్రజల నుండి వినిపిస్తున్న సమస్యను వినాలి. సమస్యను తెలిపిన తర్వాత కనీసం స్పందన ఇవ్వడం కూడా కష్టంగా మారితే, ప్రభుత్వం నిజంగా ప్రజల కోసం పనిచేస్తుందా? పేరు కోసం మాత్రమే ఈ సేవలను అందిస్తున్నదా? అనే ప్రశ్నలు సామాన్యుల మనసుల్లో కలుగుతున్నాయి. ఫిర్యాదులను సమయానికి స్వీకరించేలా, పారదర్శకంగా వాటి స్థితిని తెలియజేసేలా వ్యవస్థను బలపరచాలి. అందుబాటులో ఉన్న నెంబర్లు పనిచేస్తున్నాయా? సమాధానాలు అందుతున్నాయా? సమస్యలను వినేందుకు అధికారులు శ్రద్ధ చూపుతున్నారా? అన్నది కేవలం కార్యాలయాల పనిగా కాకుండా సామాజిక బాధ్యతగా చూడాలి. ప్రజల సమస్యలను పరిష్కరించడం ద్వారా ప్రభుత్వానికి గౌరవం పెరుగుతుంది. ప్రజలు కూడా నమ్మకంతో ముందడుగు వేయగలరు. ఇప్పటికైనా ప్రభుత్వం జాగ్రత్తగా ఆలోచించి, ప్రతి ఫిర్యాదును గౌరవంగా స్వీకరించేలా వ్యవస్థను నిర్మించాల్సిన అవసరం ఉంది. ప్రజల మాట వినాలి టోల్ ఫ్రీ నెంబర్లుకు మెయిల్స్‌కి వెంటనే స్పందించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. అప్పుడే ప్రభుత్వం నిజమైన సేవకుడిగా నిలబడగలదు. ●

# రాహుల్ గాంధీ 'సామాజిక న్యాయం'పై సందేహాలు!

మన్నారం నాగరాజు

రాహుల్ గాంధీ ఇటీవల కాలంలో 'సామాజిక న్యాయం' అనే నినాదాన్ని బలంగా వినిపిస్తున్నారు.దేశవ్యాప్తంగా పాదయాత్రలు చేస్తూ ప్రజలతో మమేకమవుతూ, ముఖ్యంగా వెనుకబడిన వర్గాల సమస్యలను వెలికితీస్తానని చెబుతున్నారు. కానీ ప్రజలు, ముఖ్యంగా బీసీ సమాజం అడుగుతున్న ప్రశ్న మాత్రం మరింత బలంగా మారుతోంది. మీ సామాజిక న్యాయం నినాదం నిజంగా చిత్తశుద్ధితోనా? లేక ఎన్నికల ప్రయోజనాల కోసమా? రాహుల్ గాంధీ రోడ్లమీద ప్రజలతో మాట్లాడుతూ బీసీల పేర్లు ప్రస్తావించడం, వారికి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడం ఒక విషయం. కానీ అదే మాటలను పార్లమెంట్‌లో బలంగా వినిపించడం, రాజ్యాంగ బలంతో అమలు చేయించడం మరో విషయం. ఈ రెండవ దశలో రాహుల్ గాంధీ కనిపించకపోవడం బీసీలలో అనుమానాలను పెంచుతోంది. భారతదేశంలో బీసీల సంఖ్య జనాభాలో సగానికి పైగా ఉంటుంది. సర్వేల ప్రకారం కనీసం52శాతం నుంచి 55శాతం వరకు జనాభా బీసీలదే. ఓట్ల పరంగా చూసినా, రాజకీయ ప్రభావం పరంగా చూసినా వారు కీలక పాత్రధారులు. కానీ ఆశ్చర్యకరంగా, ఇప్పటివరకు వారికి తగిన రాజకీయ గౌరవం దక్కలేదు. బీసీల కోసం బలమైన చట్టాలు, నిర్ణయాలు పార్లమెంట్‌లో ఆమోదించబడ్డ ఉదాహరణలు చాలా అరుదు. కాంగ్రెస్‌పార్టీ దాదాపు ఆరు దశాబ్దాలకు పైగా ఈ దేశాన్ని పాలించింది. కానీ ఆ కాలంలో బీసీల కోసం ఒక ప్రత్యేకమైన, సుస్థిరమైన బిల్లును తీసుకురావడంలో విఫలమైంది. రిజర్వేషన్లను కాపాడేలా తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చే ప్రయత్నం చేయడంలో వెనకబడిపోయింది. ఇది బీసీలలో పెద్ద ఆవేదనగా మారింది. ఇప్పటిరోజుల్లో రాహుల్ గాంధీ రోడ్ల మీద 'రాజ్యాంగాన్ని కాపాడాలి, సామాజిక న్యాయం జరగాలి' అని తరచుగా చెబుతున్నారు. కానీ అదే విషయాన్ని పార్లమెంట్‌లో బలంగా ఎందుకు చెప్పలేకపోతున్నారు? ఉదాహరణకు తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయన కామారెడ్డిలో బహిరంగ సభలో మాట్లాడుతూ 'కాంగ్రెస్ అధికారంలోకి వస్తే బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇస్తాం' అని ప్రకటించారు. నిజంగా అధికారంలోకి వచ్చిన తర్వాత అసెంబ్లీలో బిల్లును కూడా ఆమోదించారు. కానీ ఆ బిల్లును రాజ్యాంగంలోని తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్పించేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేయడంలో మాత్రం ఒక్క అడుగు కూడా వేయలేదు. రాష్ట్ర అసెంబ్లీలో బిల్లు ఆమోదం ఒక దశ మాత్రమే. దానిని రాజ్యాంగ పరిరక్షణలోకి తేవడం అత్యవసరం. కానీ ఆ పని జరగకపోవడంతో బీసీలు కాంగ్రెస్ చిత్తశుద్ధిని సందేహిస్తున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలో బీసీల కోసం ఒకరోజు దీక్ష చేశారు. అది కేవలం తెలంగాణ బీసీలకే కాకుండా దేశవ్యాప్తంగా బీసీల సమస్యలను ప్రతిబింబించింది. అలాంటి సమయంలో జాతీయ నాయకుడిగా రాహుల్ గాంధీ ఆయన పక్కనే ఉండాల్సింది. కానీ ఆయన గైర్హాజరు కావడం 'బీసీల పట్ల నిజమైన చిత్తశుద్ధి ఎక్కడుంది?' అనే ప్రశ్నను మరింత బలంగా నిలబెట్టింది. కాంగ్రెస్ పార్టీకి చెందిన ముఖ్యమంత్రి బీసీల కోసం నిరసన చేస్తున్నప్పుడు జాతీయ నాయకుడు దూరంగా ఉండటమే బీసీలలో అసంతృప్తిని పెంచింది.



రాహుల్ గాంధీ

భారతదేశంలో ఉన్న అత్యున్నత పదవులు ఇప్పటి వరకు ఎక్కువగా ఎలైట్ వర్గాలకేపరిమితం అయ్యాయి. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధాని వంటి పదవుల్లో ఒక బీసీకి కూడా స్థానం దక్కలేదు. కాంగ్రెస్ పార్టీ ఇన్ని దశాబ్దాల పాటు అధికారంలో ఉన్నప్పటికీ ఒక బీసీని ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా కూడా నిలబెట్టలేదు. ఇది బీసీ సమాజంలో గాయాన్ని మరింతగా ముద్ర వేసింది. మీరు మాటల్లో సామాజిక న్యాయం అంటారు, కానీ పదవుల్లో ఆ న్యాయం ఎందుకు కనబడదు అని వారు ప్రశ్నిస్తున్నారు. రాహుల్ గాంధీ బీసీలకు ఇచ్చే హామీలు, కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో అమలవుతున్నాయా అన్నది ప్రజలు పరిశీలిస్తున్నారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి దాదాపు ఇరువై నెలలు పూర్తయ్యాయి. ఈ కాలంలో బీసీల కోసం ఏం జరిగిందని అడిగితే స్పష్టమైన సమాధానం లేదు. బీసీ కార్పొరేషన్లకు నిధులు కేటాయించామని చెప్పారు కానీ అవి పూర్తిగా ఖర్చయ్యాయా అన్న సందేహం ఉంది. కార్పొరేషన్లలో పదవులు అన్నీభర్తీ అయ్యాయా? సేవాకులాలు, ఉత్పత్తి కులాలకు సరైన సహాయం అందిందా?ఇవన్నీ ఇంకా సమాధానం లేని ప్రశ్నలుగానే ఉన్నాయి. ఇంత కాలం పాలన సాగినా బీసీల జీవన ప్రమాణాల్లో గణనీయమైన మార్పు కనబడకపోవడంతో కాంగ్రెస్ నిజంగా బీసీలను గుర్తిస్తున్నదా అనే అనుమానం కలుగుతోంది. బీసీలు ఒక పెద్ద ఆశతో కాంగ్రెస్ వైపు చూశారు. రాహుల్ గాంధీ చెప్పిన మాటలు, ఇచ్చిన హామీలు నెరవేరతాయని వారు నమ్మారు. కానీ ఇప్పుడు ఆ నమ్మకం కుంగిపోతోంది. కార్పొరేషన్ల నిధులు అరకొరకగా ఖర్చు చేయడం, పదవులు అరకొరకగాఇవ్వడం, ఉపాధి రుణాలు, పరిశ్రమల విధానాల్లో బీసీలకు ప్రాధాన్యం లేకపోవడం ఇవన్నీ బీసీలను నిరాశలో ముంచుతున్నాయి. ఒకవేళ నిజంగా చిత్తశుద్ధి ఉంటే ఇప్పటికీ కొంత ఫలితం కనబడేది.ఇంకో ప్రధాన అంశం ఏమిటంటే,రాహుల్ గాంధీకి జాతీయ నాయకుడిగా ఒక బాధ్యత ఉంది. ఆయన కేవలం రోడ్ల మీద పాదయాత్రలు చేయడం, సభల్లో ప్రసంగాలు ఇవ్వడం మాత్రమే కాదు. కాంగ్రెస్ పార్టీ పాలిస్తున్న రాష్ట్రాల్లో బీసీలకు ఇచ్చిన హామీలు అమలవుతున్నాయా లేదా అన్నది ఆయన గమనించాలి. తెలంగాణలో రిజర్వేషన్ బిల్లు కేంద్రంలో అగ్నిపరీక్ష ఎదుర్కొంటున్నప్పుడు ఆ బిల్లును అమలు చేయించే వరకు ఆయన కృషి చేయాలి. రాష్ట్రాల్లో బీసీ బడ్జెట్ నిజంగా ఖర్చవుతోందా లేదా అని ఆయన ప్రశ్నించాలి. కానీ ఆయన ఆ పాత్రలో కనబడకపోవడం మరోసారి బీసీలలో అనుమానం పెంచుతోంది. రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ తరచుగా "రాజ్యాంగాన్ని కాపాడాలి" అని చెబుతున్నాయి. రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 నుండి 21 వరకు సమానత్వ హక్కులు, స్వేచ్ఛ హక్కులు, జీవన హక్కులు ఉన్నప్పటికీ బీసీలకు అవి పూర్తిగా దక్కుతున్నాయా అన్నది పరిశీలించాలి. సమానత్వం అన్న పదం పుస్తకాలలో ఉండటం సరిపోదు. అది రాజకీయాల్లో, అధికార పదవుల్లో, నిర్ణయాలలో ప్రతిబింబించాలి. కానీ ఇప్పటి వరకు బీసీలు ఆ అనుభవం పొందలేకపోయారు. ప్రజాస్వామ్యం కాపాడాలంటే రాహుల్ గాంధీ నిజంగా పార్లమెంట్‌లో బీసీల కోసం నిలదీయాలి. ఒకరోజు అయినా బీసీలకు మద్దతుగా స్పష్టమైన బిల్లు ప్రవేశపెట్టాలి. లేకుంటే ఆయన నినాదాలు ఎన్నికల మసాలాగా మారిపోతాయి. తెలంగాణ బీసీలు కూడా ఇప్పుడు అదే ప్రశ్నిస్తున్నారు.మీరు కామారెడ్డిలో రిజర్వేషన్లు ఇస్తామని చెప్పారు, అసెంబ్లీలో బిల్లు పెట్టారు, కానీ ఢిల్లీలో ఒత్తిడి ఎందుకు చేయలేకపోతున్నారు? రేవంత్ రెడ్డి దీక్షలో ఎందుకు పాల్గొనలేదు? కాంగ్రెస్ పార్టీ ఇరువై నెలల పాలనలో బీసీల కోసం ఒక పెద్ద అడుగు ఎందుకువేయలేదు?మొత్తానికి రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ పార్టీ బీసీలపట్ల చూపుతున్న వైఖరి ఎన్నికల నినాదాల వరకే పరిమితమైందన్న భావన బలపడుతోంది. బీసీ సమాజం ఇన్ని ప్రశ్నలు అడుగుతోంది. నిజంగా బీసీల పట్ల చిత్తశుద్ధి ఉంటే ఇప్పటికీ ఆలస్యం చేయకుండా పార్లమెంట్‌లో బీసీ బిల్లును ప్రవేశపెట్టాలి. రాష్ట్రాల్లో హామీల అమలును నిర్ధారించాలి. లేకపోతే కాంగ్రెస్ మాటలను కేవలం ఓట్ల కోసం వేసిన జాలరుగా భావించి దూరమవుతారు. ●



# వలసలపై లండన్‌లో భారీ నిరసనలు

## మరోవైపు వలసదారులకు మద్దతుగా ర్యాలీలు

## హింసాత్మకంగా మారిన లండన్ వీధులు



**లండన్, సెప్టెంబరు 14:** యునైటెడ్ కింగ్‌డమ్ రాజధాని లండన్‌లో శనివారం తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఫార్‌రైట్ కార్యకర్త టామీ రాబిన్‌సన్ నిర్వహించిన యునైట్ ది కింగ్‌డమ్ ర్యాలీ హింసాత్మకంగా మారింది. వలస విధానాలకు వ్యతిరేకంగా చేపట్టిన ఈ ప్రదర్శనలో నిరసనకారులు పోలీసులతో ఘర్షణకు దిగారు.

ఈ ఘటనల్లో 26 మంది పోలీసు అధికారులు గాయపడగా, 25 మందిని అరెస్ట్ చేశారు. మెట్రోపాలిటన్ పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం ఈ ర్యాలీకి ఊహించిన దానికంటే చాలా ఎక్కువ సంఖ్యలో సుమారు 1.10లక్షల నుంచి 1.5 లక్షల మంది ప్రజలు హాజరయ్యారు. ప్రదర్శన చివరి దశలో కొంతమంది నిరసనకారులు అదు పుతప్పి పోలీసులపై బాటిళ్లు విసిరి దాడులకు పాల్పడ్డారు. ప్రత్యర్థి వర్గాల నిరసనకారులను వేరుచేయడానికి ఏర్పాటు చేసిన బారికేడ్లను ఛేదించడానికి ప్రయత్నించారు. ఈ దాడుల్లో నలుగురు అధికారులు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఒకరికి పళ్లు విరగగా, మరొకరికి వెన్నెముకకు గాయమైందని, ఇంకొకరికి ముక్కు విరిగి ఉండొచ్చని అధికారులు తెలిపారు. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు అదనపు బలగాలను మోహరించాల్సి వచ్చింది. టెస్లా సీఈవో ఎలాన్ మస్క్ ఓ వీడియోలో మాట్లాడుతూ భారీగా, అనియంత్రితంగా వస్తున్న వలసలతో బ్రిటన్ నాశనమవుతోందని వ్యాఖ్యానించారు. మా దేశాన్ని మాకు తిరిగి ఇవ్వండి, పడవలను ఆపండి వంటి ప్లకార్డులతో నిరసనకారులు కవాతు నిర్వహించారు. ఇదే సమయంలో స్టాండ్ అప్ టు రేసిజం సంస్థ ఆధ్వర్యంలో సుమారు 5,000మందితో వలసదారులకు మద్దతుగా మరో ప్రదర్శన కూడా జరిగింది. వేల మంది నగర వీధుల్లోకి వచ్చి తమ నిరసనలను తెలియజేశారు. ఒకవైపు వలసదారులపై వ్యతిరేకతను వ్యక్తంచేస్తూ ఆందోళనలు జరగగా మరో వైపు జాత్యహంకారాన్ని ఖండిస్తూ 'స్టాండప్ టు రేసిజమ్' అనే నినాదంతో మరో ర్యాలీ జరిగింది. ఈ రెండు ర్యాలీల నేపథ్యంలో శాంతిభద్రతలను కాపాడేందుకు పోలీసులు భారీఎత్తున మోహరించారు.

అయినప్పటికీ ర్యాలీలు హింసాత్మకంగా మారడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తమైంది. లండన్ వీధుల్లో వలసదారుల వ్యతిరేక ర్యాలీలో వేలమంది పాల్గొన్నారు. వలసలవల్ల తమ దేశంలో ఉద్యోగ అవకాశాలు తగ్గిపోతున్నాయని, సామాజిక సమస్యలు పెరుగుతున్నాయని వారు ఆందోళనవ్యక్తంచేశారు. ఈ నిరసనకారులు తమ డిమాండ్లను గట్టిగా వినిపించడానికి నినాదాలు చేస్తూ ప్లకార్డులు పట్టుకుని నగరంలోని ప్రధాన వీధుల్లో ర్యాలీ తీశారు. కానీ ఈ ర్యాలీలో కొంతమంది నిరసనకారులు హద్దులు దాటడంతో హింసాత్మకంగా మారింది. పోలీసులపై వాటర్ బాటిళ్లు, రాళ్లు రువ్వారు. దాంతో పోలీసులు 26 మందిని అదుపులోకి తీసుకున్నారు. అదే సమయంలో నగరంలో మరో నిరసన ర్యాలీ కూడా జరిగింది.

స్టాండ్ అప్ టు రేసిజమ్ అనే సంస్థనాయకత్వంలో జాత్యహంకారానికి వ్యతిరేకంగా 5వేల మంది ర్యాలీలో పాల్గొన్నారు. సమాజంలో సమానత్వం, ఐక్యతను ప్రోత్సహించాలని నిరసనకారులు కోరారు. వివిధ జాతులు, సంస్కృతుల ప్రజలు ఒకే దేశంలో సామరస్యంగా జీవించాలని పిలుపునిచ్చారు. శాంతియుతంగా తమ నిరసనను తెలియజేశారు. ప్లకార్డులు, బ్యానర్‌లు పట్టుకుని, నినాదాలు చేస్తూ, జాత్యహంకార వివక్షను ఖండిస్తూ ముందుకు నడిచారు.



భారీ ఆందోళనలు జరిపిన శివసైనికులు

# భారత్ పాకిస్థాన్ మ్యాచ్‌కు నిరసనగా టీవీల ధ్వంసం

**ముంబయి, సెప్టెంబరు 14:** ఆసియా కప్ 2025లో భాగంగా భారత్, పాకిస్థాన్ జట్ల మధ్య ఆదివారం జరగనున్న క్రికెట్ మ్యాచ్ తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. ఈ మ్యాచ్ ను వ్యతిరేకిస్తూ శివసేన (ఉద్ధవ్ బాలాసాహెబ్ ఠాకరే వర్గం) పార్టీ కార్యకర్తలు ముంబైలో ఆందోళన చేపట్టారు. పార్టీ అధికార ప్రతినిధి ఆనంద్ దూబే నేతృత్వంలో నిరసనకారులు టీవీ సెట్లను పగలగొట్టి, కేంద్ర ప్రభుత్వానికి, బీసీసీఐకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆనంద్ దూబే మాట్లాడుతూ, పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న దేశమని, అలాంటి దేశంతో అన్ని రకాల సంబంధాలను తెంచుకోవాలని డిమాండ్ చేశారు. మ్యాచ్ నిర్వహణకు అనుమతి ఇవ్వడం ద్వారా మోదీ ప్రభుత్వం మన సోదరీమణుల సిందూరాన్ని అవమానిస్తోందని తీవ్రంగా ఆరోపించారు. దీనికి గుర్తుగా మహిళా కార్యకర్తలు చేతిలో సిందూరం పట్టుకుని నిరసన తెలిపారు. దుబాయ్ లో జరగనున్న ఈ మ్యాచ్ ను మేము వ్యతిరేకిస్తున్నాం. ఈ నిర్ణయాన్ని పునఃపరిశీలించాలని భారత ప్రభుత్వాన్ని కోరుతున్నామని దూబే అన్నారు. పహల్గామ్ లో తమ ఆప్తులను కోల్పోయిన సోదరీమణులు, తల్లులు ఈ మ్యాచ్ ను ఎలా చూడగలరని ఆయన ప్రశ్నించారు. ప్రధాని మోదీ ఈ మ్యాచ్ ను ఆపాలి వారి మనోభావాలతో ఆడుకోవద్దు, బీసీసీఐకి, జై షాకు తమ తప్పు తెలిసేలా విరాళాలు పంపుతున్నామని ఆయన వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. భారత క్రికెటర్లు కూడా ఈ మ్యాచ్ ను బహిష్కరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఒకవేళ ఆటగాళ్లు ఈ మ్యాచ్ ను బహిష్కరిస్తే, మేము వారికి అండగా నిలుస్తాం. అలా కాకుండా ఆడితే మాత్రం, వారి తీరును కూడా ఖండిస్తామని ఆయన స్పష్టం చేశారు. అయితే, ఈ నిరసనల మధ్య, ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం దుబాయ్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో భారత కాలమానం ప్రకారం రాత్రి 8:00 గంటలకు భారత్‌పాకిస్థాన్ మ్యాచ్ ప్రారంభం కానుంది.

# యుద్ధాల ఆంక్షలతో సమస్యలు పరిష్కరించలేరు

## చైనా తీవ్ర స్పందన



**బీజింగ్, సెప్టెంబరు 14:** తమ దేశంపై 50 నుంచి 100 శాతం టారిఫ్‌లు విధించాలంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రతిపాదనపై చైనా తీవ్రంగా స్పందించింది. యుద్ధాలు, ఆంక్షల ద్వారా సమస్యలను పరిష్కరించలేమని, అవి పరిస్థితిని మరింత క్లిష్టతరం చేస్తాయని గట్టిగా బదులిచ్చింది. వివాదాస్పద అంశాల పరి ష్కారానికి శాంతియుత చర్చలకే తాము కట్టుబడి ఉన్నామని చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ స్పష్టం చేశారు. స్లోవేనియా పర్య టనలో భాగంగా ఆ దేశ ఉప ప్రధాని తాన్యా ఫజోన్‌తో సమావేశం అనంతరం వాంగ్ యీ విలేకరులతో మాట్లాడారు. చైనా ఎప్పుడూ యుద్ధాలలో పాల్గొనదు, వాటిని ప్రోత్సహిం చదు. చర్చల ద్వారా రాజకీయ పరిష్కారాలను ప్రోత్సహించడమే మా విధానం అని అన్నారు. ప్రస్తుతం అంతర్జాతీయ సమాజం గందరగోళం, ఘర్షణలతో నిండి ఉందని, ఈ సమయంలో బహుళపాక్షిక విధానాలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. చైనా, యూరప్‌లు ప్రత్యర్థులుగా కాకుండా మిత్రులుగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. అంతకుముందు, డొనాల్డ్ ట్రంప్ తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ట్రూత్ సోషల్ వేదికగా సంచలన వ్యాఖ్యలు చేశారు. రష్యా ఉక్రెయిన్ యుద్ధం ముగిసే వరకు నాటో కూటమి చైనాపై 50 నుంచి 100 శాతం టారిఫ్‌లు విధించాలి. రష్యాపై చైనాకు బలమైన పట్టు ఉంది. ఈ భారీ సుంకాలు ఆ పట్టును విచ్ఛిన్నం చేస్తాయి. తద్వారా ఈ భయంకరమైన యుద్ధానికి ముగింపు పలకవచ్చు అని ట్రంప్ పోస్ట్ చేశారు. గతంలో కూడా ట్రంప్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. అమెరికాకు వ్యతిరేకంగా జిన్‌పింగ్ కుట్ర పన్నుతున్నారని విమర్శించారు. అయితే, ఆసక్తికరంగా, ఈ ఆరోపణలు చేసిన కొన్ని గంటలకే చైనా నాయకత్వంతో తన వ్యక్తిగత సంబంధాలు చాలా బాగున్నాయని చెప్పడం గమనార్హం.

# మోడీ మణిపూర్ పర్యటన కంటితుడుపు చర్యే

## ఎఐసిసి అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 14:** కల్లోలిత మణిపూర్‌లో ప్రధాని పర్యటన కేవలం ఒక పిట్‌స్టాప్ వంటిది మాత్రమేనని ఎఐసిసి అధ్యక్షుడుఖర్గే వాదించారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్ర విమర్శలు చేశారు. మోదీ పర్యటన కేవలం ఒక పిట్ స్టాప్ (చిన్న విరామం) మాత్రమేనని ఇది రాష్ట్ర ప్రజలకు తీవ్ర అవమానం అని ఘాటుగా వ్యాఖ్యానించారు. చురాచంద్‌పూర్, ఇంఫాల్‌లలో పర్యటించడానికి వచ్చిన మోదీపై ఖర్గే సోషల్ మీడియా వేదికగా విరుచుకుపడ్డారు. నరేంద్ర మోదీ గారు.. మణిపూర్‌లో మీ 3 గంటల పర్యటన కనికరం కాదు. ఇది ఒక ప్రహసనం. కేవలం ప్రదర్శన కోసం మాత్రమే. రిలీఫ్ క్యాంప్‌లలోని ప్రజల రోదనలు వినకుండా పారిపోవడమే మీ ఉద్దేశ్యం అని ఆయన పోస్ట్ చేశారు. అక్కడితో ఆగకుండా హింస మొదలైన ఈ 864 రోజుల్లో 300 మంది ప్రాణాలు కోల్పోయారని గుర్తు చేశారు. మొత్తంగా 67,000 మంది నిరాశ్రయులు అయ్యారని చెప్పారు. అంతేకాకుండా 1,500 మందికి పైగా గాయపడ్డారని తెలిపారు. ఈ సమయంలో మీరు 46 విదేశీ పర్యటనలు చేశారని కానీ సొంత ప్రజలను పరామర్శించడానికి ఒక్కసారి కూడా రాలేదని ఖర్గే అన్నారు. మీ డబుల్ ఇంజిన్ ప్రభుత్వం మణిపూర్‌లోని అమాయక ప్రజల జీవితాలను బుల్డోజ్ చేసిందంటూ తీవ్రంగా వ్యాఖ్యానించారు. అలాగే ప్రధాని, హోం మంత్రి అమిత్ షా అసమర్థత, కుమ్మక్కు కారణంగానే రాష్ట్రానికి ఈ పరిస్థితి వచ్చిందన్నారు. రాష్ట్రపతి పాలన విధించడం ద్వారా ఈ సమస్యను కప్పిపుచ్చుకోవాలని చూశారని ఆరోపించారు. ఈ విషయంలో మీ రాజధర్మం ఎక్కడ కనిపిస్తుందో చెప్పాలంటూ ఖర్గే ప్రశ్నలు సంధించారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా కూడా ప్రధాని ఇంతకుముందే రాష్ట్రానికి వచ్చి ఉండాల్సిందని అన్నారు. రెండు సంవత్సరాల తర్వాతనైనా ఆయన మణిపూర్‌ను సందర్శించడానికి నిర్ణయించుకోవడం సంతోషం. ప్రధాని మోదీ తన పర్యటనలో నిరాశ్రయులైన ప్రజలతో మాట్లాడారు. అలాగే రూ.8,500 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. మణిపూర్‌లో మైతేయ్, కుకి వర్గాల మధ్య భూ హక్కులు, రాజకీయ ప్రాతినిధ్యం వంటి అంశాలపై మే 2023 నుంచి ఘర్షణలు జరుగుతున్నాయి.

# మా కన్నీళ్లు ఆరకముందే పాకిస్థాన్‌తో క్రికెట్ మ్యాచ్‌లా..

## పహల్గావ్ బాధితుల ఉద్వేగం



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 14:** తమ కన్నీళ్లు ఇంకా ఆరిపోలేదని పహల్గామ్ బాధిత కుటుంబాలు వాపోయాయి. భారత్‌పాకిస్థాన్ మధ్య క్రికెట్ మ్యాచ్‌ను బహిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ఏప్రిల్ 22న జమ్ముకశ్మీర్ పహల్గామ్ లోని బైసరన్ మైదానంలో పాక్ ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో పర్యాటకులతో సహా 26 మంది మరణించారు. ఈ సంఘటన నేపథ్యంలో పాకిస్థాన్‌తో భారత్ అన్ని విధాలా తెగదెంపులు చేసుకున్నది. మేలో ఆపరేషన్ సిందూర్ పేరుతో భారత్ సైనిక చర్య చేపట్టింది. పాకిస్థాన్‌లోని ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేసింది. కాగా, పహల్గామ్ ఉగ్రదాడి జరిగిన తర్వాత సుమారు ఐదు నెలలకు ఆదివారం నుంచి దుబాయ్‌లో భారత్, పాకిస్థాన్ క్రికెట్ జట్ల మధ్య ఆసియా కప్ టోర్నీ జరుగనున్నది. అయితే ఈ నిర్ణయం తీసుకున్న బీసీసీఐతో పాటు కేంద్రంలోని మోదీ ప్రభుత్వంపై విమర్శలు వెల్లువెత్తాయి. పహల్గామ్ బాధిత కుటుంబాలు కూడా దీనిపై స్పందించాయి. పాక్‌తో మ్యాచ్‌ను భారత్ ఆటగాళ్లు బహిష్కరించాలని పిలుపునిచ్చారు. 'మా కన్నీళ్లు ఇంకా ఆరిపోలేదు. పాకిస్థాన్‌తో మ్యాచ్ ఏమిటి?' అని భర్త, కుమారుడ్ని కోల్పోయిన కిరణ్‌బెన్ ప్రశ్నించారు. మరోవైపు ఆమె చిన్న కుమారుడు సావన్ పర్మార్ కూడా తన ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. పహల్గామ్ దాడిలో చాలా మంది ప్రాణాలు కోల్పోయారని, ఆపరేషన్ సిందూర్‌లో మన సైనికులుకూడా అమరులయ్యారని గుర్తు చేశారు. భారత్, పాక్ మధ్య మ్యాచ్ జరుగుతోందని తెలిసి తాము చాలా కలత చెందినట్లు చెప్పారు. 'పాకిస్థాన్‌తోఅన్ని సంబంధాలు తెంచుకున్నామని ప్రధాని మోదీ అన్నారు. మరి మనం ఇంకా ఈ ఆట ఎందుకు ఆడుతున్నాం? మేం ఇంకా దుఃఖిస్తున్నాం. ఈ ఆట ఆడాల్సిన అవసరం ఏమిటి?' అని ఆయన ప్రశ్నించారు.

# బీహార్‌లో 243 స్థానాల్లోను పోటీచేస్తాం

## మహాకూటమి కీలకనేత తేజస్వియాదవ్ సంచలనం



**ముజఫరాపూర్(బీహార్), సెప్టెంబరు 24:** బీహార్ అసెంబ్లీ ఎన్నికలు దగ్గర పడుతున్న తరుణంలో, రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్‌జేడీ) నేత తేజస్వి యాదవ్ సంచలన వ్యాఖ్యలు చేసి రాజకీయ వేడిని రాజేశారు. రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలోని మొత్తం 243 అసెంబ్లీ స్థానాల్లోనూ తమ పార్టీయే పోటీ చేస్తుందని ప్రకటించి మహాఘట్‌బంధన్ కూటమిలో ప్రకంపనలు సృష్టించారు. సీట్ల పంపకాలపై మిత్రపక్షాలతో చర్చలు జరగాల్సి ఉండగా, తేజస్వి చేసిన ఈ ఏకపక్ష ప్రకటన కూటమి భవిష్యత్తుపై నీలినీడలు కమ్ముకునేలా చేసింది. ముజఫర్‌పూర్‌లోని కాంతిలో బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న తేజస్వి, ఈసారి ప్రజలు తన ముఖం చూసి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఎన్డీఏ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డ ఆయన, కేవలం నినాదాలతోనే ప్రజలను మభ్యపెడుతున్నారని విమర్శించారు. బీహార్ నుంచి ఓట్లు, గుజరాత్‌లో ఫ్యాక్టరీలు ఈ ఎత్తుగడలు ఇకపై చెల్లవని వ్యాఖ్యానించారు. తమ ఒత్తిడి వల్లే ప్రభుత్వం పెన్షన్, ఉచిత విద్యుత్ వంటి పథకాలను అమలు చేస్తోందని, తాము ముందుంటే ప్రభుత్వం తమను అనుసరిస్తోందని అన్నారు. ఆర్‌జేడీ అధికారంలోకి వస్తే ఉపాధి, అభివృద్ధికి పెద్దపీట వేస్తామని తేజస్వి హామీ ఇచ్చారు. తమ పార్టీ ప్రకటించిన మై బెహన్ యోజన ను కాపీ కొట్టి ప్రభుత్వం మహిళలకు రూ.10,000 ఇస్తోందని, కానీ తాము గెలిస్తే ఐదేళ్లలో ప్రతి మహిళకు లక్షన్నర రూపాయలు అందిస్తామని స్పష్టం చేశారు. ప్రస్తుత ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలు చేసిన తేజస్వి, రూ.80 వేల కోట్లకు లెక్కలు చెప్పడం లేదని ఆరోపించారు. రాష్ట్రంలో వంతెనలు కూలిపోతున్నాయని, ఆసుపత్రుల్లో రోగులకు భద్రత కరువైందని, అయినా ప్రభుత్వం అవినీతిపరులను వదిలేసి ఎలుకలకు రక్షణ కల్పిస్తోందని ఎద్దేవా చేశారు. 2020 ఎన్నికల్లో ఆర్‌జేడీ 144 స్థానాల్లో పోటీ చేసి 75 గెలవగా, కాంగ్రెస్ 70 స్థానాల్లో పోటీకి దిగి కేవలం 19 సీట్లకే పరిమితమైంది. ఈసారి జేఎంఎం, ఎల్జేపీ వంటి పార్టీలు కూడా కూటమిలో చేరాయి. ఈ నేపథ్యంలో సీట్ల సర్దుబాటు కీలకంగా మారిన సమయంలో, అన్ని స్థానాల్లోనూ పోటీ చేస్తామన్న తేజస్వి ప్రకటన మిత్రపక్షాలను తీవ్ర అసంతృప్తికి గురిచేసింది.

### భద్రతా వలయం ఛేదించుకుని తేజస్వి కాళ్లపై పడ్డయువకుడు!

బీహార్‌లో ప్రతిపక్ష నాయకుడు, ఆర్జేడీ అగ్రనేత తేజస్వి యాదవ్‌పర్యటనలో భద్రతాలోపం తలెత్తింది. ముజఫర్‌పూర్ జిల్లా పర్యటనలో భాగంగా ఒక కార్యక్రమంలో పాల్గొన్న తేజస్వి యాదవ్ హెలికాప్టర్‌లో తిరిగి వెళ్లేందుకు సిద్ధపడుతుండగా ఓ యువకుడు సెక్యూరిటీ వలయాన్ని ఛేదించుకుని పరుగుపరుగున ఆయన దగ్గరికి వచ్చి పాదాలపై పడ్డాడు. దీనికిముందు ముజఫర్‌పూర్‌లోని కాంతి స్కూల్‌లో భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని తేజస్వి యాదవ్ ఆవిష్కరించారు. అనంతరం పబ్లిక్ మీటింగ్‌లో పాల్గొని బయలుదేరేందుకు సిద్ధమయ్యారు. సరిగ్గా అప్పుడే నల్లటి చొక్కా ధరించిన ఒక యువకుడు సెక్యూరిటీ వలయాన్ని ఛేదించుకుని తేజస్వి చెంతకువచ్చి ఆయన పాదాలపై పడ్డాడు. దాంతో ఒక్కసారిగా తేజస్వి దిగ్భ్రాంతికి గురయ్యారు. భద్రతా సిబ్బంది ఆ యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. యువకుడి పేరు షరీఫుల్ ఇస్లామ్‌గా గుర్తించారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. తేజస్వియాదవ్‌పై ఉన్న అభిమానానికి నిదర్శనమని కొందరు.. భద్రతా లోపమని మరికొందరు కామెంట్స్ చేస్తున్నారు.

## జెన్‌జడ్ ఉద్యమంలో మృతులకు

# 'అమరవీరుల హోదా'

## నేపాల్ తాత్కాలిక ప్రధాని సుశీలా కర్కి

**ఖాట్మండు, సెప్టెంబరు 14:** జెన్‌జడ్ యువత చేపట్టిన భారీ ఆందోళనల కారణంగా కేపీ శర్మ ఓలీ ప్రభుత్వం కుప్పకూలిన కొన్ని రోజులకే ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి సుశీల కర్కి తాజాగా కీలక ప్రకటనలు చేశారు. తమ ప్రభుత్వం కేవలం ఆరు నెలల పాటే అధికారంలో ఉంటుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సుశీల కర్కి మాట్లాడుతూ తానుగానీ, తన బృందం గానీ అధికారాన్ని రుచి చూడటానికి ఇక్కడికి రాలేదు. ప్రజలకు సేవ చేయడానికే బాధ్యతలు చేపట్టాం. ఆరు నెలలకు మించి ఒక్క రోజు కూడా అధికారంలో కొనసాగం. కొత్తగా ఎన్నికయ్యే పార్లమెంటుకు పూర్తి బాధ్యతలు అప్పగిస్తామని తెలిపారు. దేశ పునర్నిర్మాణానికి ప్రజలందరి సహకారం అవసరమని, వారి మద్దతు లేకుండా తాము విజయం సాధించలేమని అన్నారు. ఇటీవల జరిగిన ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనల్లో ప్రాణాలు కోల్పోయిన వారిని అధికారికంగా 'అమరవీరులు'గా గుర్తిస్తామని కర్కి హామీ ఇచ్చారు. ఇది ఉద్యమంలో పాల్గొన్న వారికి ప్రభుత్వం ఇస్తున్న గౌరవంగా భావిస్తున్నారు. అదే సమయంలో నిరసనల సందర్భంగా జరిగిన విధ్వంసకర ఘటనలపై విచారణ జరిపిస్తామని ఆమె స్పష్టం చేశారు. అధికారం కోసం కాకుండా దేశాన్ని తిరిగి గాడిన పెట్టడానికే తాము వచ్చామని ఆమె చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం నేపాల్ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.

# ఏకైక ఆమ్ ఆద్మీ ఎమ్మెల్యేపై ప్రజాభద్రతా చట్టం

**శ్రీనగర్, సెప్టెంబరు 14:** ప్రజాప్రతినిధిపై ప్రజా భద్రతా చట్టం కింద చర్యలు తీసుకోవడం చాలా అరుదుగా జరుగుతుంటుంది. కానీ జమ్మూ కాశ్మీర్‌లోని ఏకైక ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఎమ్మెల్యే మెహ్రాజ్ మాలిక్‌పై పోలీసులు ఈ పీఎస్‌ఏ చట్టాన్ని ప్రయోగించి అరెస్ట్ చేయడం ఇప్పుడు సంచలనం సృష్టిస్తోంది. గత వారం పోలీసులు అదుపులోకి తీసుకున్న మెహ్రాజ్ మాలిక్‌పై ఇప్పటికే 18 కేసులు నమోదై ఉన్నాయని, పోలీస్ డైరీలో ఆయనపై రోజువారీ నివేదికలు ఉన్నాయని దోడా జిల్లా మెజిస్ట్రేట్ జారీ చేసిన పీఎస్‌ఏ డోసియర్‌లో పేర్కొన్నారు. 33 పేజీల ఈ డొసియర్‌లో మాలిక్‌ను హిస్టరీ షీటర్‌గా పేర్కొంటూ ఆయన సోషల్ మీడియాలో తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నారని, ప్రభుత్వ కార్యాలయాలను తగలబెట్టమని ప్రజలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. అధికారులు, రాజకీయ ప్రత్యర్థులపై ఆయన తరచుగా అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేస్తున్నారని డోసియర్‌లో పేర్కొన్నారు. ముఖ్యంగా ఎన్నికల డ్యూటీ సిబ్బందితో దురుసుగా ప్రవర్తించడం, అనుమతి లేకుండా ర్యాలీలు నిర్వహించడం, వైద్యుల పట్ల అనుచిత భాష ఉపయోగించడం వంటి ఆరోపణలు కూడా ఆయనపై ఉన్నాయి. 1978లో ఈ చ ట్టం అమల్లోకి వచ్చిన తర్వాత ఒక సిట్టింగ్ ఎమ్మెల్యేపై పీఎస్‌ఏ కింద కేసు నమోదు కావడం ఇదే మొదటి సారి. ఈ చట్టం ప్రకారం ఒక వ్యక్తిని విచారణ లేకుండానే రెండు సంవత్సరాల వరకు నిర్బంధించవచ్చు. ఇటీవల దోడా జిల్లా మెజిస్ట్రేట్‌పై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన కొద్ది రోజులకే పోలీసులు మెహ్రాజ్ మాలిక్‌పై ఈ చట్టాన్ని ప్రయోగించారు. మాలిక్ అరెస్టుకు వ్యతిరేకంగా దోడాలో భారీ నిరసనలు చెలరేగాయి. పరిస్థితిని అదుపు చేయడానికి అధికారులు కర్ఫ్యూ విధించి ఇంటర్నెట్ సేవలను నిలిపివేశారు. ఈ ఘర్షణల్లో పోలీసులు, నిరసనకారులు గాయపడ్డారు. ఈ అరెస్టుపై రాజకీయ వర్గాల్లో భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. బీజేపీ ఈ అరెస్టును సమర్థిస్తుండగా మాజీ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా వంటి ఇతరపార్టీల నాయకులు మాత్రం దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నారు. ప్రజాస్వామ్యంపై ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీసే చర్యగా అభివర్ణిస్తున్నారు.

# వరద సాయం ఉగ్ర సంస్థల పరం


## పాకిస్థాన్‌లో లష్కరే స్థావరాల పునరుద్ధరణ



**ఇస్లామాబాద్, సెప్టెంబరు 14:** ఉగ్రవాదులతో తమకు సంబంధం లేదని ప్రపంచ వేదికపై మేకపోతు గాంభీర్యాలు పలికే పాకిస్థాన్ లోలోపల ఉగ్రస్థావరాల పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటున్నట్లు భారత నిఘా వర్గాలు వెల్లడించాయి. ఆపరేషన్ సిందూర్ సమయంలో ఉగ్రవాదాన్ని నిర్మూలించడమే లక్ష్యంగా భారత్ పాక్‌లోని అనేక ఉగ్రస్థావరాలను ధ్వంసం చేసింది. అయినా బుద్ధి మారని దాయాది దేశం తినడానికి లేకపోయినా కూడా వరద బాధితుల పేరుతో సేకరించిన నిధులను ఉగ్ర స్థావరాల పునరు ద్ధరణకు ఖర్చు చేస్తున్నట్లు భారత నిఘా వర్గాలు పేర్కొన్నాయి. ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత వైమానిక దళం ధ్వంసం చేసిన లష్కరే ప్రధాన క్యాంపు కార్యాలయం మర్కాజ్ తోయిబాను పునర్నిర్మించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపాయి. ధ్వంసమైన లష్కరే తోయిబా ప్రధాన కార్యాలయ విభాగాలను తొలగించడానికి దాని చుట్టూ భారీ యంత్రాలను మోహరించి ఉన్న దృశ్యాలు ఉపగ్రహ చిత్రాల్లో కనిపిస్తున్నట్లు భారత నిఘా వర్గాలు వెల్లడించాయి. దీనిని పునర్నిర్మించిన తర్వాత మళ్లీ ఉగ్రవాదులకు శిక్షణ స్థావరంగా ఉపయోగించనున్నట్లు తెలిపాయి. ఆపరేషన్ సిందూర్ సమయంలో ధ్వంసమైన ఎల్ఇటికి ఆగస్టులో పాక్ ప్రభుత్వం నుంచి రూ. 1.25 కోట్లు ఇవ్వగా.. పునరుద్ధరణకు అయ్యే మొత్తం ఖర్చు సుమారు రూ. 4.7 కోట్లకుపైగా ఉంటుందని నిఘా వర్గాలు పేర్కొన్నాయి. వీటికి కావాల్సిన నిధులను సేకరించడానికి పాక్ మేకవన్నె పులిలా మానవతావాద ముసుగులో ప్రచారాలు చేపడుతోంది. వరద ప్రభావిత ప్రాంతాల సహాయం పేరుతో విరాళాలు సేకరించి ఉగ్ర సంస్థలకు మళ్లిస్తోంది.

# సంక్షిప్తంగా..

## అసోంలో భూకంపం.. రిక్టర్ స్కేల్‌పై 5.8గా నమోదు




**గౌహతి, సెప్టెంబరు 14:** అసోంలో భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేల్‌పై 5.8 తీవ్రతగా నమోదైంది. ఉదల్‌గిరి జిల్లాలోని ధెకియజులి ప్రాంతానికి 16 కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రం ఉన్నట్లు అధికారులు గుర్తించారు. 5కిలోమీటర్ల లోతులో ఇది సంభవించిందన్నారు. భూకంప తీవ్రతకు పలు ఇళ్లు స్వల్పంగా ఊగినట్లు సమాచారం. అయితే ఇప్పటివరకు ప్రాణ, ఆస్తినష్టం జరగలేదని అధికారులు వెల్లడించారు. ఈశాన్య రాష్ట్రాలతో పాటు బంగ్లాదేశ్, నేపాల్, భూటాన్, మయన్మార్, చైనాలోనూ భూ ప్రకంపనలు వచ్చినట్లు తెలిసింది. అసోంలోని ఇదే ప్రాంతంలో వారం క్రితం 3.5 తీవ్రతతో భూకంపం సంభవించింది. ప్రధాని మోడీ ప్రస్తుతం అసోం పర్యటనలోనే ఉన్న విషయం తెలిసిందే.

## చైనా నౌకలను అడ్డుకొన్న తైవాన్



**తైపెయి సిటీ, సెప్టెంబరు 14:** తైవాన్ కోస్ట్‌గార్డ్ అడ్మినిస్ట్రేషన్ (సిజిఎ) శనివారం చైనాకు చెందిన నౌకలను అడ్డుకొంది. వీటిల్లో బీజింగ్‌కు చెందిన కోస్ట్‌గార్డ్ నౌక ఒకటి కాగా మరొకటి భారీ చేపల పడవగా చెబుతున్నారు. రెండు నౌకలు డాంగ్‌షా ద్వీపం వద్ద కార్యకలాపాలు సాగిస్తుండగా ఈ ఘటన చోటుచేసు కొంది. దీంతో తైవాన్-చైనా మధ్య దక్షిణ చైనా సముద్ర జలాల్లో ఉద్రిక్తతలు పెరిగిపోయాయి. ఫోకస్ తైవాన్ పత్రిక కథనం ప్రకారం గురువారం ఉదయం 6.15 గంటల సమయంలో రెండు చైనా నౌకల ను డాంగ్‌షా-నాంషా వద్ద గుర్తించారు. ఇవి ఇంకా నిషేధిత ప్రదేశానికి కొంచెం దూరంలో ఉండటంతో 2,000 టన్నుల కట్టర్ తైనాన్ అనే షిప్‌ను రంగంలోకి దించారు. అది శుక్రవారం చైనా కోస్ట్‌గార్డ్ నౌకను వెన్నంటే ఉండటంతో అది అక్కడి నుంచి వెళ్లిపోయింది. అయితే ఆ రోజు రాత్రి చైనా చేపలవేట నౌక నిషేధిత ప్రాంతానికి చేరుకొంది. దీంతో రెండు తైవాన్ నౌకలు అక్కడికి చేరుకొని దానిని అడ్డగించాయి. దీంతో అది వెనక్కి వెళ్లిపోయింది.

## మాడ్రిడ్‌లో చర్చల వేళ అమెరికాపై చైనా దర్యాప్తులు షురూ




**బీజింగ్, సెప్టెంబరు 14:** అమెరికా రెండు అంశాల్లో తప్పుడు విధానాలు అవలంబిస్తోందని ఆరోపిస్తూ చైనా ఒకేసారి రెండు దర్యాప్తులు మొదలు పెట్టింది. స్పెయిన్‌లోని మాడ్రిడ్‌లో రెండు దేశాల మధ్య చర్చలు మొదలుకానున్న వేళఇది జరగడం గమనార్హం. మాడ్రిడ్ సమావేశంలో జాతీయ భద్రత, టిక్ టాక్ సోషల్ మీడియా యాజ మాన్య హక్కుల వంటివి చర్చకు రానున్నాయి. అమెరికా సెమీకండక్టర్లను లక్ష్యంగా చేసుకొని చైనా ఈ దర్యాప్తులు చేపట్టింది. కొన్ని ఐసి చిప్స్‌లో అమెరికాపై యాంటీ డంపింగ్ ఇన్వెస్టిగేషన్‌ను మొదలు పెట్టింది. వీటిని అమెరికాలోని టెక్సాస్ ఇన్‌స్ట్రుమెంట్స్, ఆన్ చిప్స్ సంస్థలు తయారుచేస్తుంటాయి. చైనాలో తయారైన సెమీకండెక్టర్లపై అమెరికా వివక్ష చూపుతోందంటూ మరో దర్యాప్తు చేపట్టింది. ఆదివారం మాడ్రిడ్‌లో చైనా వైస్‌ప్రీమియర్ లిఫెంగ్, అమెరికా ట్రెజరీ సెక్రెటరీ స్కాట్ బెస్సెంట్ భేటీ అయ్యారు. శుక్రవారం అమెరికా ప్రభుత్వం 23 సంస్థలను ఆంక్షల పరిధిలోని జాబితాలో చేర్చడంతో చైనా ప్రతీకారంగా ఈ నిర్ణయం తీసుకుంది. వీటిల్లో చైనా చిప్స్ తయారీ సంస్థ ఎస్ఎంఐసి కూడా ఉంది.

## టేకాఫ్ కాకుండానే రన్‌వేపై నిలిచిపోయిన ఇండిగో



**లక్నో, సెప్టెంబరు 14:** ఉత్తరప్రదేశ్‌లోని లక్నో విమానాశ్రయంలో ఆదివారం ఊహించని ఘటన చోటు చేసుకుంది. లక్నో నుంచి ఢిల్లీ వెళ్తున్న ఇండిగో విమానంలో టేకాఫ్ సమయంలో సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో విమానం పైకి ఎగురలేక రన్‌వేపైనే ఆగిపోయింది. దీంతో పైలట్ చాకచక్యంగా వ్యవహరించి టేకాఫ్‌ను నిలిపివేశారు. ఆసమయంలో సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ డింపుల్ యాదవ్ సహా 151మంది ప్రయాణికులు విమానంలో ఉన్నట్టు అధికారులు తెలిపారు. టేకాఫ్ నిలిపివేసిన అనంతరం ప్రయాణికులను కిందకు దించి వేరే విమానంలో ఢిల్లీకి పంపారు.

## గగనతలాన్ని కాపాడిన మిగ్ 21లకు రిటైర్మెంట్



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 21:** భారత వాయుసేనకు దాదాపు అర్ధశతాబ్దానికి పైగా సేవలు అందించి గగనతలాన్ని కాపాడిన మిగ్-21లకు ఇప్పుడు రిటైర్మెంట్ ప్రకటించారు. అయితే వీటిని కొనుగోలు చేసేందుకు చాలా సంస్థలు క్యూ కట్టాయి. కనీసం ఒక్క దానినైనా సొంతం చేసుకోవాలని పోటీ పడుతున్నాయి. వాయుసేన మిగ్-21 ఫైటర్‌జెట్ రిటైర్మెంట్ తర్వాత విద్యాసంస్థలు వార్ మెమోరి యల్స్ మిలిటరీ మ్యూజియాలు వీటి ఎయిర్ ఫ్రేమ్‌ను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం వద్ద క్యూకట్టాయి. సెప్టెంబర్ 26న రెండు స్క్వాడ్రన్ల ఈ యుద్ధ విమానాలకు తుది వీడ్కోలు పలకనున్నారు.

# యర్రంపల్లి సొసైటీ అధ్యక్షుడిగా చంద్రశేఖరెడ్డి ప్రమాణస్వీకారోత్సవం

## - హాజరైన ఎంపీ పుట్టా మహేష్ కుమార్, ఎమ్మెల్యే సొంగ రోషన్ కుమార్.
## - అభివృద్దే లక్ష్యంగా కలిసికట్టుగా పనిచేస్తాం.. ఎంపీ పుట్టా మహేష్ కుమార్



**ఏలూరు, ప్రభాతవార్త :** యర్రంపల్లి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం అధ్యక్షుడిగా నియమించబడ్డ తాళ్లూరి చంద్రశేఖరెడ్డి ప్రమాణస్వీకారోత్సవం ప్రగడవరం గ్రామంలో శనివారం సాయంత్రం వేడుకగా జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ పుట్టా మహేష్ కుమార్ మాట్లాడుతూ.. కష్టపడే వారికి పదవులు తప్పకుండా దక్కుతాయనేదానికి ఈ సహకార పరపతి సంఘాల అధ్యక్షుల ఎంపికే నిదర్శనమన్నారు. కూటమి ప్రభుత్వంలో పొగాకు, పామాయిల్, కోకో రైతులకు మంచి మద్దతు ధర లభిస్తోందని,

7వ పేజీలో



# అటవీ భూమిని ఆక్రమించేందుకు యత్నం

## - అడ్డుకున్న అటవీ శాఖ అధికారులు -తొమ్మిది మందిపై కేసులు



**చాట్రాయి, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త :** తమ్మిలేరు రిజర్వాయర్ ప్రాజెక్టు వద్ద పోలవరం బ్లాక్ పరిధిలో ఉన్న అటవీ భూమిని ఆక్రమించేందుకు పోతనపల్లి గ్రామానికి చెందిన కొందరు ప్రయత్నించగా అటవీశాఖ అధికారులు అడ్డుకున్నారు. తమ్మిలేరు ముంపులో తమ భూములను కోల్పోయామని అటవీ భూమిని భూమిలేని నిరుపేదలమైన మేము ఒక్కొక్కరు అర ఎకరం చొప్పున సాగు చేసుకుంటామంటూ చెట్లు నరికే కార్యక్రమం చేపట్టడంతో సమాచారం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు నూజివీడు రేంజి ఆఫీసర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో చాట్రాయి పోలీసులు సహకారంతో వారిని అడ్డుకున్నారు. అయితే కొందరు అటవీ శాఖ అధికారులపై ఎదురుదాడికి దిగడంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి నచ్చ చెప్పే ప్రయత్నం చేసినప్పటికీ కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా రేంజ్ ఆఫీసర్ సత్యనారాయణ మాట్లాడుతూ పోలవరం బ్లాక్ పరిధిలో 355 హెక్టార్ల అటవీ భూమి ఉందని ఇది రికార్డులో స్పష్టంగా ఉందని ఈ భూముల్లోకి ఎవరైనా అడుగుపెడితే చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. అటవీ భూమిని కాపాడాల్సిన బాధ్యత తమపై ఉందని ఆక్రమణకు గురి చేస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. అవసరమైతే వన సమారక్షణ సమితులు ఏర్పాటు చేసి భూమిలేని నిరుపేదలకు ఆదాయం వచ్చే విధంగా ఏర్పాటు చేసేందుకు అవకాశం ఉందని అని చెప్పారు.వన సంరక్షణ సమితి ద్వారా వచ్చిన ఆదాయంలో 50 శాతం వన సంరక్షణ సమితి సభ్యులకు అందజేయడం జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. ఇదేవిధంగా పర్వతాపురం చీపురుగూడెం, చాట్రాయి గ్రామాలలో వనసంరక్షణ సమితులు ఏర్పాటు చేశామని ఆదాయం వస్తోందని ఆయన తెలియజేశారు. అదేవిధంగా పేదలు ముందుకొస్తే ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఆయన ప్రకటించారు. దీనితో ఉద్రిక్త వాతావరణం చల్లబడటంతో అధికారులు వెనుతిరిగారు.

**9 మంది పై కేసులు నమోదు**

అటవీ శాఖ అధికారులపై దౌర్జన్యానికి పాల్పడిన 9 మందిపై చాట్రాయి పోలీస్ స్టేషన్ లో కేసులు పెట్టినట్లు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ సత్యనారాయణ చెప్పారు. పోతనపల్లి గ్రామానికి చెందిన బాణావతు కృష్ణ ప్రసాద్, ధారావతు మంగయ్య, కంచర్ల శీను, తేలూరి లాజరు, హసావతు రమేష్, ధరావతు సోమేశ్వరరావు, కోట గాబ్రియేలు, కుమరవరపు రమేష్ లపై చాట్రాయి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. దౌర్జన్యంగా అటవీ భూమిని ఆక్రమించుకోవాలని ప్రయత్నించడం నేరమని ప్రభుత్వం నిబంధనల ప్రకారం నడుచుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



# పేదలకు అండగా ముఖ్యమంత్రి సహాయ నిధి

## - మంత్రి పార్థసారథి - చాట్రాయి మండలానికి 7 లక్షల మంజూరు

**చాట్రాయి, సెప్టెంబర్14, ప్రభాతవార్త :** పేదలకు అండగా ముఖ్యమంత్రి సహాయ నిధి వరంగా ఉందని రాష్ట్ర గృహ నిర్మాణ మరియు సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి కింద చాట్రాయి మండలంలోని వివిధ గ్రామాలలోని 17 మంది పేద కుటుంబాలకు గాను 7 లక్షల వరకు మంజూరైన చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య శ్రీ పథకంలో వర్తించని వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా నిధులు అందజేస్తున్నట్లు ఆయన చెప్పారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేదల సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తున్నారని అన్నారు. పార్టీలకతీతంగా పేదలకు సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ఆయన స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి అన్నదాత సుఖీభవ ద్వారా రైతులకు 20,000 అందించాల్సి ఉండగా మొదటి విడతగా ఏడు వేలు రైతుల ఖాతాలో ఒకేరోజు జమ అయ్యాయని చెప్పారు. అదేవిధంగా ఏడాదికి మూడు గ్యాస్ బండలు ఉచితంగా అందజేసే పథకాన్ని కూడా సమర్థవంతంగా అమలు చేస్తున్నామని చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం ఏర్పాటు చేయడంతో మహిళలు ఎంతో ఆనందంతో ఉన్నారని చెప్పారు. ఈ విధంగా అన్ని పథకాలు అమలు చేయడం వల్లనే సూపర్ సిక్స్ సభ సూపర్ సక్సెస్ అయిందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఇజ్జిగాని వెంకటేశ్వరరావు, తెలుగుదేశం నాయకులు మంచెన పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



# వర్షం పడితే పంట భూములకు వెళ్లడం ప్రశ్నార్థకమే

## - ఇబ్బందుల నుండి విముక్తి కల్పించండి మహాప్రభో
## - కల్వర్టు నిర్మించి పుణ్యం కట్టుకోండి

**ప్రభాతవార్త చాట్రాయి :** వర్షం పడిందంటే వ్యవసాయ భూములకు వెళ్ళటం కృష్ణార్జున మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.పంట భూములకు వెళ్లేందుకు రహదారులకు వాగులు అడ్డంగా ఉండడంతో వ్యవసాయ ఉత్పత్తులు ఇంటికి చేర్చుకునేందుకు ఇబ్బందిగా మారిందని కల్వర్టులు నిర్మించి పుణ్యం కట్టుకోవాలని చాట్రాయి మండలం, ఆరుగొలనుపేట రైతులు వేడుకుంటున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణ మరియు సమాచార శాఖ మాత్యులు ఈ రోడ్డుపై దృష్టి సారించి రైతులకు మేలు చేయాలని పలువురు కోరుతున్నారు. గత నాలుగు రోజులుగా కురుస్తున్న వానల వల్ల ఈ రోడ్డులో నడవడమే కష్టంగా ఉందని పంట పొలాలను చూసుకునే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.నల్లరాళ్లరోడ్డులో మూడు వాగులు ఉండటం వల్ల వర్షాలు పడిన సమయంలో రాకపోకలకు ఇబ్బందిగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారిలో సుమారు 1000 ఎకరాలు వరకు సాగు భూములు ఉండగా రైతులందరికీ ఇదొక్కటే రహదారి కావడంతో అన్నదాతలు అష్ట కష్టాలు పడుతున్నారు. నిత్యం వందలాది వాహనాలు తో పాటు పశువులను కూడా ఈ రోడ్డు నుండి మేత కోసం పొలాలకు తీసుకు వెళ్లాల్సి ఉంది. భారీగా వర్షాలు పడిన సమయంలో ఈ రోడ్డులో వెళ్లాలంటే సాహసం చేయాలనే చెప్పాలి. ఈ రోడ్డులో మోతాల చెరువుకి వెళ్లే వాగు, బేపనగుంట వాగు, పంగిడి చెరువుకి వెళ్లే లోతు వాగులు ఉన్నాయి. వర్షాలు అధికంగా వచ్చినప్పుడు రోడ్డుకు గండి పడుతుండటంతో వాహనాల రాకపోకలు కూడా వీలులేని పరిస్థితి ఏర్పడుతుంది. గండ్లు పడకుండా కల్వర్టులు నిర్మాణం చేస్తే రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను ఇంటికి చేర్చుకునేందుకు అనువుగా ఉంటుందని రైతులు కోరుతున్నారు. అయితే ఈ సమస్యపై ఆరుగొలను పేట గ్రామస్తులు గత ప్రభుత్వ హయాంలో పలుమార్లు అధికారులకు విజ్ఞాపన పత్రాలు అందజేసినా ప్రయోజనం శూన్యమైందని మంత్రి పార్థసారథి దృష్టిసారించి ఉన్నతాధికారులు సమస్యపై పరిశీలన చేయించి రైతులకు మేలు చేసేందుకు తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



# ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

**భీమవరం సెప్టెంబర్ 14 ప్రభాతవార్త :** డా. బి.వి. రాజు ఫౌండేషన్, శ్రీ విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ, భీమవరం ఆధ్వర్యంలోని విష్ణు ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (అటానమస్) తృతీయ గ్రాడ్యుయేషన్ డే ఆదివారం కళాశాల దక్షిణ క్యాంపస్‌లోని విష్ణు కన్వెన్షన్ సెంటర్‌లో ప్రిన్సిపాల్ డాక్టర్ మంగం వేణు ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీ విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ వైస్ చైర్మన్ రవిచంద్రన్ రాజగోపాల్ 2025 బ్యాచ్‌కు చెందిన 1,091 మంది బి.టెక్, ఎం.టెక్ విద్యార్థులకు డిగ్రీ సర్టిఫికెట్లు ప్రదానం చేసి, అకాడమిక్ టాపర్లకు పతకాలు అందజేశారు. ఈ సంవత్సరం బి.వి. రాజు మెమోరియల్ అవార్డు ను ఎలక్ట్రికల్ విభాగానికి చెందిన సుదర్శనం వి.ఎస్.ఎస్. శేష వీరభానుచందు పొందగా, ఓవరాల్ బ్యాచ్ టాపర్ అవార్డు ను కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన వల్లూరి వినూత్న అందుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇంత శుభప్రదమైన గ్రాడ్యుయేషన్ డేకు హాజరైన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. విష్ణు కళాశాల పూర్వ విద్యార్థులు తమ వృత్తి జీవితంలో అత్యున్నత బాధ్యతాయుత స్థానాలను అధిరోహించినందుకు వారికి అభినందనలు తెలిపారు. కొంతమంది విద్యార్థులు కొత్త కంపెనీలు ప్రారంభించి ఎంట్రెప్రినేటర్స్ గా ఎదిగినందుకు తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మంగం వేణు ప్రారంభంలోనే విద్యార్థులతో కళాశాల గౌరవాన్ని కాపాడుతూ, తమ వ్యక్తిత్వాన్ని నిలబెట్టుకుంటూ, కళాశాల అభివృద్ధికి తద్వారా దేశ అభివృద్ధికి తోడ్పడతామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ బ్యాచ్ విద్యార్థులు 80 శాతం పైగా ప్లేస్‌మెంట్లు సాధించారని గర్వంగా తెలియజేశారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం. శ్రీలక్ష్మి మాట్లాడుతూ, ఇంజనీరింగ్ డిగ్రీ కేవలం ఒక సర్టిఫికెట్ మాత్రమే కాదని, ఇది మీ కృషి, శ్రమ, క్రమశిక్షణ, కలలను నిజం చేసుకోవాలన్న పట్టుదలకు గుర్తు అన్నారు.



పశ్చిమగోదావరి,ఏలూరు వార్త

# చెత్త వేయడానికి తుంగపాటి చెరువు

## క్షేత్రస్థాయిలో పరిశీలించిన నాయకర్
## పరిసర ప్రాంత ప్రజలకు ఇబ్బంది రాకుండా చూస్తామని హామీ







**ప్రభాతవార్త నరసాపురం :** పట్టణంలో 31 వార్డులకు చెందిన చెత్త వేయడానికి అన్ని వైపులా మార్గాలు మూసుకుపోవడంతో మునిసిపల్ అధికారులు ప్రత్యామ్నాయ మార్గాలను చూస్తున్నారు. మున్సిపాలిటీకి చెందిన తుంగపాటి చెరువు ఏరియాలో చెత్త వేయాలని నిర్ణయించారు. అందులో భాగంగా నరసాపురం పట్టణం 28వ వార్డులో మున్సిపాలిటీకి చెందిన తుంగపాటి చెరువుగట్టు స్థలాన్ని డంపింగ్ యార్డ్ కోసం పరిశీలించిన ప్రభుత్వ విప్ మరియు నరసాపురం శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్ .ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయకర్ మాట్లాడుతూ, స్థానిక ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా, పర్యావరణహితంగా డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయాలని మున్సిపల్ అధికారులకు సూచించారు అని తెలిపారు.పర్యావరణ పరిరక్షణతో పాటు పట్టణ శుభ్రతకు ఇది తోడ్పడేలా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని కూడా నాయకర్ అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ అంజయ్య మరియు నియోజకవర్గ జనసేన టిడిపి బీజేపీ నాయకులు జనసేన తదితరులు పాల్గొన్నారు

# కర్నూలు ఉల్లినే వినియోగించేలా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

**తాడేపల్లిగూడెం సెప్టెంబర్14, ప్రభాతవార్త :** కర్నూలు ఉల్లినే వినియోగించేలా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి, రైతులకు లాభదాయకమైన ధరను అందించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అధికారులు ఆదేశించారు ఆదివారం తాడేపల్లిగూడెం బ్రహ్మానంద రెడ్డి హోల్ సేల్ ఉల్లి మార్కెట్ ను జిల్లా జాయింట్ కలెక్టర్ టి రాహుల్ కుమార్ రెడ్డి ఆకస్మికంగా సందర్శించారు. కడప, కర్నూలు నుండి వచ్చిన ఉల్లి పాయలను స్వయంగా ఆయన పరిశీలించారు. ఈరోజు జరిగిన ఉల్లి ఆక్షన్ ను స్వయంగా పరిశీలించారు. ఉల్లి ధర తక్కువ పలకడంతో హోల్ సేల్ వ్యాపారస్తులతో జేసీ మాట్లాడారు. కర్నూలు, కడప నుండి వచ్చిన ఉల్లి కొనటం ద్వారా రైతులు ఆదుకోవడం జరుగుతుందని అన్నారు. మార్కెట్లో కొనుగోలు పెరిగితే రైతులకు కొంత ఊరటం లభిస్తుందని చెప్పారు. ఇక్కడ వచ్చే రేటు కన్నా ఎక్కువ రేటు వచ్చే విధంగా మార్కెట్ యార్డులు, రైతు బజార్లు ద్వారా ప్రత్యామ్నాయ ఏర్పాట్లను అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. రైతులకు సరైన గిట్టుబాటు ధర లభించకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నారని హోల్ సేల్ వ్యాపారస్తులు రైతుకు కనీసం మద్దతు ధర వచ్చేలా సహకరించాలని సూచించారు. ఈ సందర్భంలో ఆర్డీవో ఖతీబ్ కౌసర్ భానో, మార్కెట్ యార్డ్ డిప్యూటీ డైరెక్టర్ పాపారావు, జిల్లా మార్కెటింగ్ ఏడి కే సునీల్ కుమార్, తాహసిల్దార్ ఎం సునీల్ కుమార్, హోల్సేల్ వ్యాపారస్తులు రైతులు తదితరులు పాల్గొన్నారు.



# బాధిత కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయనిధి

**నరసాపురం ప్రభాతవార్త :** నరసాపురం జనసేన పార్టీ కార్యాలయంలో, లక్ష్మణేశ్వరం గ్రామానికి చెందిన తుళ్ళూరి గిరిధర్ రావు తన ఇద్దరు కవల పిల్లలు కోమల్ వెంకట్ మరియు కోమల్ విరాట్ ఆనంద్ వినికిడి లోపంతో బాధపడుతూ చికిత్స కోసం రూ. 18,54,500/- వ్యయం అవుతుందని తెలియజేశారు. ఈ విషయాన్ని తెలుసుకున్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ మరియు నరసాపురం శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్ వెంటనే స్పందించి, ముఖ్యమంత్రి సహాయ నిధి లెటర్ అందజేశారు. తల్లిదండ్రులకు ధైర్యం చెబుతూ, పిల్లలకు త్వరలోనే మంచి జరుగుతుందని భరోసా కల్పించారు.అలాగే, నరసాపురం మండలం కరిమిసెట్టి పాలెం గ్రామం (తూర్పు తాళ్ళు)కు చెందిన సి.హెచ్. రామకృష్ణ గారికి రూ. 2 లక్షలఎల్ ఓ సి లెటర్‌ను కూడా జనసేన పార్టీ కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో నియోజవర్గ జనసేన టిడిపి బిజెపి నాయకులు జనసైనికులు వీర మహిళలు తదితరులు పాల్గొన్నారు.



# రహదారి కోసం ఐదో రోజు కొనసాగిన రిలే నిరాహార దీక్షా

**మొగల్తూరు సెప్టెంబర్ 14 (ప్రభాతవార్త) :**గాంధీ బొమ్మ సెంటర్లో మొగల్తూరు వయా వెంప రహదారి నిర్మించాలని కోరుతూ ఐక్య ప్రజా వేదిక ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్ష లలోఆదివారం ఐదవ రోజు దీక్ష కొనసాగింది. ఈ దీక్ష శిబిరంలో చిట్టిబాబు బంగారు వెంకట సీతారామయ్య, అడ్డాల ఏడుకొండలు, కుందేటి వెంకటేశ్వరరావు, వాముశెట్టి బోసు బాబు తదితరులు కూర్చున్నారు.

# వాగు దుర్ఘటనలో ఒక మృతదేహం లభ్యం,

## మరొకరి కోసం డ్రోన్ తో పోలీసులు తీవ్ర గాలింపు,





**జీలుగుమిల్లి-ప్రభాతవార్త, :** మండలంలోని పూచికపాడు గ్రామానికి చెందిన ఇద్దరు మహిళ కూలీలు శనివారం కురిసిన అతి భారీ వర్షానికి తెలంగాణ రాష్ట్ర అశ్వరావుపేట మండలం చెన్నాపురం వద్ద వాగును దాటుతూ ఇద్దరు మహిళ కూలీలైన పాలడుగుల చెల్లెమ్మ, పచ్చిశాల వరలక్ష్మి గల్లంతైన విషయం విధితమే! ఈ నేపథ్యంలో చెల్లమ్మ మృతదేహాన్ని ఆదివారం పోలీసులు గుర్తించారు. మరో మహిళ వరలక్ష్మీ మృతదేహం ఇంకా లభ్యం కాలేదు. ఈమె ఆచూకీ కోసం పోలవరం డిఎస్పి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జీలుగుమిల్లి సీఐ వెంకటేశ్వరరావు, స్థానిక ఎస్సై క్రాంతి కుమార్, వేలేరుపాడు ఎస్ఐ నవీన్ కుమార్, అటు అశ్వరావుపేట పోలీసులు, ఎన్డిఆర్ఎఫ్ ఎఫ్ సిబ్బంది డ్రోన్ సహాయంతో ప్రమాదానికి కారణమైన వాగు నుండి పెదబాబు ప్రాజెక్టు వరకు గాలింపు చేపట్టారు. ఇదిలా ఉంటే చెల్లమ్మ మృతదేహాన్ని అశ్వరావుపేట పోలీసులు అక్కడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. ఈ నేపథ్యంలో పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, జనసేన నేత గడ్డమణుగు రవికుమార్ ఆస్పత్రికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి, చెల్లమ్మ కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు.

# శ్రీ బండి ముత్యాలమ్మ ఆలయానికి భక్తులు తాకిడి

**మొగల్తూరు సెప్టెంబర్ 14 ( ప్రభాతవార్త) :**216 నేషనల్ హైవే లో ఆనుకుని ముత్యాలపల్లి గ్రామపంచాయతీ పరిధిలో వెలసి ఉన్న శ్రీ బండి ముత్యాలమ్మ ఆలయానికి ఆదివారం పలు జిల్లాల నుండి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని, నైవేద్యము లు సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు, ఈ సందర్భంగా ఆలయ ఈవో మోకా అరుణ్ కుమార్ ఆలయ చైర్మన్ కడలి మాణిక్యాలరావు, డైరెక్టర్లు గ్రామస్తులు ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యములు కలగకుండా, క్యూ లైన్ నిర్వహించారు, అనంతరం మహిళా భక్తులకు పసుపు కుంకుమ గాజులు అందజేశారు



# బ్రిడ్జిల నిర్మాణానికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే రోషన్ కుమార్



జంగారెడ్డిగూడెం,ప్రభాతవార్త: జంగారెడ్డిగూడెం మండలం పట్టెన్న పాలెంలో ఆదివారం జల్లేరు వాగు బ్రిడ్జి వద్ద 73 లక్షలతో నిర్మించిన కాజ్ వే వంతెనను చింతలపూడి ఎమ్మెల్యే సొంగ రోషన్ కుమార్, పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు సంయుక్తంగా ప్రారంభించారు. దాదాపు 25 గ్రామాలకు అనుసంధానం చేసే పట్టెన్నపాలెం కాజ్ వే ను శాసనసభ్యులు ఇరువురు ప్రారంభించడం ద్వారా అనేక గ్రామాలకు దగ్గర మార్గం ఏర్పడిందాని ప్రజలు హర్షాతి రేఖం వ్యక్తం చేశారు. అనంతరం టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ దాసరి శేష నిర్వహణలో సభ జరిగింది. సభలో చింతలపూడి శాసనసభ్యులు రోషన్ కుమార్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని కళ్లచెరువు, బయనేరు,పట్టెన్నపాలెం బ్రిడ్జిల నిర్మాణంకు అదనంగా నిధులు మంజూరు కోసం కృషి చేస్తున్నానని తెలిపారు. గత ప్రభుత్వంలో బ్రిడ్జిలు,రోడ్లు, డ్రైనేజీల నిర్మాణంలో నిర్లక్ష్యం వహించారని విమర్శించారు. సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ అయ్యాయి అన్నారు. పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు మాట్లాడుతూ పోలవరం నియోజకవర్గంలో బ్రిడ్జిలు,రోడ్ల నిర్మాణంకు కృషి చేస్తున్నానని తెలిపారు. పట్టెన్నపాలెం వద్ద బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయించడానికి సహకరిస్తానని తెలిపారు. డిసిసిబి మాజీ చైర్మన్ కరాటం రాంబాబు మాట్లాడుతూ పట్టెన్నపాలెం వద్ద గల జల్లేరు వాగులో ఇప్పటివరకు సుమారు 26మంది దుర్మరణం చెందారన్నారు. ఈ సమావేశంలో జడ్పిటిసి పోల్నాటి బాబ్జి, చింతలపూడి నియోజకవర్గ జనసేన కన్వీనర్ మేకా ఈశ్వరయ్య, జంగారెడ్డి మండల జనసేన ప్రెసిడెంట్ ఆకుల రాజేష్,జనసేన పోలవరం నాయకులు కరాటం సాయి తదితరులు ప్రసంగించారు. సభలో నాయకులు సాయిల సత్య నారాయణ,రావూరి కృష్ణ పరిమి సత్తిపండు,ఆకుల రామచంద్రరావు, పెనుమర్తి రామ్ కుమార్, శ్రీనివాసపురం సొసైటీ ప్రెసిడెంట్ గంధం గోపాలకృష్ణ,ఆర్ అండ్ బి డిఈ హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముందు కాజ్ వే నిర్మాణంను ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు అధికారులు పరిశీలించారు.

## భారీ వర్షాకాలం లో వాగులు,కాలువలు దాటే ప్రయత్నం చేయవద్దు



జంగారెడ్డిగూడెం,ప్రభాతవార్త : వాతావరణం మార్పులు కారణంగా ఎగువ ప్రాంతాల్లో కురిసే భారీ వర్షాల కారణంగా మండలంలోని పంగిడిగూడెం,రాజవరం మధ్యలోని కాజ్ వే వద్ద ప్రవహిస్తున్న ఎర్ర కాలువ వాగులో నీటి పరిమాణం ప్రమాదకర స్థాయిలో చేరుతుంది. ఈ నేపథ్యంలో ఏలూరు జిల్లా ఎస్పీ కే ప్రతాప్ శివ కిషోర్,జంగారెడ్డిగూడెం డిఎస్పి యు.రవిచంద్ర ఆదేశాల ప్రకారం జంగారెడ్డిగూడెం సిఐ సుభాష్,రెవెన్యూ సిబ్బందితో కలిసి కాలువ వంతెన పై అత్యవసర పరిశీలన ఆదివారం జరిపారు. ప్రమాదాలు నివారించడానికి అధికారులు చర్యలు చేపట్టారు.

# పట్టెన్నపాలెం సీసీ రోడ్డు ప్రారంభం



జంగారెడ్డిగూడెం, ప్రభాతవార్త: జంగారెడ్డిగూడెం పట్టేన్నపాలెం పంచాయతీ లో మౌలిక సదుపాయాలకు తనవంతు సహకారం అందిస్తానని చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అన్నారు. పట్టెన్న పాలెం పంచాయతీ లో ఆదివారం ఎమ్మెల్యే రోషన్ కుమార్ జడ్పి జనరల్ ఫండ్స్ నుండి రూ. 9.75 లక్షలతో నిర్మించిన సిసి రోడ్డును ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి పోల్నాటి బాబ్జి, టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ దాసరి శేషు, మండల జనసేన ప్రెసిడెంట్ ఆకుల రాకేష్,టిడిపి నాయకులు పరిమి సత్తిపండు,రావూరి కృష్ణ,మాజీ సర్పంచ్ ఆకుల రామచంద్రరావు, ఆకుల ధర్మరాజు,సాయిల సత్యనారాయణ,తదితరులు పాల్గొన్నారు.

## పత్తి దిగుమతులపై సుంకం రద్దు పత్తి రైతులకు మరణ శాసనం



జంగారెడ్డిగూడెం,ప్రభాత వార్త : కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఆర్థిక వ్యవహారాల మంత్రిత్వ శాఖ పత్తి దిగుమతులపై 11శాతం సుఖాన్ని రద్దు చేయడం పట్ల ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కే శ్రీనివాస్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం జంగారెడ్డిగూడెంలోని ప్రజాసంఘాల కార్యాలయంలో జరిగిన రైతు సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర సబ్సిడీ కుదింపులో భాగంగానే యూరియా కొరత ఏర్పడిందని ఆరోపించారు. ఈ సమావేశంలో ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బొద్దు రాంబాబు,తదితరులు పాల్గొన్నారు.

## రామిలేరు లో కొట్టుకుపోయిన నర్సింగ్ విద్యార్థిని తుక్కులూరు లో ఘోరం



నూజివీడు, సెప్టెంబరు14 ప్రభాతవార్త: నూజివీడు మండలం తుక్కులూరు శివారు రామిలేరు వాగులో కొట్టుకుపోయిన విద్యార్థి బడిపాటి.నీరజ (21) వివరాలు ఇలా వున్నాయి చర్చికి వెళ్లి తిరిగి వస్తూ వాగు దాటుతుండగా కొట్టుకుపోయిన నీరజ.ఈమె నర్సింగ్ పూర్తి చేసినట్లు స్థానికులు తెలిపారు.విద్యార్థి కోసం గాలిస్తున్న గ్రామస్తులు సంఘటనా స్థలానికి చేరుకున్న రూరల్ సీఐ కొప్పిశెట్టి.రామకృష్ణ దర్యాప్తు చేపట్టారు.నీరజ కొట్టుకుపోవటంతో తుక్కులూరు గ్రామంలో కుటుంబసభ్యులు ఆందోళన చెందుతున్నారు.

## యర్రంపల్లి సొసైటీ అధ్యక్షుడిగా చంద్రశేఖర్రెడ్డి ప్రమాణస్వీకారోత్సవం

రైతుల సమస్యల పరిష్కారం కోసం, కేంద్ర నిధుల కోసం తాను కూడా ఢిల్లీ లో నిరంతరం కృషిచేస్తున్నాననిహొఅన్నారు. చంద్రబాబుగారి నాయకత్వంలో రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు చేయడంతోపాటు, అభివృద్ధి పనులలో కూడా దూసుకు వెళుతోందని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ వెల్లడించారు. ఇటువంటి ప్రభుత్వానికి ప్రజలంతా మద్దతుగా నిలిచి వైసీపీ కుట్రలను తిప్పికొట్టాలని కోరారు.హొకొందరు నాయకులు కావాలనే కుట్రపూరితంగా విభేదాలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని, కానీ చింతలపూడి ఎమ్మెల్యే రోషన్ కుమార్, తాను కలిసికట్టుగా ముందుకు వెళుతున్నామని ఎంపీ స్పష్టం చేశారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం నుంచి ఈ ప్రాంతానికి నీరు ఇచ్చే విధంగా తాను ప్రయత్నిస్తానని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ స్థానిక నాయకులకు హామీ ఇచ్చారు. అలాగే స్థానిక నాయకుల కోరిక మేరకు ప్రగడవరం ప్రాంతానికి కమ్యూనిటీ హాల్, కొత్త సిమెంట్ రోడ్లు మంజూరుచేస్తున్నట్లు ఎంపీ సభా వేదికగా ప్రకటించారు. తాగునీటి ఇబ్బందులున్నచోట ప్రతిపాదనలు తయారు చేసి ఇస్తే నిధుల మంజూరుకు కృషి చేస్తామన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో వందలాది లు నష్టాల పాలయ్యాయి, వేలాది కోట్లు దుర్వినియోగమయ్యాయి. సొసైటీలను దోచుకుతిన్నారంటూ ఎంపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల పేరుతో రుణాలు తీసుకుని ఎగ్గొట్టారని, కొత్తగా ఎంపికైన అధ్యక్షులు వాటిని వసూలు చేయటంపై దృష్టిపెట్టాలన్నారు. మన గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుగారు మీపై ఉంచిన నమ్మకాన్ని నిలబెడుతూ, ఈ సహకార పరపతి సంఘాలను లాభాల బాట పట్టించే విధంగా పనిచేయాలని కోరుకుంటున్నానని చెప్పారు ఎంపీ పుట్టా మహేష్ కుమార్. . పామాయిల్ ధర ఈరోజు 19 వేలకు పెరిగిందంటే ప్రధాన కారణం మన ఎంపీ పుట్టా మహేష్ కుమార్ అని, పొగాకు, కోకో రైతుల కోసం కూడా ఎంపీ పోరాడి రైతులకు ఎంతో మేలు జరిగేట్లు చేశారని మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళి, ఇతర నేతలు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ను అభినందనలతో ముంచెత్తారు. ఈ కార్యక్రమంలో ఎంపీ పుట్టా మహేష్ కుమార్, ఎమ్మెల్యేహొ రోషన్ కుమార్, యర్రంపల్లి సొసైటీ మాజీ అధ్యక్షుడు ముత్తారెడ్డి, జనసేన, కూటమి నాయకులు పాల్గొన్నారు. అంతకు ముందు తమ గ్రామానికి వచ్చిన ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కు గ్రామస్థులు ఘనస్వాగతం పలికారు. ప్రధాన రహదారి నుంచి ప్రమాణ స్వీకార కార్యక్రమం ఏర్పాటు చేసిన %ూరాజూ% భవన ప్రాంగణం వరకుహొ 3 కిలోమీటర్ల మేర జరిగిన భారీ ర్యాలీలో చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ తో కలిసి ఎంపీ పుట్టా మహేష్ కుమార్ పాల్గొన్నరు

## విష్ణోత్సవ్ 2కె 25 8వ 'గ్రాడ్యుయేషన్ డే' జరుపుకున్న విష్ణు మహిళా ఇంజినీరింగ్ కళాశాల

భీమవరం ప్రభాతవార్త : భీమవరం శ్రీ విష్ణు ఇంజినీరింగ్ కాలేజ్ ఫర్ ఉమెన్ యొక్క 8వ గ్రాడ్యుయేషన్ డే "విష్ణోత్సవ్ 2కె 25" ను శనివారం కళాశాల దక్షిణ క్యాంపస్ లోని విష్ణు కన్వెన్షన్ సెంటర్ నందు వైభవంగా జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. శ్రీనివాస రావుఆధ్వర్యంలో కార్యక్రమంజరిగింది. 2021-25 బ్యాచ్‌కు చెందిన 670 మంది ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లకు, 2023-25 బ్యాచ్‌కు చెందిన 35 మంది ఎం.టెక్. విద్యార్థులు మరియు 55 మంది ఎం.బి.ఏ. విద్యార్థులకు డిగ్రీ సర్టిఫికేట్‌లను ప్రదానం చేసారు. శ్రీ విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ వైస్-చైర్మన్, ఆర్ రవిచంద్రన్ ముఖ్య అతిథిగా విచ్చేసారు.ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడు తూఉద్యోగ అవకాశాలపై మాత్రమే దృష్టి పెట్టకుండా, విజయవంతమైన వ్యవస్థాపకులుగా ఎదిగేందుకు ఆకాంక్షించాలని వారిని ప్రోత్సహించారు. ప్రపంచం విస్తృత అవకాశాలను అందిస్తున్నందున, వినూత్నంగా ఆలోచించడం "పెట్టె నుండి వెలుపల ఆలోచించండి" అనే విధానాన్ని అవలంబించడం యొక్క ప్రాముఖ్యతను ఆయన నొక్కి చెప్పారు. నేటి పరిశ్రమలు చాలా సరళంగా ఉన్నాయని, కనుక విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకుని, విజయవంతమైన కెరీర్‌ను నిర్మించుకోవడానికి ఇది అనువైన సమయం అని ఆయన నొక్కి చెప్పారు.అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. విద్యార్థులు ఒక మహిళగా జీవితంలోని సవాళ్లను ఎదుర్కోవడానికి ఆనందాన్ని స్వీకరించడానికి స్వీయ ప్రేరణ పొందాలని, విజయవంతమైన వ్యవస్థాపకులుగా మారడానికి స్టార్టప్‌లను ఆచరణీయమైన మార్గంగా పరిగణించాలని ఆయన వారిని ప్రోత్సహించారు.ఈ కార్యక్రమంలో మొత్తం 760 మంది పట్టభద్రులు, అలాగే 2500 కుపైగా తల్లిదండ్రులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయడం జరిగింది.

## ఉచిత కంటి వైద్య శిబిరం.



అత్తిలి -సెప్టెంబర్ 14 (ప్రభాత వార్త) :అత్తిలి లైన్స్ క్లబ్ లో లైన్ మెంబర్, ఏ ఎం సి చైర్మన్ దాసం ప్రసాద్ లయన్స్ క్లబ్ సంయుక్తం గా ఉచిత నేత్ర చికిత్సా శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరం లో 91 మంది కి పరీక్షలు నిర్వహించగా 29 మందికి ఉచితంగా కళ్ళజోళ్ళు ఇచ్చారు. 22మందికి ఉచిత కంటి ఆపరేషన్లకు ఎంపిక చేసారు.. ఈ ఉచిత నేత్ర వైద్య శిబిరం లో ఉలుసు భాస్కరరావు, సంకు బాబురావు తదితరులు పాల్గొన్నారు.

## సమగ్ర యాజమాన్య పద్ధతులతో ఎలుకను నిర్మూలన.



అత్తిలి- సెప్టెంబర్ 14( ప్రభాత వార్త): ఎరుకల నిర్మూలనకు సమగ్ర యాజమాన్యం పద్ధతులు అనుసరించాలని అత్తిలి వ్యవసాయ అధికారి టికే రాజేష్ అన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఎలుకల వల్ల 3.3 కోట్లు ఆహార ధాన్యాలు నష్టం వాటిల్లతోందని,ఒక భారతదేశంలోని 50 లక్షల టన్నుల ఆహార ధాన్యాలు నష్టపోతున్నట్లు తెలిపారు.విత్తనం నాటినప్పటి నుండి పంట దిగుబడి వచ్చేవరకు ఎరుకలు నష్టాన్ని కలుగజేస్తున్నయని అన్నారు. అపరాలకు సైతం 10 నుండి 15 శాతం నష్టం వాటితోందన్నారు. డెల్టా ప్రాంతంలో ఎలుకలు ఉధృతి ఎక్కువగా ఉంటుందని తెలిపారు. యాజమాన్య పద్ధతుల ద్వారా దుక్కి దున్నటం,కడుపునివారణ చేయాలన్నారు. సామూహికంగా ఎలుకల ను నిర్మూలించడానికి బుట్టలతో దమ్ము సమయంలోను పైరు తొలిదశలోనూ అమర్చాలని అన్నారు. పొగ యంత్రాల ద్వారా కూడా ఎలుకలు నిర్మూలించవచ్చన్నారు. సామూహికంగా ఎరుకల నిర్మూలన చేయాలన్నారు. ముందుగా గుర్తించిన కన్నాలలో ఎరకల పని నూనె, నూకలను వాడాలన్నారు. 3 వ రోజు తెరిచి న బొరియలలో 10 గ్రాముల జింక్ ఫాస్ఫేట్ లో 96 పాళ్ళు నూకలు, రెండు పాళ్ల నూనె కలిపిన మందును బొరియాల్లో వేయాలన్నారు. నాలుగవ రోజు చనిపోయిన ఎరుకలను తొలగించి బొరియలను పుద్చాలన్నారు .

## పూర్వ విద్యార్థుల సమ్మేళనం.



అత్తిలి /గణపవరం- సెప్టెంబర్ 14 (ప్రభాతవార్త ):గణపవరం మండలం, జల్లి కొమ్మర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో 2012- 13 ఏడవ తరగతి పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈకార్యక్రమంలో బోధించిన ఉపాధ్యాయులను, పనిచేయుచున్న ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. మండలం ఎస్ టి యు మాజీఅధ్యక్ష ప్రధాన కార్యదర్శులనుకే శ్రీనివాసరావు, ఓ శ్రీనివాసరావును ఘనంగా సన్మానించారు. ప్రధానోపాధ్యాయుడుపిఎస్ ప్రకాష్ అధ్యక్షత వహించారు. ఉపాధ్యాయులు మధుబాబు, ఏ సి హెచ్ రాంబాబు రామకొండ బాబు నరసింహారాజు ,జి రాజు ఓ శ్రీనివాసరావు బి రమేష్, ఎల్ ప్రసాదరావు,కే శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## ఎద్దువాగు వద్ద మరబోటు ఏర్పాటు



వేలేరుపాడు, సెప్టెంబర్ 14, ప్రభాత వార్త : సెప్టెంబర్ నెలలో తుఫానుల ప్రభావంతో ఎగువున కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి పరిసర ప్రాంతాలు లో అదేవిధంగా ఏలూరు జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలకు కొండల నుండి వస్తున్న వరద ప్రవాహంతో వాగులు పొంగటం తో జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి ఆదేశానుసారం ఎస్ పి ప్రతాప్ శివకిషోర్ సూచనలతో వెలేరుపాడు మండలంలో గల ఎడవల్లి వద్ద ఉన్న ఎద్దు వాగు మునిగి 12 గ్రామాలకు రాకపోకలకు అంతరాయము ఏర్పడటంతో డి ఎస్ పి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో రెవెన్యూ శాఖ వారి అధీనంలో ఎద్దువాగు వద్ద ఉన్న కల్వర్ట్ వద్ద మరబోటు ఏర్పాటు చెశారు. ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రర్త చర్యలో భాగంగా ఈ మరబోటు ఏర్పాటు చేయటం జరిగినదని డి ఎస్ పి వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో కుకునూరు సిఐ రమేష్ బాబు, వెలేరుపాడు ఎస్ఐ పి నవీన్ కుమార్ మరియు పోలీస్ సిబ్బంది పాల్గున్నారు.

## జాతీయ పశు వ్యాధి నివారణ కార్యక్రమం

జంగారెడ్డిగూడెం, ప్రభాత వార్త: జాంగారెడ్డిగూడెం ప్రాంతీయ పశువైద్యశాల పరిధిలోని జంగారెడ్డిగూడెం,కొయ్యలగూడెం మండలాల్లో గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు వెయు కార్యక్రమం ఈ నెల 15 నుంచి అక్టోబర్ 15 వరకు 30 రోజులు పాటు జరుగుతుందని స్థానిక ప్రాంతీయ పశు వైద్యశాల సహాయక సంచాలకులు డాక్టర్ పి.ఎస్.వి శేఖర్ దొర శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి గోజాతి, గేదే జాతి పశువులు మూడు నెలలు వయస్సు దాటిన ప్రతి పశువునకు టీకాలు వేయించుకోవాలని ఆయన పశు పోషకులకు తెలిపారు. 7వ విడత జాతీయ గాలి కుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

# ఉనికిలి దేవస్థానం చైర్మన్ కు సత్కారం



. అత్తిలి -సెప్టెంబర్ 14 (ప్రభాతవార్త): ఉనికిలి శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ గా నియమితులైన బొక్కా శ్రీనివాసరావు ని ఏఎంసి వైస్ చైర్మన్ కడలి రామాంజనేయులు. మంచిలి గ్రామం తెలుగుదేశం పార్టీ నాయకుడు శిరగాని నాగేశ్వరరావు (నాగు) ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. శాసన సభ్యుడు ఆరిమిల్లి రాధాకృష్ణ కష్టపడిన కార్యకర్తలను గుర్తించి పదవులు ఇస్తున్నారని చెప్పారు.. ఈ కార్యక్రమంలో ఏఎంసి డైరెక్టర్ కలిగితి దయానందమూర్తి,కడలి రాంబాబు, గుడాల చంద్రం, జక్కం శెట్టి శ్రీనివాసరావు, పెండెం రాంబాబు,ఉండ్రు శివయ్య. మట్టపర్తి శివశంకర్,తదితరులు పాల్గొన్నారు.

## సెప్టెంబర్ 17న స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్



భీమవరం సెప్టెంబర్ 14 ప్రభాతవార్త : మెరుగైన ఆరోగ్య సంరక్షణ సేవల ద్వారా మహిళలు , పిల్లలకు సాధికారత కల్పించే లక్ష్యంతో స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ ను దేశవ్యాప్తంగా 17 సెప్టెంబర్ 2025 ప్రారంభించనున్నారని డీఎంహెచ్ వో గీత భాయ్ తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా మొత్తం 471 ప్రత్యేక ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు, ఈ శిబిరాలలో ప్రత్యేకంగా మహిళలు కు పిల్లలకు విస్తృత వైద్య సేవలను అందిస్తామన్నారు,ప్రసూతి,కంటి పరీక్షలు, ఈ యన్ టి , దంత, చర్మవ్యాధి, మధుమేహం, రక్తపోటు ?, క్యాన్సర్లు, టీబి, ఎనీమియా, సికిల్ సెల్ వ్యాధి స్క్రీనింగ్, గర్భిణీలకు ఆరోగ్య పరీక్షలు, పోషణ సలహాలు,రక్తదాన కార్యక్రమాలు, పౌష్టికాహార అవగాహన, వయో వందన కార్డులు నమోదులు జరుగుతాయన్నారు. ప్రోగ్రాం ఆఫీసర్ కే .ఎం .ఆర్ .కిషోర్ మాట్లాడుతూ ఈ యోజన ప్రధాన ఉద్దేశం దేశవ్యాప్తంగా మహిళలు, పిల్లల ఆరోగ్య సేవలను మరింత బలోపేతం చేయడమే అని సమగ్ర ఆరోగ్య సేవ విధానాన్ని బలోపేతం చేస్తాయి, దేశవ్యాప్తంగా ఆరోగ్యవంతమైన కుటుంబాలు శక్తివంతమైన సమాజాలు నిర్మించాలని లక్ష్యంగా ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

# ప్రపంచ దేశాల్లో హిందీ భాష అగ్రస్థానం

### - 24 మంది హిందీ ఉపాధ్యాయులను సత్కరించిన ఎమ్మెల్యే అంజిబాబు



భీమవరం సెప్టెంబర్ 14 ప్రభాతవార్త : హిందీ భాష నేర్చుకుంటే దేశ నలుమూలల తిరగవచ్చునని, ప్రపంచ దేశాల్లో కూడా హిందీ భాషనే ప్రముఖంగా ఉందని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో హిందీ భాష దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీవిజ్ఞానవేదిక అధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేట్ హైస్కూల్ లోని 24 మంది హిందీ ఉపాధ్యాయులను సత్కరించారు. ఎమ్మెల్యే అంజిబాబు మాట్లాడుతూ దేవనాగరి లిపిలో వ్రాయబడిన హిందీ భాషను రిపబ్లిక్ ఆఫ్ ఇండియా రెండు అధికారిక భాషలలో హిందీ ఒకటి అని, రెండు అధికారికంగా యూనియన్ స్థాయిలో ఉపయోగించబడతాయని, హిందీని నేడు 250 మిలియన్లకు పైగా ప్రజలు మొదటి భాషగా మాట్లాడుతున్నారన్నారు. గత 26 ఏళ్లుగా హిందీ భాషా దినోత్సవాన్ని నిర్వహించడం అభినందనీయమని నిర్వాహకులు రంగ సాయిని అభినందించారు. కార్యక్రమ నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ పట్టణంలోని వివిధ పాఠశాలలోని 24 మంది హిందీ ఉపాధ్యాయులను సత్కరించామని తెలిపారు. కార్యక్రమంలో పొత్తూరి బాపిరాజు, నందమూరి రాజేష్, భట్టిప్రోలు శ్రీనివాసరావు, టివివి ప్రసాద్, వలవల సాయిబాబా, కే మోహిని, ఎస్ సబనా, కామాక్షి, ఎన్ రాధా తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులచే మొక్కలు నాటే కార్యక్రమం




భీమవరం సెప్టెంబర్ 14 ప్రభాతవార్త : శ్రీ ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులు యనమదుర్రు రోడ్డ 40 అడుగుల రోడ్డులో శుచీకరణ కార్యక్రమంమొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎ.అనురాధ, వైస్ ప్రిన్సిపాల్ బి. మావుళ్ళు, ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రాం ఆఫీసర్ సిహ్చ్. వి.వి. బ్రహ్మం, లెక్చరర్ బి. విజయలక్ష్మి పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు.విద్యార్థులు ప్రతి ఒక్కరు సమాజానికి ఉపయోగకరమైన కార్యకలాపాలలో భాగస్వామ్యం కావాలని అధ్యాపకులు పిలుపునిచ్చారు. పచ్చదనం పెంపుదలతో పాటు ప్రజల్లో శుభ్రతపై అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.

### పెదవాగు ప్రాజెక్ట్ వరదలలో కొట్టుకుపోయిన మహిళలు, ఇద్దరు

## గల్లంతు, ఇద్దరు క్షేమం,

జీలుగుమిల్లి, ప్రభాతవార్త: మండలంలోని పూచికపాడులో విషాదం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన పాలడుగుల చెన్నమ్మ (50), పచ్చిశాల వరలక్ష్మి (55) మరో ఇద్దరు మహిళలు తెలంగాణ రాష్ట్రం అశ్వరావుపేట మండలం పెదవాగు ప్రాజెక్టు వరదలో కొట్టుకుపోయారు. వీరిలో చెన్నమ్మ, వరలక్ష్మి గల్లంతు కాగా, మరో ఇద్దరు మహిళలు వరద నుంచి ప్రాణాలతో బయటపడ్డారు. వీరంతా కూలి పనులు కోసం అశ్వరావుపేట మండలం చిన్నాపురం వెళ్లి వెనక్కి వస్తున్న క్రమంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. గల్లంతైన ఇద్దరు మహిళలు కూడా మృతి చెందినట్లు సమాచారం.

## జంగారెడ్డిగూడెంలో జాతీయ లోక్ అదాలత్



జంగారెడ్డిగూడెం,ప్రభాతవార్త: రాష్ట్ర మరియు జిల్లా న్యాయ సేవ అధికారి సంస్థ ఆదేశాల మేరకు శనివారం జంగారెడ్డిగూడెం కోర్టు ప్రాంగణం నందు జాతీయ లోక్ అదాత్ నిర్వహించడం జరిగింది. ఈ జాతీయ లోక్ అదాలత్ నందు ఐపిసి 38 కేసులు,ఎక్సైజ్ 21, చెక్ బౌన్స్ 7 మనోవర్తి 2, బిఎస్ఎన్ ఎల్ 25 కేసులు,మొత్తం 169 కేసులు పరిష్కారం అయ్యాయని మండల న్యాయ సేవ అధికార సంస్థ చైర్మన్ మరియు జూనియర్ సివిల్ జడ్జి సిహెచ్ కిషోర్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బెంచ్ మెంబర్ ఎం.గంగరాజు,బార్ ప్రెసిడెంట్ జివిఎస్ఆర్ మూర్తి,న్యాయ వాదులు,పోలీస్ అధికారులు, కక్షిదారులు పాల్గొన్నారు.

## అగ్నిభాదిత కుటుంబానికి వైఎస్సార్ పార్టీ నాయకుల ఆర్థిక సహాయం



వేలేరుపాడు, ,ప్రభాత వార్త : వేలేరుపాడు మండలం రేపాకగొమ్ము గ్రామంలోని కారం బాయమ్మ ఇల్లు పూర్తిగా దగ్ధం అయిన కారణంగా వారి కుటుంబానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో 7వేల రూపాయల నగదు మరియు వంట సామాగ్రి నిత్యావసర సరుకులు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కొమరాజు రాంబాబు, కురిమెల్ల రమేష్, గేరా చక్రి, ములిశెల్లి రాము, జార్తి బిక్షం, ఆదిలక్ష్మి, కమ్మచిచ్చు వేణు, ఆకుల లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

## గిరి ప్రదక్షణ భక్తులతో పోటెత్తిన పారిజాత గిరి



జంగారెడ్డిగూడెం,ప్రభాతవార్త : గోకుల తిరుమల పారజాతగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో స్వామివారికి ప్రీతికరమైన రోజు శనివారం కావడంతో భక్తులతో పోటెత్తింది. ఈరోజు ఉదయం గిరిప్రదక్షిణకు కంకణ ధారణతో భక్తులు వేల సంఖ్యలో పాల్గొన్నారు. వీరికి ఆలయ కార్య నిర్వహణ అధికారి కలగర శ్రీనివాస్ ఉచిత ప్రత్యేక దర్శనం, అన్న ప్రసాదమును ఏర్పాటు చేశారు. ఈ నెల 15వ తేదీ సోమవారం సాయంత్రం 6 గంటలకు శ్రీ కృష్ణాష్టమి పూజ కార్యక్రమం జరుగుతుందని ఆయన తెలిపారు. 16వ తేదీ మంగళవారం సాయంత్రం 6 గంటలకు అంకురార్పణతో మూడు రోజులు శుక్రవారం వరకు పవిత్రోత్సవ పూజా కార్యక్రమం జరుగుతుందని ఈవో తెలిపారు. ఈరోజు జరిగిన కార్యక్రమాల్లో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు రెడ్డి రంగ ప్రసాద్, అబ్బిన దత్తాత్రేయ, దండు ధనరాజు, వాసవి సాయి గణేష్, ఫణి తదితరులు పాల్గొన్నారు.

## కృత్రి మ మేధ పై వర్క్ షాప్



అత్తిలి (ప్రభాతవార్త ):అత్తిలి ఎస్వీఎస్ఎస్ డిగ్రీ కళాశాలలో కృత్రిమ మేధ పై రెండు రోజులు వర్క్ షాప్ ను డాక్టర్ నెక్కంటి శ్రీనివాస చక్రవర్తి నిర్వహించారు. ప్రస్తుత కాలంలో అన్ని రంగాలలో కృత్రిమ మేధా ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు దాసం గోవిందరావు, కార్యదర్శి మద్దాల వెంకటేశ్వరరావు, జూనియర్, డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్ డి వి రమణ మూర్తి, పమ్మి శ్రీరామ శర్మ, పాలక వర్గ సభ్యుడు కొత్తపల్లి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

# మంచు మనోజ్ అతిథిగా 'దక్ష' మూవీ రిలీజ్ ప్రెస్ మీట్



# తల్లిదండ్రులందరు చూడాల్సిన సినిమా 'బ్యూటీ'

అంకిత్ కొయ్యు, నీలఖి హీరో హీరోయిన్లుగా విజయ్ పాల్ రెడ్డి అడిదల, ఉమేష్ కుమార్ భన్సల్ సంయుక్తంగా నిర్మించిన చిత్రం బ్యూటీ. జీ స్టూడియోస్, మారుతీ టీం ప్రొడక్ట్స్, వానర సెల్యూలాయిడ్ సంయుక్తంగా బ్యూటీమూవీని నిర్మించారు. ఈ సినిమాకు గీతా సుబ్రమణ్యం, హలో వరల్డ్, భలే ఉన్నాడే ఫేమ్ జె.ఎస్.ఎస్. వర్ధన్ మాటలు, దర్శకత్వ బాధ్యతల్ని నిర్వహించారు. ఈ సినిమాకు కథ, స్క్రీన్‌ప్లేని ఆర్.వి. సుబ్రహ్మణ్యం అందించారు. ఈ చిత్రం సెప్టెంబర్ 19న విడుదల కాబోతోంది. ఈ క్రమంలో రిలీజ్ చేసిన టీజర్, ట్రైలర్, పాటలు అన్నీ కూడా అందరినీ ఆకట్టుకున్నాయి. విడుదల తేదీ దగ్గర పడుతున్న క్రమంలో ఆదివారం నాడు ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్టార్ డైరెక్టర్ మారుతి, ఎస్ కే ఎన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలోస్టార్ డైరెక్టర్ మారుతి మాట్లాడుతూ,మా ప్రతీ సినిమా ఆడిందంటే దానికి కారణం ఎస్ కే ఎన్. ఈరోజులో మూవీకి ఎస్ కే ఎన్, శ్రేయాస్ శ్రీనివాస్ సపోర్ట్ చేశారు. ఆ రోజు వాళ్లిద్దరూ లేకుంటే నేను ఈ రోజు ఇక్కడ ఇలా ఉండేవాడ్ని కాదు. సుబ్బు మాకు ఎప్పుడూ క్రైమ్ కథలు చెబుతుండేవారు. కానీ ఓ పాయింట్‌ను సుబ్బు చెప్పాడు. ఆ కథ నాకు నచ్చింది. అంకిత్ మంచి యాక్టర్ అని మరోసారి రుజువు అవుతుంది. ప్రతీ తల్లిదండ్రులు చూడాల్సిన సినిమా. సెప్టెంబర్ నెల బాగా కలిసి వస్తోంది. ప్రస్తుతం 'లిటిల్ హార్ట్స్' బాగా ఆడుతోంది.,'మిరాయ్'హిట్ అయింది సెప్టెంబర్ 19న థియేటర్లోకి రాబోతోంది. అందరూ చూడండి అని అన్నారు.హీరో అంకిత్ కొయ్య మాట్లాడుతూ,వర్ధన్‌కి మారుతి రెండో అవకాశం ఇచ్చారు. సక్సెస్ లేనప్పుడు కూడా మారుతిలాంటి వారు వెన్నంటే ఉండి ప్రోత్సహిస్తుంటారు. నన్ను నమ్మి నాకు ఇంత మంచి సినిమాను ఇచ్చిన మారుతికి థాంక్స్' వచ్చి సినిమా చూడండి.. నచ్చకపోతే సున్నా రేటింగ్ ఇవ్వండి. నచ్చితే మాత్రం ప్రమోట్ చేస్తూ ముందుకు తీసుకెళ్లండి అని అన్నారు. డైరెక్టర్ జె.ఎస్.ఎస్. వర్ధన్ మాట్లాడుతూ.బ్యూటీ సినిమా ప్రతీ ఒక్కరినీ సీటులో కూర్చోబెడుతుంది. నీలఖి చాలా బాగా నటించారు. బ్యూటీ చిత్రం అందరికీ నచ్చుతుంది అని అన్నారు.నిర్మాత విజయ్ పాల్ రెడ్డి అడిదల మాట్లాడుతూ మంచి చిత్రాల్ని నిర్మించాలని ఇండస్ట్రీలోకి వచ్చాను.మా కోసం వచ్చిన మారుతి, ఎస్.కే.ఎన్‌కి థాంక్స్. నరేష్, వాసుకి, అంకిత్ ఇలా అందరూ అద్భుతంగా నటించారు. సెప్టెంబర్ 19న 'బ్యూటీ'చిత్రం రాబోతోంది. అందరూ చూడండి అని అన్నారు.హీరోయిన్ నీలఖి మాట్లాడుతూ,. నాకు బ్యూటీ మొదటి చిత్రం .19న అందరూ తప్పక చూడండిఅనిఅన్నారు.



మంచు లక్ష్మీ ప్రసన్న ప్రధాన పాత్రలో శ్రీలక్ష్మీ ప్రసన్న పిక్చర్స్ అండ్ మంచు ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్లపై రూపుదిద్దుకుంటున్న చిత్రం 'దక్ష' ది డెడ్‌లీ కాన్స్పిరసీ (ఈ సినిమాలో డాక్టర్ మంచు మోహన్ బాబు ఓ కీలక పాత్రలో కనిపించనున్నారు.తండ్రీ కూతుళ్లు కలిసి మొదటి సారిగా ఈ చిత్రంలో నటించడం విశేషం. ఈ చిత్రానికి కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం వంశీ కృష్ణ మల్లా అందించారు. ఈ నెల 19న ఈ సినిమా వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ రోజు ఈ సినిమా రిలీజ్ ప్రెస్ మీట్ ను హైదరాబాద్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాకింగ్ స్టార్ మంచు మనోజ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నటుడు రంగస్థలం మహేశ్ మాట్లాడుతూ 'దక్ష" చిత్రంలో నటించే అవకాశం ఇచ్చిన మంచు లక్ష్మీకి థ్యాంక్స్. ఈ సినిమాలో ఆమెతో కలిసి నటించడం హ్యాపీగా ఉంది. ఈ సినిమా ఆమెకు మరింత మంచి పేరు తీసుకొస్తుందని నమ్ముతున్నానని అన్నారు. డైరెక్టర్ వంశీకృష్ణ మల్లా మాట్లాడుతూ ,"దక్ష" ఒక డిఫరెంట్ థ్రిల్లర్ మూవీ. మీ అందరికీ నచ్చుతుంది. ప్రస్తుతం ఇలాంటి తరహా మూవీస్ నే ప్రేక్షకులు బాగా ఆదరిస్తున్నారు. ఈ చిత్రాన్ని డైరెక్ట్ చేసే అవకాశం ఇచ్చినందుకు లక్ష్మీ అక్కకు థ్యాంక్స్. ఈ సినిమాలో మోహన్ బాబు సహా ఎంతోమంది పెద్దవాళ్లను డైరెక్ట్ చేశాను. వాళ్లు నటనపట్ల అంకితభావం ఉన్నవాళ్లు కాబట్టే అంత పై స్థాయికి వచ్చారు. ఈ నెల 19న మా "దక్ష" మూవీ చూసి సక్సెస్ చేస్తారని కోరుకుంటున్నానని అన్నారు.మంచు లక్ష్మీ మాట్లాడుతూ "దక్ష" కథను నా దగ్గరకు నాన్న తీసుకొచ్చారు. ఆయనే ఈ కథను తీసుకొచ్చారా అనేది మొదట్లో నమ్మలేకపోయాను. ప్రతి చిత్రంతో మనకొక సొంత టీమ్ తయారవుతుంది. మహేశ్, జెమినీ సురేష్ వంటి కో ఆర్టిస్టులతో మాకొక కొత్త టీమ్ ఫార్మ్ అయ్యింది. "దక్ష" సినిమాకు పనిచేసిన ప్రతి ఒక్కరూ ఇది తమ సినిమా అనుకునే నటించారు. మహేశ్ అయితే ప్రమోషన్స్ గురించి ఎలా చేయాలో చెప్పేవాడు. ఈ చిత్రంలో నాన్న ఇమేజ్ కు తగినట్లు పర్ఫెక్ట్ క్యారెక్టర్ ఉంది. అందుకే ఆయనను అడిగాం. సముద్రఖని, సిద్దిక్, విశ్వంత్, చిత్రా శుక్లా..ఇలా పాన్ ఇండియా వైజ్ చూస్తే ప్రతి భాష నుంచి పేరున్న ఆర్టిస్టులు మా చిత్రంలో నటించారు. నాన్న తర్వాత నన్ను అంత బాగా చూసుకునేది మనోజ్. అతను సినిమా చేయనప్పుడు ఇలాంటి మంచి ఆర్టిస్ట్ స్క్రీన్ మీద మళ్లీ ఎప్పుడు కనిపిస్తాడు అని ఒంటరిగా బాధపడ్డాను. మనోజ్ హీరోగానే కాదు విలన్ గానూ మెప్పించగలడు, కామెడీ చేయగలడు. వర్సటైల్ యాక్టర్‌గా ప్రూవ్ చేసుకున్నాడు. "దక్ష" సినిమాకు మనోజ్ ఇచ్చిన సజెషన్స్‌ను తీసుకున్నాను. ఎందుకంటే మనోజ్‌కు ఫిలిం మేకింగ్ మీద, ప్రతి క్రాఫ్ట్ మీద పట్టుంది. నాన్నతో అమితాబ్ పీకూ లాంటి మూవీ చేయాలని ఉంది. నటిగా నా ప్రయాణాన్ని ఆపను. తమిళం, మలయాళంలో కూడా నటించాను. నా దగ్గరకు వచ్చే ప్రాజెక్ట్స్ ముందు నటిగా వచ్చి, ఆ తర్వాత ప్రొడ్యూస్ చేయమని అడుగుతున్నారు. ప్రొడక్షన్ అంత ఈజీ కాదు. మా "దక్ష" చిత్రాన్ని నైజాంలో మైత్రీ మూవీ వాళ్లు డిస్ట్రిబ్యూట్ చేస్తున్నారు. కన్నప్ప, మిరాయ్ తర్వాత వాళ్లకు మా సినిమా హ్యాట్రిక్ అవ్వాలి. అన్నారు. రాకింగ్ స్టార్ మంచు మనోజ్ మాట్లాడుతూ నా మిరాయ్ మూవీని సక్సెస్ చేసినందుకు ప్రేక్షకులకు థ్యాంక్స్. నెక్ట్స్ వీక్ అక్క, నాన్న కలిసి నటించిన "దక్ష" సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ సినిమాను కూడా మీరు పెద్ద సక్సెస్ చేయాలని కోరుకుంటున్నా. ఈ సినిమా కోసం అక్క చాలా కష్టపడింది. "దక్ష" టీమ్ అందరికీ నా బెస్ట్ విశెస్ చెబుతున్నా. ప్రస్తుతం ప్రేక్షకులతో థియేటర్స్ కళకళలాడుతున్నాయి. లిటిల్ హార్ట్స్ హిట్ అయ్యింది, బెల్లంకొండ సాయి కిష్కిందపురి మంచి విజయాన్ని అందుకుంది. అలాగే మా మిరాయ్ ని ప్రేక్షకులు బాగా ఆదరిస్తున్నారు. ఒకే రోజు రెండు చిత్రాలు రిలీజై మంచి విజయం సాధించాయి. అందుకు బెల్లంకొండ సాయిబ్రదర్‌కు కంగ్రాట్స్ చెబుతున్నా. నెక్ట్స్ "దక్ష" రాబోతోంది, ఆ తర్వాత ఓజీ వస్తోంది. ఈ నెల మూవీ లవర్స్‌కు ఫీస్ట్‌లా ఉంటుంది. అన్ని సినిమాలు బాగుంటేనే ఇండస్ట్రీ బాగుంటుంది. మన తెలుగు సినిమా అంతర్జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు పొందాలని కోరుకుంటున్నాని అన్నారు.

# ఘనంగా "లిటిల్ హార్ట్స్" సక్సెస్ సెలబ్రేషన్స్



"లిటిల్ హార్ట్స్"నా ఫేవరేట్ ఫిలిం, డైరెక్టర్ సాయి మార్తాండ్ తో సినిమా చేస్తా హీరో అడివి శేష్ "లిటిల్ హార్ట్స్" విజయం చిన్న చిత్రాలకు కొత్త దారి చూపించింది డైరెక్టర్ మారుతి, మోళి తనూజ్, శివానీ నాగరం జంటగా నటించిన ""లిటిల్ హార్ట్స్" సినిమా ఇటీవల ప్రేక్షకుల ముందుకొచ్చి ఘన విజయాన్ని సొంతం చేసుకుంది. ఈ చిత్రాన్ని ఈటీవీ విన్ ఒరిజినల్ ప్రొడక్షన్ బ్యానర్ పై దర్శకుడు సాయి మార్తాండ్ రూపొందించారు. ఆదిత్య హాసన్ నిర్మాతగా వ్యవహరించారు. ఈ సినిమాను అద్భుతంగా ప్రమోట్ చేసి నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్స్ బన్నీ వాస్ తన బీవీ వర్క్స్, వంశీ నందిపాటి తన వంశీ నందిపాటి ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్స్ పై వరల్డ్ వైడ్ గ్రాండ్‌గా థియేట్రికల్ గా రిలీజ్ చేశారు. ఈ సినిమా సక్సెస్ సెలబ్రేషన్స్ ఈవెంట్ తాజాగా హైదరాబాద్ లో గ్రాండ్‌గా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో హీరో అడివి శేష్, డైరెక్టర్ మారుతి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డైరెక్టర్ రాహుల్ రవీంద్రన్ మాట్లాడుతూ,"లిటిల్ హార్ట్స్" సినిమా చూస్తూ నేనూ మీలాగే పడీ పడీ నవ్వుకున్నాను. ఈ సినిమా కామెడీ ఒక్కటే కాదు మంచి స్క్రిప్ట్ తో రూపొందించారు. మోళి నటనకు ఫ్యాన్ అయ్యాను. మోళి కంపోజ్ చేసిన సాంగ్ కు థియేటర్స్ లో వస్తున్న రెస్పాన్స్ మామూలుగా లేదు. ఈ యంగ్, ఎనర్జిటిక్ టీమ్ మరెన్నో క్లాసిక్ మూవీస్ చేయాలి. అన్నారు.డైరెక్టర్ మారుతి మాట్లాడుతూ, "లిటిల్ హార్ట్స్" సినిమా సక్సెస్ చిన్న చిత్రాలకు మరోసారి దారి చూపించింది. ఒక చిన్న సినిమా హిట్ అయితే వంద సినిమాలు తీసే ధైర్యాన్ని ఇస్తుంది. "లిటిల్ హార్ట్స్" టీమ్‌ను మనస్ఫూర్తిగా అభినందించారు. వారి సక్సెస్ చూస్తుంటే నాకూ హ్యాపీగా ఉందనిఅన్నారు.. డైరెక్టర్ కేవీ అనుదీప్ మాట్లాడుతూ "లిటిల్ హార్ట్స్" సినిమా మనందరినీ బాగా ఎంటర్ టైన్ చేస్తోంది. ఈ సినిమా పెద్ద సక్సెస్ సాధించడం ఆనందంగా ఉంది. మోళి సోషల్ మీడియాను నేను ఫాలో అవుతుంటాను. మోళి టాక్స్‌లో ఫన్ కంటెంట్ ఉంటుంది. ఈ టీమ్ మరిన్ని మంచి చిత్రాలు చేయాలని కోరుకుంటున్నా. అన్నారు. ప్రొడ్యూసర్, డిస్ట్రిబ్యూటర్ బన్నీ వాస్ మాట్లాడుతూ "లిటిల్ హార్ట్స్" సక్సెస్ సెలబ్రేషన్స్‌కు గెస్ట్ లుగా వచ్చి సపోర్ట్ చేసిన అడివి శేష్‌కి, మారుతికి, మిగతా అందరికీ థ్యాంక్స్. ప్రొడ్యూసర్ ఎస్ కేఎన్ మాట్లాడుతూ ఈ సినిమాను థియేటర్ లో చూశాను. ప్రేక్షకులు బాగా ఎంజాయ్ చేస్తున్నారు. మోళి తమ్ముడిని మీమ్స్‌లో చూశాను. ఇప్పుడు సక్సెస్‌ఫుల్ సినిమాటీమ్‌లో చూస్తు నాను.శివానీ, ఇతర కాస్ట్ అంతా బాగా నటించారు. సాయి మార్తాండ్ తను చూసిన లవ్ స్టోరీస్ ఇన్స్పిరేషన్‌తో మంచి స్క్రిప్ట్ చేశాడు. మాబన్నీవాస్, వంశీ నందపాటి ఈచిత్రాన్ని డిస్ట్రిబ్యూట్ చేసి మంచి సక్సెస్ అందుకోవడం హ్యాపీగా ఉంది. ఒక సినిమా సక్సెస్ అయితే ఆ పేరు ఆర్టిస్టులకో, డైరెక్టర్ కో వస్తుంది కానీ ప్రొడ్యూసర్ కు రావడం లేదు."లిటిల్ హార్ట్స్" ఇప్పుడప్పుడే ఓటీటీలోకి రావడం లేదు. మన పవర్ స్టార్ ఓజీ వచ్చేవరకు థియేటర్స్ లో ఈ సినిమా చూస్తూనే ఉండండి. అన్నారు. హీరో అడివిశేష్ మాట్లాడుతూ, నా సినిమా షూటింగ్ కాస్తఎర్లీగా ఫినిష్ చేసి "లిటిల్ హార్ట్స్" మూవీ చూశాను. మీ అందరిలాగే ఎంజాయ్ చేశాను. ఈ సినిమాలో కామెడీతో పాటు ఒక ఇన్నోసెన్స్ ఉంది. కామెడీ పంచ్ వేసినవారు తీసుకున్నవారు ఇద్దరూ హ్యాపీగా ఫీలవుతారు. ఆర్టిస్టులంతా బాగా పర్ ఫార్మ్ చేశారు. శివానీని మోళికి జోడీగా చూశాక ఈ అమ్మాయి వయసులో కాస్త పెద్దగా ఉన్నట్లుంది అనిపించింది. కానీ కాత్యాయని క్యారెక్టర్ కు ఆమెనే ఎందుకు తీసుకున్నారో సినిమా పూర్తిగా చూశాక అర్థమైంది. కాత్యాయనిగా శివానీ బాగానటించింది. డైరెక్టర్‌సాయి మార్తాండ్ రోజుకు 16 గంటలు నెలరోజులకు పైగా ఈ సినిమా కోసం కష్టపడ్డాడు. ఈ సినిమా కోసం ఆయన ఎంత హార్డ్ వర్క్ చేసి ఉంటాడో ఊహించగలను. సినిమా రిలీజ్ అయ్యి సక్సెస్ అయ్యాక ఎంతోమంది ఎన్నో చెబుతుంటారు. కానీ సాయి మార్తాండ్ చాలా హంబుల్ గా ఉన్నాడు. "లిటిల్ హార్ట్స్" సెకండ్ హాఫ్‌లో హార్ట్ టచింగ్ సీన్స్ ఉంటాయి. అది దర్శకుడిగా సాయి మార్తాండ్ క్రాఫ్ట్. ఇతని డైరెక్షన్ లో మూవీ చేయాలని ఉంది. మోళి మరింత పెద్ద స్టార్ కావాలి. బన్నీ వాస్, వంశీ నందిపాటి ఈ చిత్రానికి పర్ఫెక్ట్ రిలీజ్ ఇచ్చారు. అన్నారు.నటీనటులు: మోళి తనూజ్, శివానీనాగరం, రాజీవ్ కనకాల, ఎస్ ఎస్ కాంచి, అనిత చౌదరి, సత్య కృష్ణన్, తదితరులు.

# ఇలాంటి పొలిటికల్ థ్రిల్లర్ ఇప్పటివరకూ రాలేదు




హీరో విజయ్ ఆంటోనీ 'మార్గన్' విజయం తర్వాత మరో పవర్ ఫుల్ ప్రాజెక్ట్ 'భద్రకాళి'తో వస్తున్నారు. విజయ్ ఆంటోనీకి ల్యాండ్‌మార్క్ మూవీగా నిలిచే ఈ చిత్రానికి అరుణ్ ప్రభు దర్శకత్వం వహించగా, సర్వంత్ రామ్ క్రియేషన్స్ బ్యానర్‌పై రామాంజనేయులు జవ్వాజీ నిర్మించారు. ఈ ప్రాజెక్ట్‌ను విజయ్ ఆంటోనీ ఫిల్మ్ కార్పొరేషన్, మీరా విజయ్ ఆంటోనీ సమర్పిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కనెక్ట్‌కి మంచి రెస్పాన్స్ వచ్చింది. 'భద్రకాళి' సెప్టెంబర్ 19న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా నిర్మాత రామాంజనేయులు జవ్వాజీ విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.

**భద్రకాళి ఎలా మొదలైంది?**

డైరెక్టర్ అరుణ్ ప్రభు కథ చెప్పారు. చాలా బాగుంది. భద్రకాళి సినిమాకి అరుణ్ బాబు ఒక బ్యాక్ బోన్. ఈ సినిమాలో మంచి ఎంటర్టైన్మెంట్‌తో పాటు ప్రేక్షకులను ఆలోచింపచేసే అంశాలు కూడా ఉన్నాయి.

**ట్రైలర్ చూస్తే ఇదొక పొలిటికల్ థ్రిల్లర్ అనిపిస్తుంది? కథ ఎంత డిఫరెంట్‌గాఉంటుంది?**

పొలిటికల్ బ్యాక్ డ్రాప్ లో చాలా సినిమాలు వచ్చాయి కానీ ఈ సినిమాలో హీరోచేసిన క్యారెక్టర్ తో ఇప్పటివరకు ఎలాంటి సినిమా రాలేదు. చాలా డిఫరెంట్ క్యారెక్టర్. ఇలాంటి హీరో క్యారెక్టర్ తో ఇప్పటివరకు సినిమా రాలేదు. సినిమాలో చాలా మంచి స్ట్రాంగ్ ఎలిమెంట్స్ ఉన్నాయి. ఆడియన్స్ కి డెఫినెట్గా కనెక్ట్ అవుతాయి.

**భద్రకాళిలో హైలెట్స్‌గా ఉండే ఎలిమెంట్స్ ఏమిటి?**

చాలా గ్రిప్ ఉన్న స్టోరీ ఇది. ఇందులో ప్రతి సీన్ ఆడియన్స్ ని హత్తుకుంటుంది.

**వరుసగా సినిమాలు చేయడానికి మార్గన్ విజయం మీకు జోష్ ఇచ్చిందా?**

మార్గాన్‌కి ముందు దాదాపు 11 సినిమాలు చేశాను. తమిళ్లో చాలా పెద్ద లెవెల్లో డిస్ట్రిబ్యూషన్ చేశాం.

**తెలుగులో చేస్తున్న సినిమాలు ఉన్నాయా?**

తెలుగులో సత్యదేవ్‌తో ఫుల్ బాటిల్ అనే సినిమా చేస్తున్నాం. అది కంప్లీట్ అయి రెడీగా ఉంది. నవంబర్లో రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నాం.

ఆల్ ది బెస్ట్

థాంక్ యూ.



గోపాలకృష్ణ దర్శకత్వంలో మురళీమోహన్ జయసుధ జంటగా నటించిన "లక్ష్మణ రేఖ" చిత్రం విడుదలై 50 ఏళ్ళు పూర్తి చేసుకున్న సందర్భంగా గోల్డెన్ జూబ్లీ వేడుక నిర్వహించారు. చిత్ర దర్శకుడు గోపాలకృష్ణ, మురళీమోహన్, జయసుధలతోపాటు ఈ చిత్రానికికో డైరెక్టర్‌గా పని చేసిన రాజేంద్రప్రసాద్‌లను ఆత్మీయంగా సన్మానించారు. ఈ సందర్భంగా వీరంతా 50 ఏళ్ళు వెనక్కి వెళ్ళి, అప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. క్రమశిక్షణ, అంకితభావాలను లక్ష్మణరేఖలుగా మలచుకుని ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. కార్యక్రమ నిర్వాహకులు రామ సత్య నారాయణను అభినందించారు. సీనియర్ ఫిల్మ్ జర్నలిస్ట్ ప్రభు వ్యాఖ్యాతగా వ్యవహరించిన ఈ వేడుకలో సీనియర్ దర్శకులు ధవళ సత్యం, పి.ఎన్. రామచంద్రరావు, తెలుగు నిర్మాతల మండలి ప్రధాన కార్యదర్శి తుమ్మల ప్రసన్నకుమార్, ప్రముఖ నిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణ, దర్శకుల సంఘం అధ్యక్షుడు వీరశంకర్, ఫిలిం నగర్‌కోపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు కాజా సూర్యనారాయణ, సీనియర్ ఫిల్మ్ జర్నలిస్టులు సురేష్‌కొండేటి, ధీరజ అప్పాజీ పాల్గొన్నారు.

# 'లక్ష్మణరేఖ' గోల్డెన్ జూబిలీ వేడుకలో మురళీమోహన్,జయసుధ

# పేరెంట్స్ అన్ని విషయాల్ని పంచుకునేలా పిల్లలకు స్వేచ్ఛను ఇవ్వాలి:సాయి దుర్గాతేజ్

ప్రపంచ వ్యాప్తంగా 70 నగరాలు, వేల మంది యంగ్ ప్రొఫెషనల్స్ కలిసి కాన్ఫిడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సిఐఐ)లో భాగంగా యంగ్ ఇండియన్స్ ఆధ్వర్యంలో పిల్లలపై లైంగిక దాడికి వ్యతిరేక నినాదంతో అభయమ్ మసూమ్ సమ్మిట్ ఈవెంట్ హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. భారత్ రైజింగ్, యంగ్ ఇండియన్స్, కాన్ఫిడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి సుప్రీమ్ హీరో సాయి దుర్గతేజ్, మంత్రి సీతక్క, యంగ్ ఇండియన్స్ కో ఛైర్మన్ భవిన్ పాండ్య, యంగ్ ఇండియన్స్ నేషనల్ ఛైర్మన్ తరంగ్ ఖురానా, సీఐఐ తెలంగాణ ఛైర్మన్ శివ ప్రసాద్ రెడ్డి, జోత్స్న సింగ్ వంటివారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.సుప్రీమ్ హీరో సాయి దుర్గ తేజ్ మాట్లాడుతూ,మన పిల్లల్ని మనమే కాపాడుకోవాలి. సోషల్ మీడియాలో పిల్లల మీద అబ్యూజ్ చేస్తున్నారు. అలాంటి కామెంట్లు చేస్తే కూడా లైక్స్ చేస్తున్నారు నవ్వుతున్నారు..



అవన్నీ చూస్తే నాకు చాలా బాధగా అనిపిస్తుంది. మనం ఇలాంటి సమాజాన్ని కోరుకుంటున్నామా? చిన్న పిల్లల మీద అలాంటి పిచ్చి కామెంట్లు చేయడం ఏంటి? నేను ఆ టాపిక్ మీద ఎవరైనా మాట్లాడతారా? మీడియా స్పందిస్తుందా? అని చూశాను. కానీ ఎవ్వరూ రియాక్ట్ అవ్వలేదు. ఇక ఆ బాధ్యతను నేను తీసుకున్నాను. అందుకే నేను ఆ సమయంలో అలా రియాక్ట్ అయ్యాను. డార్క్ కామెడీ అంటూ పిచ్చి పిచ్చి కామెంట్లు చేస్తున్నారు. వాక్ స్వాతంత్రం ఉంది.. కానీ ఎదుటి వాళ్లని బాధ పెట్టే వరకు ఉండకూడదు. 2015లో థింక్ పీస్ అనే సంస్థతో పని చేశాను. అరకులో చైల్డ్ ఎడ్యుకేషన్ గురించి పోరాడాను. నేను అక్కడ స్కూల్ నిర్మించాను. తెలంగాణలో నేను కొంత మంది పిల్లల్ని కూడా దత్తత తీసుకున్నాను. పిల్లల చదువు, పోషణ ఇలా అన్నింటినీ చూసుకుంటాను. ఇప్పుడు పిల్లలతో తల్లిదండ్రులు ఎక్కువ సమయాన్ని గడపడం లేదు. ఇప్పుడంటే చాట్ జీటీపీ, ఏఐ అంటున్నారు. కానీ నాకు మాత్రం మా అమ్మే ప్రపంచం. అమ్మ, మామయ్యలు, స్నేహితులు ఇలా అందరితో నేను సమయాన్ని ఎక్కువగా గడిపేవాడ్ని. పిల్లలతో పేరెంట్స్ ఎక్కువగా ఇంటరాక్ట్ అవ్వాలి. నేను నా సెకండ్ క్లాస్‌లోని లవ్ స్టోరీని మా అమ్మతో చెప్పాను. అలా చెప్పే స్వతంత్రాన్ని నాకు ఆమె ఇచ్చారు. పేరెంట్స్‌తో అన్ని విషయాల్ని పంచుకునేలా పిల్లలకు స్వేచ్ఛను ఇవ్వాలి. పిల్లలకు ప్రతీ విషయాన్ని ప్రేమతో చెప్పే ప్రయత్నం చేయాలి. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ విషయాల్ని స్కూల్లో టీచర్స్, ఇంట్లో పేరెంట్స్ చెప్పే ప్రయత్నం చేయాలి.

# 'డొక్కా సీతమ్మ' మూవీ నిర్మాతపై చర్యలు తీసుకుంటాం : వీఎన్ఆర్ఫిలింస్



"అపర అన్నపూర్ణ డొక్కా సీతమ్మ" బయోపిక్ టైటిల్ హక్కులు మాకే సొంతం,"అపర అన్నపూర్ణ డొక్కా సీతమ్మ" మూవీ నిర్మాతపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటాం వీఎన్ఆర్ ఫిలింస్

అపర అన్నపూర్ణ డొక్కా సీతమ్మ బయోపిక్ టైటిల్ తో వీఎన్ఆర్ ఫిలింస్ సంస్థ సినిమాను నిర్మిస్తోంది. ఈ సినిమా త్వరలో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించుకోనుంది. ప్రస్తుతం నటీనటులు, సాంకేతిక నిపుణుల ఎంపిక జరుగుతోంది. అపర అన్నపూర్ణ డొక్కా సీతమ్మ బయోపిక్ చిత్రానికి ఎ.ఆర్.బి. నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. అచ్చుర్త రాజుబాబు దర్శకత్వం వహిస్తున్నారు. అపర అన్నపూర్ణ డొక్కా సీతమ్మ బయోపిక్ టైటిల్ హక్కులు తమకే సొంతమని, ఈ టైటిల్ ను ఫిలింఛాంబర్ లో రిజిస్టర్ చేయించామని వీఎన్ఆర్ ఫిలింస్ వెల్లడించింది. అయితే ఎలాంటి టైటిల్ రిజిస్ట్రేషన్ లేకుండా ఆంధ్రుల అన్నపూర్ణ డొక్కా సీతమ్మ టైటిల్ తో ఉషారాణి మూవీస్ బ్యానర్ లో వల్లూరి రాంబాబు నిర్మాతగా, రవి నారాయణ్ దర్శకుడిగా సినిమా రూపొందిస్తున్నారు. ..ఈ విషయంపై వీఎన్ఆర్ ఫిలింస్ స్పందిస్తూ "అపర అన్నపూర్ణ డొక్కా సీతమ్మ" బయోపిక్ టైటిల్ ను మేము ఫిలింఛాంబర్ లో రిజిస్టర్ చేయించాం. అయితే ఆంధ్రుల అన్నపూర్ణ డొక్కా సీతమ్మ టైటిల్ తో ఉషారాణి మూవీస్ సినిమా రూపొందిస్తోంది. ఈ చిత్ర దర్శకుడు రవి నారాయణ్ మమ్మల్ని గతేడాది టైటిల్ ఇవ్వమని అడిగారు. మేము సినిమా చేస్తున్నాం కాబట్టి టైటిల్ ఇవ్వడం కుదరదు అని తేల్చిచెప్పాం. అయినా కూడా మా అనుమతి లేకుండానే ఆంధ్రుల అన్నపూర్ణ డొక్కా సీతమ్మ టైటిల్‌తో సినిమా షూటింగ్ చేస్తున్నారు. మాకు చెందిన టైటిల్ తో మరే దర్శక నిర్మాత సినిమా రూపొందించినా చట్టపరంగా క్రిమినల్ చర్యలు తీసుకుంటాం. ఉషారాణి మూవీస్ పై చర్యలకు ఉపక్రమిస్తున్నాం. అని తెలిపింది.

# తడి జుట్టుతో నిద్రపోతే !



కొందరు రాత్రి పూట తలస్నానం చేసి, జుట్టు తడిగా ఉండగానే నిద్రపోతుంటారు. అయితే దీనివల్ల సౌందర్యపరంగా పలు సమస్యలు తప్పవంటున్నారు నిపుణులు. ఇలా జరగక్కూడదంటే కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం ముఖ్యమంటున్నారు.

★ వీలు కుదుర్చుకొని ఉదయాన్నే తలస్నానం చేయడం మంచిది. తద్వారా రాత్రి పడుకునే సమయానికి కేశాలు సహజసిద్ధంగా ఆరిపోతాయి. కాబట్టి హెయిర్ డ్రయర్స్ ఉపయోగించే అవసరం ఉండదు. తద్వారా జుట్టు డ్యామేజ్ కాకుండానూ కాపాడుకోవచ్చు.

★. తలస్నానం చేశాక కాటన్ టీ-షర్ట్ లేదంటే కాటన్ టవల్‌తో జుట్టును పొడిగా తుడుచుకోవాలి. కాటన్ వస్త్రం వెంట్రుకల్లోని తేమను సులభంగా పీల్చేసుకుటుంది తద్వారా జుట్టు త్వరగా ఆరిపోతుంది.

★ వెంట్రుకలు దృఢత్వాన్ని కోల్పోకూడదంటే తలస్నానం చేశాక కండిషనర్ రాసుకోవడం మర్చిపోవద్దు.

★ ఒక వేళ తప్పనిసనరి పరిస్థితుల్లో పడుకునే ముందే తలస్నానం చేయాల్సి వస్తే సిల్క్ దిండు కవర్‌ను ఉపయోగించమంటున్నారు నిపుణులు. తద్వారా దిండుకు, వెంట్రుకలకు మధ్య రాపిడి తక్కువగా జరిగి జుట్టు డ్యామేజ్ కాకుండా కొంతవరకు రక్షించుకోవచ్చంటున్నారు.



★. రాత్రుళ్లు జుట్టు ఆరబెట్టుకునే సమయం లేని వారు తక్కువ వేడితో బ్లో-డ్రయర్స్ ఉపయోగించి వెంట్రుకల్ని ఆరబెట్టుకుంటే జుట్టు మరీ ఎక్కువగా డ్యామేజ్ కాకుండా జాగ్రత్తపడచ్చంటున్నారు.

★ తడి జుట్టుకు కొబ్బరి నూనె రక్షణ కవచంలా పనిచేస్తుందని కొన్ని అధ్యయనాల్లో రుజువైంది. అందుకే తప్పని పరిస్థితుల్లో తడి జుట్టుతోనే నిద్రపోవాలనుకునే వారు కొన్ని చుక్కల కొబ్బరి నూనెను జుట్టు చివర్లకు రాసుకుంటే సరి.

★ దిండు కవర్లను ఎపనపటికప్పుడు మారనచడం వల్ల కూడా వాటిపై చేరిన బ్యాక్టీరియా, ఫంగస్‌ల నుంచి కుదుళ్లను, ముఖ చర్మాన్ని కాపాడుకోవచ్చు. ◻

# ప్లాస్టిక్ నియంత్రణ కోసం..

ప్లాస్టిక్... పర్యావరణానికి నష్టం కలచివేసిందామెను. తనవంతు ప్రయత్నంగా ఏదో ఒకటి చేయాలనుకుంది. ప్లాస్టిక్ బ్యాగులు, కవర్ల స్థానంలో చీరలతో చేతి బ్యాగులు ఉచితంగా అందించారు అనంతపురానికి చెందిన గుగ్గెళ్ల మధురిమ. ఆ వివరాలు తెలుసుకుందాం...


మధురిమ

మదనపల్లిలో నేను పుట్టింది. నాన్న చంద్రారెడ్డి బ్యాంకు ఉద్యోగి, అమ్మ సావిత్రమ్మ గృహిణి. ఎంఎస్సీ బీడీ పూర్తి చేసి 1998లో డీఎస్సీలో సెకండరీ టీచర్‌గా ఎంపికై ఓ పల్లెటూర్లో ఏడాదికి పైగా ఉద్యోగం చేశాను. ఈ విధంగానే రోడ్లపై, మురుగు కాలువల్లోని ప్లాస్టిక్ వ్యర్థాలు తిని పశువులు మృత్యువాత పడటం గమనించా, బాధగానూ, భయంగానూ అనిపించేది. అప్పుడే ఏదైనా చేయాలని నిర్ణయించుకున్నా. అయితే మరుసటి ఏడాదే పెళ్లై అనంతపురం వచ్చా. ఉద్యోగానికి రాజీనామా... ఆపై పిల్లలు. ఇలా ఇరవై ఏళ్లు ఇంటికే పరిమితమయ్యా. అయితే, 2022లో కుటుంబంతో కలిసి బ్యాంకాక్ వెళ్లా. అక్కడ అన్నింటిలోనూ వస్త్ర సంచులు ఉపయోగించడం చూశారు. అది నన్ను ఆకట్టుకుంది. మనదగ్గర వస్త్ర సంచులు



వినియోగిస్తే బావుంటుంది అనిపించింది. నా ఆలోచనను మా ఆయనతో పంచుకుంటే ప్రోత్సహించారు. తమిళనాడులోని కోయంబత్తూరులో క్లాత్ కొని, అక్కడే కుట్టించాం. అనంతపురంలోని పాతూరు కూరగాయల మార్కెట్, తోపుడుబండ్లు, హోటళ్ల వద్ద పంపిణీ చేశాం. ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. దీనితో మరుసటి సంవత్సరం (2024) లక్షా పదివేల బ్యాగులు పంపిణీ చేశాం. ఖర్చుతో కూడుకున్నదే అయినా ప్రజలకు అలవాటు చేస్తే మార్పు వస్తుందనుకున్నాం. అయితే సంచులను కుట్టంచి నగరానికి రవాణా చేయడం కష్టంగా అనిపించింది. అప్పుడే నాకు మెరుపులాంటి ఆలోచన తట్టింది. ఆ చేతి సంచులను చీరలతో తయారు చేయించాలని. అందులో స్థానికంగా కుట్టిస్తే మనవాళ్లకు ఉపాధి కూడా కల్పించవచ్చు అనుకున్నా. నగరంలో ఇళ్లలో ఉండి టైలరింగ్ పనులు చేసే వారిని గుర్తించా. చీరల సేకరణ మా ఇంటి నుంచే మొదలు పెట్టా. నాతో పాటు అత్త, అమ్మ, నా కూతురికి చెందిన సుమారు వంద పట్టుచీరల దాకా ఇచ్చేశాం. పది మంది టైలర్లు ఆ చీరలను బ్యాగుగా కుట్టారు. సుమారు వెయ్యి పట్టు చీరలతో కుట్టిన బ్యాగులు తయారయ్యాయి. వాటిని పంపిణీ చేసినపుడు ప్రజలు చాలా సానుకూలంగా స్పందించారు. దీనితో చీర బ్యాగులనే పంపిణి చేయాలని డిసైడ్ అయ్యాం. హైదరాబాద్, బెంగళూరులో అన్ని రకాల చీరలను కొనుగోలు చేసి డ్రైక్లీనింగ్ చేయించి టైలర్లకు ఇస్తున్నాం. ఐదున్నర మీటర్ల చీరలో పది సంచులు తయారవుతాయి. ఒక్కో సంచి కుట్టినందుకు రూ.పది కూలీగా ఇస్తున్నా. మొదట్లో పది టైలర్లతో ప్రారంభిస్తే... ప్రస్తుతం నూట యాభైమంది మహిళలు ఉపాధి పొందుతున్న ప్రయత్నం తెలిసి కొందరు మహిళలు స్వచ్ఛందంగా వారి చీరలను తెచ్చి ఇస్తున్నారు. పొద్దున్నే రోజులకోసారి సమకూరిన సంచులను చిరు వ్యాపారులు, హోటళ్లు, తోపుడు వారికి, ప్రజలకు పంచుతున్నాం. 'ప్లాస్టిక్ రహిత అనంతపురం' లో నా వంతు కృషి చేస్తే ఆనందంగా ఉంది. ◻

# ఈ మిఠాయి చాలా బలం

కాలం
ఏదైనా వార్డ్‌రోబ్‌లను ఎప్పుడూ మూసే ఉంచినా, వాతావరణంలో కాస్త తేమ ఎక్కువైనా.. వాసన వస్తాయి. ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా చెదలూ, పురుగులూ ఇబ్బంది. పెడతాయి. ఇలాంటప్పుడు దుస్తులు పాడవకుండా సమస్య దూరవ్వాలంటే..

◆. బీరువాలో దుస్తుల్ని నెలల తరబడి మడత తీయకుండా



వదిలేయకండి. అప్పుడప్పుడూ ఎండలో ఆరేయాలి. మడతల్లో చిన్న దేవదారు ముక్కల్ని ఉంచాలి. లేదంటే పచ్చ కర్పూరాన్ని వస్త్రంలో చుట్టి పెట్టొచ్చు. ఈ వాసన చెద పురుగులకు నచ్చదు.

◆. వార్డ్‌రోబ్‌లో ఏమైనా క్రాక్స్, గ్యాప్స్ ఉంటే వాటిని సీల్ చేయండి. దుమ్మూ, ధూళిని ఎప్పటికప్పుడు వాక్యూమ్ చేస్తే సరి.

◆ వే ఆకులు లవంగాలు.. ఇవి అన్నీ చెదల నివారణకు సాయపడతాయి. వాటి దుర్వాసనతో పాటూ తేమ కూడా పోవాలంటే.. లవంగాల పొడి, బొగ్గు, బేకింగ్ సోడా లోపల ఉంచండి.

◆. చెమట, నూనె, ఆహార మరకలు ఉన్న దుస్తులను పూర్తిగా శుభ్రం చేశాకే బీరువాట పెట్టండి. లేదటే ఇవి సిల్వర్‌ఫిష్, ఇతర పురుగులను ఆకర్షస్తాయి. అలానే బీరువాల్లో కార్డ్‌బోర్డు బాక్సులను నిల్వ చేయొద్దు.

◆ ఎప్పుడో ఒకసారి ధరించే దుస్తుల్ని వాక్యూమ్ సీల్డ్ చేసి బ్యాగుల్లో పెట్టండి. దుస్తుల వరుసల మధ్య ఖాళీ ఉండనివ్వండి. పిప్పర్‌మెంట్, యూకలిప్టస్ వంటి ఎసెన్షియల్ ఆయిల్స్‌లో ముంచి తీసిన కాటన్ బాల్స్‌ని లోపల పెడితేపురుగులు రావు. ◻

మడతల్లో చిన్న దేవదారు ముక్కల్ని ఉంచాలి. లేదంటే పచ్చ కర్పూరాన్ని వస్త్రంలో చుట్టి పెట్టొచ్చు. ఈ వాసన చెద పురుగులకు నచ్చదు.

★. వార్డ్‌రోబ్‌లో ఏమైనా క్రాక్స్, గ్యాప్స్ ఉంటే వాటిని సీల్ చేయండి. దుమ్మూ, ధూళిని ఎప్పటికప్పుడు వాక్యూమ్ చేస్తే సరి. 3. వేప ఆకులు లవంగాలు.. ఇవి అన్నీ చెదల నివారణకు సాయపడతాయి. వాటి దుర్వాసనతో పాటూ తేమ కూడా

కాలం ఏదైనా వార్డ్‌రోబ్‌లను ఎప్పుడూ మూసే

# బీరువాలో చెద, వాసన రాకుండా!

ఉంచినా, వాతావరణంలో కాస్త తేమ ఎక్కువైనా.. వాసన వస్తాయి. ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా చెదలూ, పురుగులూ ఇబ్బంది. పెడతాయి.

ఇలాంటప్పుడు దుస్తులు పాడవకుండా సమస్య దూరవ్వాలంటే..

★ బీరువాలో దుస్తుల్ని నెలల తరబడి మడత తీయకుండా వదిలేయకండి. అప్పుడప్పుడూ ఎండలో ఆరేయాలి.



పోవాలంటే.. లవంగాల పొడి, బొగ్గు, బేకింగ్ సోడా లోపల ఉంచండి.

★ చెమట, నూనె, ఆహార మరకలు ఉన్న దుస్తులను పూర్తిగా శుభ్రం చేశాకే బీరువాట పెట్టండి. లేదటే ఇవి సిల్వర్‌ఫిష్, ఇతర పురుగులను ఆకర్షస్తాయి. అలానే బీరువాల్లో కార్డ్‌బోర్డు బాక్సులను నిల్వ చేయొద్దు.

★ ఎప్పుడో ఒకసారి ధరించే దుస్తుల్ని వాక్యూమ్ సీల్డ్ చేసి బ్యాగుల్లో పెట్టండి. దుస్తుల వరుసల మధ్య ఖాళీ ఉండనివ్వండి. పిప్పర్‌మెంట్,

# బన్నుతో ఎన్ని ఆకృతులో !






బన్నును చూస్తే మనకు తినబుద్ధి కాదు. కొందరికైతే శిక్షలా కూడా ఉంటుంది. కానీ బన్ను పిండితో ఇలా రకరకాల ఆకృతుల్లో అందంగా తయారుచేసి. ఎంచక్కా బేక్ చేస్తే.. చెప్పేదేముంది? నోరూరడం ఖాయం. ఎంత ముచ్చట గొలిపేలా ఉన్నాయి కదూ ! ఇంత అందంగా చేసిన వాళ్లకు బిగ్ సలాం.






# నాణ్యత పసికట్టేస్తుంది..

వర్షాకాలంలో.. **ఆకుకూరలు, కాయగూరలు, చేపలు, మాంసాహారంపై** బ్యాక్టీరియా ఎక్కువగా వృద్ధి చెందుతూ ఉంటుంది. అందుకే ఫ్రిజ్‌లోంచి తీసిన వెంటనే లేదా బజారు నుంచి తెచ్చిన వెంటనే వండేయడానికి సిద్ధపడిపోకుండా కాస్త వాటి నాణ్యతను ఆరాతీయండి. అదెలా అంటారా? ఇందుకోసం డిజిటల్ ఫుడ్ టెస్టర్లు మార్కెట్లో అందుబాటులో ఉన్నాయి. మాంసం, పండ్లు, కాయగూరలని ఈ టెస్టర్‌తో గుచ్చి చూస్తే చాలు.



ఇందులో మెతాదుకు మించి క్రిమిసంహారాల వాడకం ఉంటే ఆ విషయాన్ని తెరపై చూపిస్తుంది. అలాగే నీళ్ల పరిశుభ్రతనూ చిటికెలో చెప్పేస్తుంది. ఇవేకాదు బ్యాక్టీరియా వంటివి ఉంటే వాటినీ

# దోసకాయంత బంగారం

**దోసకాయంత బంగారం** రావణ సంహారం తర్వాత శ్రీరామచంద్రుడు సపరివారంగా అయోధ్య చేరాడు. రాజ్య నిర్వహణకు ప్రజలకు ఉపయుక్తమయ్యే పలు కార్యక్రమాల రూపకల్పనకు తగినంత ధనం కోశాగారంలో లేదని గమనించాడు. అందువల్ల ప్రజల సహకారాన్ని ఆశిస్తూ రాజ్యంలో ప్రతి పౌరుడూ తన వంతు బాధ్యతగా దోసకాయంత బంగారాన్ని చెల్లించాల్సి ఉంటుంది అని దండోరా వేయించాడు. మర్నాడు ఉదయం ఒక విశాలమైన ఆవరణలో త్రాసు ఏర్పాటు చేశారు. ఒక పళ్లెంలో బంగారపు ముద్దలు మెరుస్తున్న పసుపు పచ్చని దోసకాయ ఉంది. అందరూ బంగారంతో వచ్చారు. కొందరు పళ్లెంలో ఎంత బంగారం వేసినా త్రాసు కదలడంలేదు. కానీ కొందరు బంగారు నాణేలు వేయగానే దోసకాయతో సరి తూగుతున్నాయి. ఇదేం చోద్యమని విస్తుపోయి చూస్తున్నారు జనం. వారి సందేహం తీర్చేందుకు లక్ష్మణుడు ముందు కొచ్చి తూకం ప్రారంభించే ముందు ఆంజనేయుడు, ధర్మదేవతను ప్రార్థించాం. రాజ్యంలో నెలకొన్న ధర్మానికి ఈ త్రాసే నిదర్శనం. ఎవరెవరు ధర్మపరులో, ఎవరు కాదో మన కళ్లముందు సాక్షాత్కరింప చేస్తోంది ధర్మతూకం అన్నాడు.

ఆధ్యాత్మికం

# 'నైట్ రొటీన్' మీ ఇంట్లో ఉందా?

**'అప్పుడే నిద్ర రావట్లేద్దు,'** ఈ ఒక్క కార్టూన్ చూసి పడుకుంటా... నిద్రపొమ్మని చెప్పడం అలస్యం ఇలాంటి కారణాలెన్నో చిన్నారుల నోట్లోంచి దూసుకొస్తాయి. ఫోన్, టీవీలు, చదువుల ఒత్తిడి పిల్లల్లో నిద్రను త్వరగా దరిచేరనీయవు. అలాగని ఊరుకుంటే నిద్రలేమికి గురవడంతోపాటు ఎన్నో సమస్యలు కొని తెచ్చుకుంటారు. అలా అవొద్దంటే 'నైట్ రొటీన్' తప్పనిసరి అంటారు నిపుణులు. రోజూ ఒక నిర్ణీత సమయానికి పడుకునేలా అలవాటు చేయడమే ఈ నైట్ రొటీన్. ఒకరకంగా ఇది విశ్రాంతి సమయమని శరీరం దానంతట అది గుర్తించేలా చేయడమన్నమాట. పిల్లల గది నిశ్శబ్దంగా, చల్లగా అందంగా చీకటిగా ఉండేలా చూసుకోండి. మంచమూ మెత్తగా, ప్రభావం ఉండాలి. రోజూ నిర్ణీత సమయానికి పడకగదిలోకి వెళ్లేలా చూడాలి. చిన్న చిన్న స్ట్రెచ్‌లు చేయించుకోవాలి. అప్పుడు ఫిజికల్ టెన్షన్ తగ్గుతుంది. అయితే అది 5 నిమిషాలకు మించకూడదు. మరో అయిదు నిమిషాలు శ్వాస సంబంధిత వ్యాయామాలు చేస్తే మనసు నెమ్మదిస్తుంది.



పుస్తకం చదివి వినిపించొచ్చు. దీన్నో రొటీన్‌లా చేయాలి. ఇవి ఆ రోజు నిద్రపోవడానికే కాదు, భవిష్యత్తులో వాళ్లు మానసికంగా ఆరోగ్యంగా ఎదగడానికీ సాయపడతాయి. పిల్లల్లో స్వీయ నియంత్రణ అలవడుతుంది. ఒత్తిడి త్వరగా దరిచేరదు. భావోద్వేగాలపైనా పట్టు సాధిస్తారు. దీంతో వాళ్లలో త్వరగా ఆందోళన కూడా దరిచేరదట. దీనిమీద ఎన్నో పరిశోధనలూ జరిగాయి. ఎంత త్వరగా 'బెడ్ టైమ్ రొటీన్' లేదా నైట్ రొటీన్‌ని అలవాటు చేసేనత పిల్లలు అంత సుఖనిద్రకి అలవాటు పడతారు, ఆరోగ్యంగా ఎదుగుతారని వాటి ఫలితాలు తేల్చాయి. కాబట్టి, మీ ఇంట్లోనూ ప్రయత్నించేయండి. మంచి విశ్రాంతి, భవిష్యత్తును మీ పిల్లలకు అందించండి. ◻

ఇప్పుడు పడుకోబెట్టి, ఆరోజు బాగా నవ్వించినవి, వాళ్లు చేసిన నచ్చిన పనులు... ఇలా సానుకూల అంశాల గురించి మాట్లాడండి. ఇలా చేయడం వల్ల మనసు నిండటమే కాదు, భద్రతా భావన కూడా కలుగుతుందట. దీంతో ప్రశాంతంగా నిద్రపోతా మరోరోజు కథ చెప్పొచ్చు.

# చేతి మీద పడుకోకుండా !

**చాలా మంది మహిళలకు పక్కకు తిరిగి పడుకోవడం అలవాటు. చేతినే దిండుగా చేసుకుని పడుకోవడం సౌకర్యంగానూ భావిస్తుంటారు.** అదీ కుదరకపోతే భర్త హ్యాండ్‌నే ఆసరాగా చేసుకుని నిద్రిస్తుంటారు. పిల్లలు అంతే! ఎంచక్కా అమ్మ పక్కన చేరి ఆ చేతి మీదేపడుకుంటారు. ఇంతవరకూ బాగానే ఉన్నా.. దీనివల్ల దీర్ఘకాలంలో చేయిపై ఒత్తిడి పడి నొప్పితో బాధపడే అవకాశమూ లేకపోలేదు. నిజమే అంటారా? ఆ బాధితుల్లో మీరూ ఉన్నారా? అయితే, ఇక మీకు ఆ చింత అక్కర్లేదు. ఎందుకంటే, చెయ్యిని పెట్టుకోవడానికి ప్రత్యేక ఏర్పాటుతో రూపొందించిన ఈ మెమరీఫోమ్ కడల్ పిల్లోలు



చేతిమీద ఏ మాత్రం భారం పడకుండా చేస్తాయి. హాయిగా నిద్రపుచ్చుతాయి. మీరూ ప్రయత్నించి చూడండి. ◻




## హాంకాంగ్ ఓపెన్‌లో సాత్విక్-చిరాగ్ జోడీ ఓటమి

**న్యూఢిల్లీ:** హాంకాంగ్ ఓపెన్ 2025లో సాత్విక్-చిరాగ్ జోడీ ఓటమితో రన్నరప్‌గా సరిపెట్టుకుంది. ఈ భారత జంట చైనాకు చెందిన ఆరో సీడ్ వీ కెంగ్ లియాంగ్ మరియు చాంగ్ వాంగ్ ద్వయం చేతిలో ఓడిపోయింది. ఆదివారం జరిగిన హాంకాంగ్ ఓపెన్ సూపర్ 500లో భారత బ్యాడ్మింటన్ పురుషుల డబుల్స్ జోడీ సాత్విక్ సాయిరాజ్ రాంకిరెడ్డి-చిరాగ్ శెట్టి రన్నరప్‌గా నిలిచారు. ఎనిమిదో సీడ్ రాంకిరెడ్డి-శెట్టి జోడీ చైనాకు చెందిన ఆరో సీడ్ వీ కెంగ్ లియాంగ్‌చాంగ్ వాంగ్ జోడీ చేతిలో 21-19, 14-21, 17-21 తేడాతో పరాజయం చెందింది. 2025 బిడబ్ల్యూఎఫ్ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లతో సహా ఐదు సెమీఫైనల్స్‌లో నిష్క్రమణలను ఎదుర్కొన్న ఈ భారత జంట హాంకాంగ్ ఓపెన్‌ను ఒక గంటలోపు పోటీని ముగించింది. రెండవ గేమ్‌లో సాత్విక్, చిరాగ్ జోడీ ప్రదర్శన నిరాశాజనకంగా ప్రారంభమైంది. ఆట సగం ముగిసే సమయానికి 5-11తో వెనుకబడి ఉంది. ఆ తర్వాత ఈ జంట తమ లక్ష్యాన్ని మరింతగా పెంచుకుని, త్వరలోనే అంతరాన్ని కేవలం రెండు పాయింట్లకు తగ్గించింది. అయితే, వారు తమ లయను కోల్పోయి చివరికి రెండవ సెట్‌ను 14-21తో వదులుకున్నారు. మూడవ మరియు చివరి గేమ్‌లో, చైనాకు చెందిన వీచాంగ్ 0-6తో ప్రారంభంలో ఆరు పాయింట్ల ఆధిక్యాన్ని సాధించి, దాన్ని 11-2కి పెంచారు. అయితే భారత జంట తీవ్రంగా పోరాడి 17-20తో అంతరాన్ని తగ్గించింది. కానీ తదుపరి పాయింట్‌లో షటిల్‌ను వైడ్ చేసి మ్యాచ్‌ను వదులుకుంది. ఇక పురుషుల సింగిల్స్ ఫైనల్లో లక్ష య సేన్, చైనాకు చెందిన రెండో సీడ్ షి ఫెంగ్ లీతో తలపడనున్నాడు.



## వరల్డ్ కప్ నింగ్బోలో మేఘనకు కాంస్యం

**న్యూఢిల్లీ:** ఐఎస్‌ఎస్‌ఎఫ్ ప్రపంచ కప్ నింగ్బో-2025లో మేఘనా సజ్జనార్ తొలి కాంస్యం సాధించగా, స్వప్నిల్ కుసాలే ఓటమితో టోర్నీ నుండి నిష్క్రమించింది. చైనాలోని నింగ్బోలో ఆదివారం జరిగిన ఈ ప్రపంచ కప్‌లో మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఈవెంట్‌లో మేఘనా సజ్జనార్ కాంస్యం గెలుచుకోవడం ద్వారా తన తొలి వ్యక్తిగత అంతర్జాతీయ పతకాన్ని సాధించింది. 31 ఏళ్ల మేఘనా 632.6 స్కోరుతో క్వాలిఫైయింగ్‌లో ఏడో స్థానంలో నిలిచి పతక రౌండ్‌కు చేరుకుంది. ఫైనల్‌లో అస్థిరమైన ప్రారంభం ఉన్నప్పటికీ, ఆమె 230.0 షూట్ చేసి కాంస్యం సాధించడానికి పట్టుదలతో ప్రయత్నం చేసింది. ఈ టోర్నీలో చైనాకు చెందిన టీనేజర్ పెంగ్ జిన్లు 255.3 పాయింట్లతో కొత్త ప్రపంచ రికార్డు సృష్టించి స్వర్ణం సాధించగా, నార్వేకు చెందిన ఒలింపియన్ జీనెట్ హెగ్ డ్యూస్టాడ్ 252.6 పాయింట్లతో రజతం గెలుచుకుంది. కాగా భారత్‌కు చెందిన పారిస్ 2024 కాంస్య పతక విజేత స్వాప్నిల్ కుసాలే పురుషుల 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్లలో పరాజయాన్ని చవిచూశాడు. 587-30+తో 21వ స్థానంలో నిలిచి ఫైనల్‌కు దూరమయ్యాడు. ఇక కిరణ్ అంకుష్ జాదవ్ నాల్గవ స్థానంలో (590-31+) అర్హత సాధించినా, చివరి రౌండ్ ప్రారంభంలోనే నిష్క్రమించాడు. ఈషా, మేఘన మరియు కిరణ్ తప్ప, మరే ఇతర భారతీయ షూటర్లు నింగ్బోలో ఫైనల్స్‌కు చేరుకోలేదు. ఒలింపిక్ పతక విజేత మను భాకర్ ఈ ఈవెంట్‌లో పాల్గొనలేదు. దీంతో మేఘనా పోడియం ఫినిషింగ్‌తో, భారత్ రెండు పతకాలతో టోర్నమెంట్‌ను ముగించింది. ఇప్పటికే శనివారం ఇషా సింగ్ మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్‌లో స్వర్ణం సాధించింది.

### ఆస్ట్రేలియాతో మహిళల వన్డేలో..

## భారత్ 281 పరుగుల స్కోర్


### వరల్డ్ రికార్డు బద్దలు కొట్టిన స్మృతి, ప్రతీక

**న్యూఢిల్లీ:** ఆస్ట్రేలియాతో వన్డేలో భారత్ మహిళా క్రికెట్ జట్టు భారీ స్కోరు చేసింది. ఓపెనర్లు స్మృతి మంధాన, ప్రతీకా రావల్ అద్భుత ప్రదర్శన కనపరిచారు. ఇద్దరూ అర్థ శతకాలతో చెలరేగి 100కు పైగా పరుగుల భాగస్వామ్యం నమోదు చేశారు. ఈ క్రమంలోనే పాతికేళ్లుగా బెలిండా క్లార్క్-లిసా కైట్లీ పేరిట ఉన్న వన్డే ప్రపంచ రికార్డును స్మృతి-ప్రతీకా బద్దలు కొట్టారు. ఆదివారం న్యూ ఛండీగఢ్‌లోని మహారాజా యాదవీంద్ర సింగ్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరిగిన తొలి అంతర్జాతీయ మహిళల వన్డే సిరీస్ తొలి మ్యాచ్‌లో ఆస్ట్రేలియాపై భారత జట్టు 50 ఓవర్లలో 7 వికెట్లు నష్టానికి 281 పరుగుల భారీ స్కోరును నమోదు చేసింది. స్మృతి, ప్రతీక రావల్, హర్లీన్ ల అర్థ సెంచరీలతో రాణించారు. ముందుగా బ్యాటింగ్ ఎంచుకున్న ప్రతీక, స్మృతి ఫ్లాట్ పిచ్‌పై 114 పరుగుల ఓపెనింగ్ భాగస్వామ్యంతో భారత స్కోరుకు పునాది వేశారు. ప్రతికా 96 బంతుల్లో 64 పరుగులు చేసి టాప్ స్కోరర్‌గా నిలిచింది. అర్థ సెంచరీ ఆరు బౌండరీలతో స్మృతి 63 బంతుల్లో 58 పరుగులు చేసింది. ఆమె 32వ ఒవిడీ అర్థ సెంచరీ ఆరు ఫోర్లు, రెండు సిక్సర్లతో ఫోబ్ లిచ్‌ఫీల్డ్ చేతిలో రనౌట్ అయింది. అలాగే హర్లీన్ మిడిల్ ఓవర్లలో 57 బంతుల్లో 54 పరుగులు చేసింది. అందులో తన నాలుగో వన్డే అర్థ సెంచరీలో 4 బౌండరీలు, 2 సిక్సర్లు ఉన్నాయి. కెప్టెన్ హర్మన్ ప్రీత్‌కౌర్ 11, జెమీమా రోడ్రిగ్స్ 18 పరుగులు మాత్రమే చేయగా, చివరి ఓవర్లలో రిచా ఘోష్ 25, రాధా యాదవ్ 19, దీప్తి శర్మ 20 నాటౌట్‌గా ఫర్వాలేదనిపించారు. ఈ క్రమంలో 50 ఓవర్లలో భారత్ జట్టు ఏడు వికెట్లు నష్టానికి 281 పరుగులు చేసింది. ఇది మహిళల వన్డేల్లో ఆస్ట్రేలియాపై భారత్ సాధించిన రెండవ అత్యధిక స్కోరు. ఆస్ట్రేలియా బౌలర్లలో పేసర్ మేఘన్ షట్ రెండు వికెట్లు పడగొట్టగా, అలానా కింమ్ గార్త్, అన్నాబెల్, సదర్‌లాండ్, అలనా కింగ్, తహ్లియా మెక్‌గ్రాత్ ఒక్కో వికెట్ తీసుకున్నారు.









### వరల్డ్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో..

## ఫైనల్స్‌కు కుషారే

న్యూఢిల్లీ: ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్-2025, హైజంప్‌లో సర్వేష్ కుషారే ఫైనల్‌కు చేరిన తొలి భారతీయుడుగా రికార్డుకెక్కాడు. టోక్యోలోని నేషనల్ స్టేడియంలో ఆదివారం జరిగిన పోటీల్లో 29 ఏళ్ల జంపర్ అర్హత పోటీలో 2.25 మీటర్లు దూకి, పురుషుల హైజంప్ ఫైనల్‌కు టాప్ 12 అథ్లెట్లలో చారిత్రాత్మక స్థానాన్ని సంపాదించుకున్నాడు. ఫైనల్‌లో చోటు దక్కించుకోవడానికి తన రెండవ ప్రయత్నంలో 2.25 మీటర్లు క్లియర్ చేశాడు. గత సంవత్సరం పారిస్ ఒలింపిక్స్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన కుషారే, 2.16 మీటర్లతో విజయవంతమైన క్లియరెన్స్‌తో ఓపెనింగ్ చేశాడ. ఆ తర్వాత 2.21 మీటర్లతో, ఆపై 2.25 మీటర్లకు పైగా ప్రయాణించి తన చారిత్రాత్మక అర్హతను నిర్ధారించుకున్నాడు. ఇక ఒలింపిక్ ఛాంపియన్ జియాన్మార్కో తంబేరి 2.21 మీటర్లు జంప్ చేయడంలో విఫలమై పోటీ నుండి నిష్క్రమించాడు. అలాగే ప్రస్తుత ఒలింపిక్ ఛాంపియన్, న్యూజిలాండ్‌కు చెందిన హామీష్ కెర్ కూడా 2.25 మీటర్లు క్లియర్ చేసి సులభంగా అర్హత సాధించాడు. కాగా పురుషుల హైజంప్ ఫైనల్ ఈ నెల 16వ తేదీన జరగనుంది.

### వరల్డ్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో

## పసిడితో మెరిసిన జాస్మిన్




**న్యూఢిల్లీ:** ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో ఒలింపిక్ రజత విజేతను ఓడించి భారత్ బాక్సర్ జాస్మిన్ స్వర్ణంతో మెరిసింది. ఇదే టోర్నీలో భారత్‌కు చెందిన మరో బాక్సర్ నుపుర్ రజతాన్ని దక్కించుకుంది. లివర్‌పూల్‌లో ఆదివారం జరిగిన పోటీల్లో జాస్మిన్ లంబోరియా 57 కిలోల బరువు విభాగంలో తన తొలి బంగారు పతకాన్ని సాధించింది. పారిస్ ఒలింపిక్స్ రజత పతక విజేత పోలాండ్‌కు చెందిన పారిస్ స్జెరెమెటాపై అద్భుతమైన విజయం సాధించింది. జాస్మిన్ రౌండ్ 2, 3లో దూసుకుపోయి నంబర్ వన్ సీడ్ స్జెరెమెటాను 4-1 తేడాతో ఓడించి తన తొలి ప్రపంచ ఛాంపియన్‌షిప్ పతకాన్ని గెలుచుకుంది. అంతేకాకుండా ఈ ఎడిషన్ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో భారతదేశానికి ఇది తొలి స్వర్ణం. కాగా జాస్మిన్ ఈ ఏడాది అస్తానాలో జరిగిన ప్రపంచ బాక్సింగ్ కప్‌లో బంగారు పతకాన్ని గెలుచుకుంది. ఆమె బర్మింగ్‌హామ్ 2022 కామన్వెల్త్ గేమ్స్, 2021 ఆసియా ఛాంపియన్‌షిప్‌లో కాంస్య పతకాలను కూడా కైవసం చేసుకుంది. ఇక 80 కిలోల ఫైనల్‌లో పోలాండ్‌కు చెందిన అగాటా కాజ్మార్స్కా చేతిలో ఓడిపోయి భారత్‌కు చెందిన నుపుర్ రజతం సాధించింది. సెమీఫైనల్లో, జైస్మిన్ వెనిజులాకు చెందిన ఒమైలిన్ కరోలినా అల్కాలా సెగోవియాను 5-0 తేడాతో ఓడించింది. అలాగే 80 కిలోల విభాగంలో మరో భారత్ బాక్సర్ పూజా రాణి ఇంగ్లాండ్‌కు చెందిన ఎమిలీ అస్క్విత్‌తో జరిగిన అద్భుతమైన సెమీఫైనల్ తర్వాత పోడియం ఫినిషింగ్‌తో సరిపెట్టింది.

## డేవిస్ కప్ విజేతగా సుమిత్



**న్యూఢిల్లీ:** భారత్ స్విట్జర్లాండ్‌ను ఓడించి తొలి యూరోపియన్ విదేశీ డేవిస్ కప్ విజయాన్ని సాధించింది. ఈ విజయం భారత్ 2026 వరల్డ్ గ్రూప్ క్వాలిఫయర్స్ మొదటి రౌండ్‌కు చేరుకోవడానికి అర్హత కల్పిస్తుంది. భారత్ కాలమానం ప్రకారం ఆదివారం బీల్‌లో జరిగిన డేవిస్ కప్ 2025 ప్రపంచ గ్రూప్ టైలో భారత నెంబర్ వన్ ప్లేయర్ సుమిత్ నాగల్‌తో కూడిన పురుషుల జట్టు స్విట్జర్లాండ్‌ను 3-1 తేడాతో ఓడించి చరిత్ర సృష్టించింది. దీంతో 32 సంవత్సరాల తర్వాత ఒక యూరోపియన్ దేశంపై భారత్ సాధించిన తొలి విదేశీ డేవిస్ కప్ విజయం ఇది. చివరిసారిగా 1993లో ఫ్రాన్స్‌పై విజయం సాధించింది. ఇక నిర్ణయాత్మక రివర్స్ సింగిల్స్ రబ్బర్‌లో సుమిత్ నాగల్ 6-1, 6-3 తేడాతో స్విట్జర్లాండ్‌కు చెందిన హెన్రీ బెర్నెట్‌పై విజయం సాధించి విజయాన్ని నమోదు చేశాడు. డేవిస్ కప్ స్టాండింగ్స్‌లో 37వ స్థానంలో ఉన్న భారతదేశం, తొమ్మిదో సీడ్ స్విట్జర్లాండ్ (24వ ర్యాంక్)ను ఓడించి 2026 వరల్డ్ గ్రూప్ క్వాలిఫయర్స్ మొదటి రౌండ్‌లో స్థానాన్ని సంపాదించుకుంది. రివర్స్ సింగిల్స్‌లో మొదటి మ్యాచ్‌లో 18 ఏళ్ల బెర్నెట్‌ను ఎదుర్కొన్న సుమిత్ ప్రారంభంలోనే బ్రేక్ వేసి ఆధిపత్యం చెలాయించాడు. డేవిస్ కప్‌లో అరంగేట్రం చేసిన దక్షిణేశ్వర్ సురేష్ తొలి సింగిల్స్ రబ్బర్‌లో 76(4), 63తో హోమ్ ఫేవరెట్ జెరోమ్ కిమ్‌ను ఓడించాడు. 626వ ర్యాంక్‌లో ఉన్న సురేష్ అద్భుతమైనప్రదర్శన చేశాడు. వరుససెట్లలో మ్యాచ్‌ను కైవసం చేసుకునే ముందు బహుళ బ్రేక్ పాయింట్లను కాపాడుకున్నాడు. తరువాత సుమిత్ నాగల్ 6-3, 7-6(4)తో రెండుసార్లు ఒలింపియన్ మార్క్‌ఆండ్రియా హ్యూస్లర్‌ను ఓడించాడు. మొదటి సెట్‌లో నాగల్ రెండుసార్లు హ్యూస్లర్‌ను బ్రేక్ చేసి, రెండవ సెట్ టైబ్రేక్‌లో భారత్‌కు 2-0 ఆధిక్యాన్ని ఇచ్చాడు.

### శీతాకాల సమావేశాల్లోనే

## 'ఎఫ్‌డిఐ' బిల్లు!



**న్యూఢిల్లీ,సెప్టెంబరు 14:** బీమారంగంలో నూరుశాతం ఎఫ్‌డిఐలను అనుమతించే బిల్లును వచ్చే సమావేశాల్లోనే ప్రవేశపెడుతున్నట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. బీమారంగంలోకి మరిన్ని సంస్థలను తీసుకురావడంతోపాటు అధిక సంఖ్యలో ఉద్యోగాల సృష్టికి ఇది ఉపకరిస్తుందన్నారు. ఈ ఎఫ్‌డిఐ బిల్లును రానున్న శీతకాలసమావేశాల్లోనే పార్లమెంటులోప్రవేశపెట్టనున్నట్లు ఆమె తెలిపారు. బీమా చట్టం 1938 లోని వివిధ నిబంధనలను సవరించాలని ఆర్థికమంత్రిత్వశాఖ ప్రతిపాదించింది.
బీమారంగంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు ప్రస్తుత 74శాతంనుంచి 100శాతం వరకూ పెంచడంతోపాటు అధీకృత మూలధనం తగ్గించడం, కాంపొజిట్ లైసెన్స్ నిబంధన వంటివి ఈ బిల్లులో ఉన్నాయన్నారు. బీమా నియంత్రణ అభివృద్ధిచట్టం 1999లోనూ సవరణలు ప్రతిపాదించినట్లు తెలిపారు. పాలసీదారుల ప్రయోజనాలను ప్రోత్సహించడం వారి ఆర్థికభద్రతను పెంచడం బీమా మార్కెట్‌లోకి మరిన్ని భాగస్వామ్య సంస్థలప్రవేశాన్ని సులభతరంచేయడం ఆర్థికవృద్ధి, ఉపాధికల్పనకు ప్రతిపాదిత సవరణలు ఉపయోగపడతాయని నిర్మలాసీతారామన్ అన్నారు. మోడీ ప్రభుత్వం తెచ్చినసంస్కరణలు భారత్‌లోని ప్రతి పౌరుడు సాధించిన విజయమని అన్నారు.
దీపావళి పండుగకు ముందేజీఎస్టీ సంస్కరణలను ప్రారంభించాలని ప్రధాని నరేంద్రమోడీ సూచించారు. ప్రధాని మోడీసూచనమేరకే ఈ సంసనకరణలనుప్రజలకుముందు తీసుకువచ్చి దేశంలోని సామాన్య కుటుంబాలపైభారం తగ్గించామన్నారు. ప్రజల సాధికారతతోనే భారత్ అభివృద్ధిచెందిన దేశంగా మారుతుందన్నారు.



### న్యూయార్క్‌లో ముకేష్ అంబాని లగ్జరీ విల్లా

## కొనుగోలు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 14:** రిలయన్స్ ఛైర్మన్ ముకేష్ అంబాని అమెరికాలో విలువైన ఆస్తులు కొనుగోలుచేసారు. న్యూయార్క్‌లో ప్రస్తుతం 145కోట్లను వెచ్చించి లగ్జరీ భవనం కొనుగోలుచేసారు. న్యూయార్క్‌లోని ట్రైబెకా ప్రనాంతంలో భవంతిని 17.4 మిలియన్ డాలర్లు అంటే మన కరెన్సీలో రూ.145 కోట్లతో కొనుగోలుచేసినట్లు రియల్‌డీల్ తాజా నివేదికతో వెలుగులోకి వచ్చింది. 2023 ఆగస్టులోమన్‌హట్టన్‌లో హడ్సన్ నదికి ఎదురుగా ఉన్న తన 9 మిలియన్ డాలర్ల విల్లాను విక్రయించిన రెండేళ్లకే అంబాని ఈ కొత్త భవంతిని కొనుగోలుచేసారు. ఈ భవనం రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ అమెరికా విభాగం కొనుగోలుచేసింది. టెక్ బిలియనీర్ రాబర్ట్ పెరా 2018లో 20 మిలియన్ డాలర్లకుకొనుగోలుచేసి లగ్జరీభవనంగా మార్చాలనిచూసారు. తర్వాత 2021లో దాన్ని 25 మిలియన్ డాలర్లకు విక్రయించారు. ఇపుడు అదే భవనం 17.4 మిలియన్ డాలర్లకు అంబాని సొంతంచేసుకున్నారు. అంబాని ప్రస్తుతం 97.9 బిలియన్ డాలర్లతో అంటే రూ.8.2 లక్షలకోట్లతో దేశంలోనే అత్యంత సంపన్నవ్యక్తిగా నిలిచారు. రెండోస్థానంలో ఆదానిగ్రూప్ ఛైర్మన్ గౌతమ్ ఆదాని ఉండగా ఆయన నికర ఆస్తులు 82.1 బిలియన్ డాలర్లని తేలింది.

## మరోసారి తెరపైకి బ్యాంకుల విలీనం!




**న్యూఢిల్లీ, సెప్టెంబరు 14:** దేశంలో ఇప్పటి వరకు చాలా సార్లు బ్యాంకుల విలీనం జరిగింది. రెండు మూడు బ్యాంకులను కలిపి ఒక పెద్ద బ్యాంకుగా ఏర్పాటు చేసి సేవలందిస్తున్నారు. ఇప్పుడు మరోసారి ప్రభుత్వ రంగ బ్యాంకుల విలీనం అంశం తెరపైకి వచ్చింది. వికసిత్ భారత్ 2047 విజన్‌లో భాగంగా ప్రపంచంలోని అతిపెద్ద బ్యాంకుల్లో భారత్‌కు చెందిన బ్యాంకులకు చోటు కల్పించాలని లక్ష్యంగా కేంద్రం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఈ మేరకు ప్రభుత్వ రంగ బ్యాంకుల అధిపతులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పీఎస్‌బీ మంథన్ 2025 పేరిట ఈ సమీక్ష చేపట్టారు. ఇందులో కీలక అంశాలపై చర్చించినట్లు తెలుస్తోంది. ప్రపంచంలోని టాప్20 బ్యాంకుల్లో రెండు దేశీయ బ్యాంకులకు చోటు కల్పించేలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా మరిన్ని బ్యాంకులను విలీనం చేసే అవకాశాలపై చర్చిచినట్లు సమాచారం. ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని ఆర్థిక సేవల విభాగం గత రెండు రోజుల పాటు పీఎస్‌బీ మంథన్ 2025ని నిర్వహించింది. ఇందులో తొలి రోజున బ్యాంకుల విలీనం, వరల్డ్ టాప్ 20లో రెండు దేశీయ బ్యాంకుల లక్ష్యంపై చర్చించినట్లుగా ప్రభుత్వ వర్గాలు సూత్రప్రాయంగా వెల్లడించాయి. కేంద్రం జాబితాలో పెద్ద బ్యాంకులు ఉన్నట్లు సమాచారం. అయితే బ్యాంకుల విలీనం, ఏ బ్యాంకులు ఉండొచ్చు అనే విషయాలపై క్లారిటీ లేదు. ప్రస్తుతం ఆస్తుల విలువ పరంగా చూసుకుంటే వరల్డ్ టాప్ 100లో భారత్ నుంచి కేవలం రెండు బ్యాంకులే చోటు దక్కించుకున్నాయి. దేశీయ అతిపెద్ద బ్యాంకింగ్ సేవల సంస్థ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) 43వ స్థానంలో కొనసాగుతోంది. ఇక ప్రైవేట్ రంగంలోని దిగ్గజ బ్యాంక్ అయిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ (హెచ్‌డిఎఫ్‌సి) 73వ స్థానంలో ఉంది. పీఎస్‌బీ మంథన్ 2025లో జరిగిన ప్రధాన చర్చలంలో వరల్డ్ టాప్ 20 బ్యాంకుల్లో మన దేశానికి రెంచిన రెండు బ్యాంకులను నిలపడంపై చర్చ జరిగినట్లు సమాచారం. పబ్లిక్ సెక్టార్ బ్యాంకులను విలీనం చేస్తారా అని అడిగిన ప్రశ్నకు అలాంటి చర్చ జరగలేదని అధికారులు తెలిపారు. అయితే, విలీనం ద్వారానే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. ఈ సమావేశానికి డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సెక్రెటరీ ఎం నాగరాజు నేతృత్వం వహించారు. ఆర్థిక శాఖ సీనియర్ అధికారులు, ప్రభుత్వ బ్యాంకుల టాప్ ఎగ్జిక్యూటివ్స్ పాల్గొన్నారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఛైర్మన్ సీఎస్ శెట్టి, పంజాబ్ నేషనల్ బ్యాంక్ సీఈఓ అశోక్ చంద్ర హాజరయ్యారు. సమావేశం తొలి రోజున చీఫ్ ఎకానమిక్ అడ్వైజర్ వీ అనంత నాగేశ్వరన్, ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ స్వామినాథన్ జే, డీఎఫ్‌ఎస్ మాజీ సెక్రెటరీ, ఎక్స్ ఐఆర్‌డీఏఐ ఛైర్మన్ దెబాశిస్ పాండా మాట్లాడారు.

## దీపావళికి ఇపిఎఫ్‌ఓ ధమాకా!




**న్యూఢిల్లీ,సెప్టెంబరు 14:** ఎటిఎంలద్వారా పిఎఫ్ డబ్బు ఉపసంహరించుకునేకొత్త సౌకర్యం త్వరలో ప్రవేశపెట్టబోతున్నారు. ప్రావిడెంట్ ఫండ్ ఖాతాలను సులభవంగా నిర్వహించుకునేందుకు ఇపిఎఫ్ 3.0 పేరుతో కొత్త విధానాలను ప్రభుత్వం ప్రవేశపెడుతోంది. నిజానికి సెప్టెంబరులోనే ఈ కొత్తవిధానాలు రావాల్సి ఉంది. కానీ కొన్ని సాంకేతిక సమస్యల కారణంగా వాటిని నిలిపివేసారు. దీపావళికి ముందు ఏటిఎంలద్వారా పిఎఫ్ సొమ్ము ఉపసంహరించుకునే వెసులుబాటు కష్టమర్లకు కల్పిస్తుందని తెలుస్తోంది. బ్యాంకుల తరహాలోనే సరళమైన లావాదేవీని సృష్టించేప్రయత్నాల్లో భాగంగా ప్రభుత్వం ఈచర్య తీసుకోనున్నట్లు వెల్లడించింది. అక్టోబరు 10,11 తేదీల్లో ఇపిఎఫ్ఓ ట్రస్టుకమిటీ సమావేశం కేంద్ర కార్మిక మంత్రి మన్సుక్ మాండవీయ అధ్యక్షతన జరుగుతుంది. దీపావళికి ముందు సుమారు 8 కోట్లమంది పిఎఫ్ చందాదారులోటిఫికేషన్‌కు సంబంధించి ఈసమావేశంలోముఖ్యమైన నిర్ణయాలు తీసుకుంటారు. యుపిఐద్వారా పిఎఫ్ డబ్బును ప్రవేశపెట్టడం వంటి బ్యాంకింగ్‌షేవలపైనే చర్చించనున్నారు. నెలకు అదనంగా కనీసం పెన్షన్‌ను రూ.1000నుంచి 1500 నుంచి 2500కు పెంచే ప్రణాళిక గురించి కూడా చర్చకు రానున్నట్లు తెలుస్తోంది. వైద్యవిద్య వివాహం ఇల్లు కొనుగోలు వంటి కొన్ని నిర్దిష్టకారణాలతో పిఎఫ్ ఖాతాదారులు ఇంటర్నెట్‌ద్వారా రూ.5 లక్షలవరకూ వారి సొమ్ము విత్‌డ్రాచేసుకోవచ్చు. కానీ డబ్బులుచేతుల్లోకి రావడానికి కనీసం రెండుమూడురోజులు పడుతోంది. కొత్తగా పిఎఫ్‌లో ఏటిఎం సేవలు అందుబాటులోకి వస్తే సొమ్ములు తీసుకోవడం మరింత సులువవుతుంది. అయితే బ్యాంకులద్వారా పిఎఫ్ సొమ్ము సులభంగా పొందేలాచేయడంచేస్తే పథకం ఉద్దేశ్యం దెబ్బతింటుందని కార్మిక సంఘాలు ఆందోళన వ్యక్తంచేసాయి. పిఎఫ్ అనేది ఉద్యోగులు తమ పదవీ విరమణ సమయంలో అత్యవసర పరిస్థితులకు ఉపయోగపడే పథకం అని వాటిని ఎటిఎంలద్వారా తీసుకోడానికి అనుమతించేలా పథకం ఉద్దేశ్యం దెబ్బతింటుందని అంటున్నారు.




## బోయింగ్‌పై రూ.27.36 కోట్ల జరిమానా

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 14:** ప్రముఖ విమాన తయారీ సంస్థ బోయింగ్‌కు అమెరికా నియంత్రణ సంస్థ ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ మరోసారి ఫైన్ విధించింది. భద్రతకు సంబంధించిన ఉల్లంఘనలను గుర్తించడంతోసుమారు 3.1 మిలియన్ డాలర్లు అంటే రూ.27.36 కోట్లు చెల్లించాలని ఆదేశించింది. ఈ ఉల్లంఘనలు మొత్తం సెప్టెంబరు 2023నుంచి ఫిబ్రవరి 2024లోపు చోటుచేసుకున్నవేనని ఎఫ్ఎఎ తెలిపింది. అలాస్కా ఎయిర్‌లైన్స్ డోర్ ఊడిపోవడంవంటి వాటాతో చాలా సంఘటనలున్నాయి. వాషింగ్టన్‌లోని రెంటాన్ ఫ్యాక్టరీలోనిర్వహించినదర్యాప్తులో క్వాలిటీ సిస్టమ్స్‌లో వందల ఉల్లంఘనలునానయి. కెన్సాస్‌లోని బోయింగ్‌సబ్‌కాంట్రాక్టుసంస్థ స్పిరిట్ ఏరోసిస్టమ్స్‌లోనూ ఇదేపరిస్థితి నెలకన్నది. 2విమానాలు ఎగిరేందుకు యోగ్యత లేనివిగా గుర్తించింది. నాణ్యతలేనివిమానానికి ధృవీకరణ వచ్చేట్లు సంతకంచేయాలని ఒత్తిడిచేసినట్లు గుర్తించారు. పెనాల్టీపై స్పందించేందుకు బోయింగ్‌కు 30 రోజుల గడువు ఉంది. ఈ ఏడాదిజూన్‌లో అమెరికా నేషనల్‌ట్రాన్స్‌పోర్టేషన్ సేఫ్టీబోర్డు 17 నెలలపాటు నిర్వహించిన దర్యాప్తు నివేదికను విడుదలచేసింది. బోయింగ్ తయారీ భద్రతా పర్యవేక్షణలో చాలా లోపాలున్నా ఎఫ్ఎఎ తనిఖీలు ఆడిట్స్ ఏమాత్రం ప్రభావంచూపలేదని పేర్కొంది. అందువల్లనే అలాస్కా సంఘటన చోటుచేసుకున్నట్లు గుర్తించింది.



## బ్యాంకుల్లో 444 రోజుల డిపాజిట్లపైనే ఎక్కువ ఆసక్తి!

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 14:** బ్యాంకులు కొత్తగాప్రవేశపెట్టిన 444 రోజుల డిపాజిట్ అన్నివర్గాలను ఆకర్షిస్తోంది. వడ్డీరూపంలోనే కాకుండా పెట్టుబడిదారులకు ఇది బెస్ట్ ఆప్షన్‌గా కనిపిస్తోంది. అయితే ప్రభుత్వరంగ బ్యాంకులన్నింటికంటే ఇండియన్ ఓవర్సీస్‌బ్యాంకు 6.75% వడ్డీతో ఎక్కువ రాబడి ఇస్తోంది. 10.25 లక్షలుపెట్టుబడి పెడితే ఈ బ్యాంకులు మెచూరిటీ 11,11,952.08 వరకూ లభిస్తుంది. రెండోస్థానంలోఉన్న పంజాబ్‌సింధ్ బ్యాంకు 6.70శాతం, ఎస్‌బిఐ తన అమృత్ సృష్టితో 6.60శాతంతో మూడోస్థానంలోను, కెనరాబ్యాంకు 6.50శాతంతో చివరిస్థానంలోను ఎక్కువ రిటర్నులిచ్చే బ్యాంకుల్లో నిలిచాయి. ఎస్‌బిఐలో అయితే 6.60సాధారణ వడ్డీరేటు. ఈ క్రమంలో రూ.10.25 లక్షలకు 444 రోజుల తర్వాత సుమారు రూ.11,09,958.24 వస్తుంది. వడ్డీరూపంలో రూ.94,958.24 పొందుతారు. పంజాబ్ సింధ్‌బ్యాంకులో అయితే ఇదే మొత్తానికి మెచూరిటీ విలువ సుమారు 11,11,287.15 అవుతుంది. వడ్డీరూపంలో 86,287.15 వస్తుంది. ఇక ఐఒబిలో అయితే 444 రోజుల ఎఫ్డీలో 6.75శాతం వడ్డీతో 10.25 లక్షల సొమ్ముకు 11,11,952.08 వస్తుంది. వడ్డీ 86,952.08గా ఉంది. ఇక కెనరాబ్యాంకు అయితే ఈస్కీంపై 6.50 వడ్డీ ఇస్తోంది. ఈ జాబితాలో తక్కువ వడ్డీరేటు. 10.25 లక్షలసొమ్ముకు సుమారు 11,08,630.59 వస్తుంది. వడ్డీ కేవలం రూ.83,630.59 మాత్రమే వస్తుంది. రిటర్నులు కొంచెం తక్కువగా ఉంటాయి.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.